www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 10-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 85 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: చవితి ఉ. 7.52 తదుపరి పంచమి; నక్షత్రం: మఖ ఉ. 10.15 తదుపరి పుబ్బ వర్జ్యం: రా. 7.11-8.58; దుర్ముహూర్తం: ఉ. 11.54-12.56; అమృతఘడియలు: ఉ. 7.36-9.22; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.49 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మాక్కూడా ఫైళ్లు ఇస్తలేరు

పీసీ ఘోష్ కమిషన్‌కు నిపుణుల కమిటీ నివేదిక
ఏ ఫైళ్లు కావాలో చెబితే ఇప్పిస్తామన్న కమిషన్
20 మంది డీఈఈలను ప్రశ్నించిన జస్టిస్ ఘోష్
కాళేశ్వరం ప్రాజెక్టుపై సమాచారం అందించాలంటూ
వెదిరె శ్రీరామ్, కంచర్ల రఘుకు కమిషన్ పిలుపు 14





ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో హరీశ్‌రావు, సురేశ్‌రెడ్డి

మా హయాంలో ఫిరాయింపులు కాదు..

విలీనం చేసుకున్నాం

ప్రస్తుత ఫిరాయింపులపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం

- సుప్రీంకు వెళ్తాం.. పార్లమెంటులో ప్రస్తావిస్తాం
- ప్రజాసంబంధాల విషయంలో విఫలమయ్యాం
- మాకు ఓట్లు వేయకపోవడం ప్రజల తప్పు కాదు
- పార్టీ పేరు మార్పు వల్ల ప్రభావమేం పడలేదు
- కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకే కవితను జైలుకు..
- కేంద్రంలో ఏపీ సీఎం చంద్రబాబుది కీలక పాత్ర
- తెలుగు రాష్ట్రాలకు నిధులు తీసుకొస్తే మంచిదే
- తెలంగాణలో టీడీపీ బలపడితే.. మాకే లబ్ధి
- ఏపీలో జగన్ ఓడిపోతారని ఊహించలేదు
- 40% తెచ్చుకున్న జగన్ హీరో.. షర్మిల జీరో
- ఢిల్లీలో మీడియాతో కేటీఆర్ వ్యాఖ్యలు
- ఫిరాయింపు నేతలను ప్రజలు నమ్మరు: హరీశ్

న్యూఢిల్లీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో చోటుచేసుకుంటున్న ఎమ్మెల్యేల ఫిరాయింపులపై రాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. త్వరలోనే సుప్రీంకోర్టునూ ఆశ్రయిస్తామని, రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తామని తెలిపారు. ఇప్పటికే హైకోర్టులో కేసు వేశామని, స్పీకర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. మంగళవారం ఢిల్లీలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్‌రెడ్డి, దీవకొండ దామోదర్‌రావుతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. అనంతరం మీడియాతో చిట్‌చాట్ చేశారు. మీడియా సమావేశంలో

మిగతా 12వ పేజీలో...

'ప్రభుత్వాన్ని కూలగొట్టం' అనేదాకా చేరికలు!

కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కౌంటర్ 14

సన్నాయి నొక్కులెందుకు?

కేసీఆర్.. మీ వరకు వస్తే కానీ బాధ తెలియడం లేదా?

- ఈ సర్కారు నెల రోజుల్లో కూలుతుందని అనలేదా?
- ప్రభుత్వం సుస్థిరంగా ఉండేందుకు చేరికలు తప్పవు
- బీఆర్ఎస్ బలహీనపడినప్పుడల్లా పిల్లల్ని రెచ్చగొడుతున్నారు
- డీఎస్సీపై బీఆర్ఎస్, కోచింగ్ సెంటర్లది కృత్రిమ ఉద్యమం
- పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో దీక్షలు చేయించడం కాదు
- హరీశ్, కేటీఆర్ ఆర్ట్స్ కళాశాల దగ్గర ఆమరణ దీక్ష చేయాలి
- వాయిదా పడదమో.. వారి ప్రాణాలు పోవడమో జరగాలి
- మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ సమావేశంలో సీఎం రేవంత్

ఏడాదిన్నరలో పాలమూరు ప్రాజెక్టుల పూర్తి

- గ్రీన్ చానల్ ద్వారా నిధులు.. పనులపై ప్రతి నెలసమీక్ష
- 14 లేదా 15న నీటిపారుదల మంత్రితో మళ్లీ సమావేశం
- పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదాకు ప్రయత్నం
- అమ్మ ఆదర్శ కమిటీలకు పాఠశాలల పరిశుభ్రత బాధ్యత
- నేను కూడా కార్యాలయాల ఆకస్మిక తనిఖీలకు వెళ్తా
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూలై 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరుతుండడంపై పార్టీ ఫిరాయింపులంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, పదేళ్లలో బీఆర్ఎస్ ఇదే పద్ధతిన కాంగ్రెస్ సభ్యులను చేర్చుకోలేదా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అప్పుడు ఇదంతా ఏమైందని.. ఆయన వరకు వస్తే కానీ, బాధ తెలియలేదా? అని నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టే ప్రయత్నం చేయలేదా? ఈ సర్కారు నెల రోజుల్లో కూలుతుందని కేసీఆర్ అనలేదా? అని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ సుస్థిరత కోసం చేరికలు తప్పవని స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరించాలని, లేకపోతే ఫాంహౌజ్‌లో పడుకోవాలని, కాళ్లలో కట్టె పెడితే వీపు విమానం మోత మోగుతుందని కేసీఆర్‌ను హెచ్చరించారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్.. కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ

మిగతా 13వ పేజీలో...

క్రికెటర్ సిరాజ్‌కు ముఖ్యమంత్రి సన్మానం 11

ఉద్యోగం, ఇంటిస్థలం ఇవ్వాలని అధికారులకు ఆదేశం



జాతీయ రహదారుల పనులకు అడ్డంకులు రానీయం

- భూసేకరణ, ఇతరత్రా సమస్యల పరిష్కారం
- ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి సహకరించండి
- బందరు పోర్టును కలిపే హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు కూడా.. 13
- ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సీఎం రేవంత్
- నేడు రాష్ట్ర అధికారులతో కలిసి మళ్లీ సమీక్ష

అణు సహకారం

భారత్‌లో 6 హైపవర్ అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి రష్యా తోడ్పాటు

- లో-పవర్ అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు కూడా!
- ఆ దేశ అణు ఇంధన సంస్థ అధిపతి వెల్లడి
- భారత్‌లో ఫ్లోటింగ్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్లపై ఇరుదేశాల మధ్య కొన్నాళ్లుగా జరుగుతున్న చర్చలు

యుద్ధరంగం పరిష్కారం చూపదు

- బాంబులు, తుపాకులతో శాంతి చర్చలు కుదరవు
- ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి సహకరిస్తాం
- భారత్-రష్యా శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ
- తమ సైన్యంలో ఉన్న భారతీయులను వెనక్కి పంపటానికి రష్యా ఆమోదం
- మోదీకి ఆ దేశ అత్యున్నత పౌరపురస్కారం



ప్రధాని మోదీకి రష్యా అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్ర్యూ ది అపోస్టల్' ను అందజేసిన పుతిన్

మాస్కో, జూలై 9: భారతదేశానికి చాలాకాలంగా అణుఇంధన రంగంలో సహకారాన్ని అందిస్తున్న రష్యా.. మనదేశంలో మరో ఆరు హై-పవర్ అణువిద్యుత్ కేంద్రాల నిర్మాణంలో సహకరించడానికి ముందుకొచ్చింది. దీంతోపాటు లో-పవర్ అణువిద్యుత్ కేంద్రాల ఏర్పాటు అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు ఆ దేశ అణు ఇంధన సంస్థ రోసాటోమ్ సీఈవో అలెక్సీ లిఖచేవ్ వెల్లడించారు. మంగళవారంనాడు.. రష్యాలోని ఆటమ్ పెవిలియన్ సందర్శనకు వెళ్లిన భారత ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఆయనే దగ్గరుండి ఆ పెవిలియన్‌ను చూపించారు. చిన్న చిన్న ట్రాపికల్ న్యూక్లియర్ పవర్‌స్టేషన్లను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్మించుకోవడంలో భారత్‌కు సహకారం అందించేందుకు.. ఇందుకు అవసరమైన నిర్మాణ భాగాలను నేరుగా ఢిల్లీకి సరఫరా చేసేందుకు రష్యా సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోదీకి తెలిపారు. అలాగే.. భారతదేశంలో నాలుగో తరం అణుసాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయాలని రోసాటోమ్ కోరుకుంటున్నట్టు అలెక్సీ చెప్పారు. భారతదేశంలో 'ఫ్లోటింగ్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ల(ఎఫ్ఎన్‌పీపీ)' అభివృద్ధిపై కూడా రష్యా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆసక్తి చూపింది. ఫ్లోటింగ్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ అంటే.. ఓడలపై నిర్మించే అణువిద్యుత్ కేంద్రాలు. అమెరికా 1960ల్లోనే ఈ తరహా పవర్‌ప్లాంట్‌ను ఒకదాన్ని నిర్మించింది. ఆ తర్వాత రష్యా కూడా ఆ దిశగా పరిశోధనలు చేసి ఫ్లోటింగ్ పవర్‌ప్లాంట్‌ను నిర్మించింది. 2019లో దాన్ని

మిగతా 2వ పేజీలో...



సంతోష్ కట్కూరి



ద్వారకా గుండా



చందన్ దేశిరెడ్డి



అనిల్ మాలె

నకిలీ కంపెనీలు.. బలవంతపు చాకిరీ!

- అమెరికాలో దంపతులు సహా నలుగురు తెలుగువారి అరెస్టు
- 100 మందికిపైగా ఉద్యోగులతో అక్రమంగా కంపెనీల నిర్వహణ 2
- అమెరికా వ్యాప్తంగా పలుచోట్ల నెట్‌వర్క్

మొయినాబాద్‌లో ముజ్రా పార్టీ

- ఫాంహౌస్‌లో అశ్లీల నృత్యాలు
- అర్ధరాత్రి దాటాక డీజే మోత
- రంగంలోకి పోలీసులు 14
- 10మంది అరెస్ట్.. రిమాండ్



రాష్ట్రంపై డెంగీ పంజా

- చేవెళ్లలో బాలుడు, హైదరాబాద్‌లో వైద్యుడి మృతి 13
- జనవరి నుంచి 964 కేసులు నమోదు
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 327
- ఎన్‌సీవీబీడీసీ నివేదిక వెల్లడి
- చేష్టలుడిగిన ప్రజారోగ్య విభాగం

ఏడు నెలలైనా హామీల అమలేది?

రాష్ట్ర ప్రజల్ని మోసగించిన కాంగ్రెస్

- సోనియా, రాహుల్ సమక్షంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి?
- రేవంత్.. బెల్టు షాపులను మూయలేదేం?
- కాంగ్రెస్ నేతలు ప్రజల్ని దోచుకుంటున్నారు
- హామీలు అమలు చేసే వరకు వదిలిపెట్టం
- బీజేపీ మహిళా మోర్చా ధర్నాలో కిషన్‌రెడ్డి

హైదరాబాద్/కవాడిగూడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో సోనియా, రాహుల్ సమక్షంలో ఆరు గ్యారెంటీలు, మహిళలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఎక్కడికి వెళితే అక్కడి దేవతలపై ఒట్టు పెడుతూ కాలయాపన చేస్తున్నారు తప్ప, ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయడం లేదని

మిగతా 12వ పేజీలో...

10,000 కోట్లు సిద్ధం?

రుణమాఫీకి నిధులు సమకూర్చుకుంటున్న సర్కారు



- ప్రతినెలా మార్కెట్ రుణాల నుంచి కొంత నిల్వ
- వ్యయాలు పోను, రాబడుల నుంచీ ఆదా
- ఇతర మార్గాల్లోనూ నిధుల సేకరణకు చర్యలు
- మూడు దశల్లో రుణమాఫీ పథకం అమలు
- రూ.లక్ష, లక్షన్నర, 2 లక్షల రుణాలు మాఫీ
- ఆగస్టు 15లోపు ప్రక్రియ పూర్తికి చర్యలు!

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీ పథకం అమలుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని సీఎం ప్రకటించిన నేపథ్యంలో.. అందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటోంది. ముఖ్యంగా నిధుల సేకరణకు రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే పలు మార్గాలను ఆలోచించి పెట్టుకుంది. వీటిపై కసరత్తు చేయాల్సిందిగా ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించింది. అదేసమయంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీ స్థాయిలోనూ ప్రయత్నాలు చేస్తున్నారు. మార్కెట్ నుంచి సేకరించే బడ్జెట్ అప్పులను జూలై, ఆగస్టు నెలల్లో ఎక్కువ మొత్తంలో తీసుకునేందుకు అవకాశం కల్పించాలని కేంద్రాన్ని కోరుతూనే.. భూములను హామీగా పెట్టి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి తీసుకోవద్దంటూ ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది. మరోవైపు నెలవారీగా తీసుకుంటున్న బడ్జెట్ రుణాలను ఖజానాలో జమ చేసి పెడుతోంది. ఇప్పటికే రుణమాఫీ పథకం కోసం రూ.10 వేల కోట్ల వరకు ఖజానాలో నిల్వ చేసినట్లు సమాచారం. వాస్తవానికి

మిగతా 14వ పేజీలో...

గ్యాస్, ఆధార్ లింక్‌కు గడువేమీ లేదు

» పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూలై 9: వంట గ్యాస్ కనెక్షన్ నెంబరుతో ఆధార్ అనుసంధానానికి తుది గడువు అంటూ ఏమీ లేదని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ మంగళవారం స్పష్టం చేశారు. వినియోగదారులు తమకు అనుకూలమైన సమయాల్లో ఈ ప్రక్రియను చేసుకోవచ్చని తెలిపారు. బోగస్ కనెక్షన్ల ఏరివేతకు, రాయితీలు దుర్వినియోగం కాకుండా చూసేందుకు వినియోగదారులంతా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని చెప్పారు. గత ఎనిమిది నెలలుగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఉద్దేశం మంచిదే అయినప్పటికీ ఇందుకోసం గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ కేరళ ప్రతిపక్ష నాయకుడు వి.డి.సతీషన్ ఆయనకు లేఖ రాశారు. దీనిపై మంత్రి ఎక్స్ ద్వారా సమాధానం ఇచ్చారు. వినియోగదారులు మూడు విధాలుగా ఈకేవైసీ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇంటికి సిలిండర్ తీసుకువచ్చే గ్యాస్ బాయ్ వద్దగానీ, ఏజెన్సీ కార్యాలయానికిగానీ వెళ్లి ఆధార్ వివరాలను నమోదు చేయవచ్చని పేర్కొన్నారు. లేదంటే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల యాప్‌ల్లో వినియోగదారులే స్వయంగా వివరాలను ఎంటర్ చేసుకోవచ్చని వివరించారు.

హత్రాస్ దుర్ఘటన వెనుక కుట్ర ఉండొచ్చన్న సిట్

లక్నో, జూలై 9: యూపీలోని హత్రాస్‌లో తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం తన నివేదికను సమర్పించింది. ఈ దుర్ఘటన వెనుక పెద్ద కుట్ర ఉన్నదనే వాదనను తోసిపుచ్చలేమని అందులో పేర్కొంది. మరింత లోతుగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. నిర్వాహకులు అవాస్తవాలతో అనుమతులు పొందారని, జన సమూహాన్ని నియంత్రించేందుకు సరైన చర్యలు కూడా తీసుకోలేదని, ప్రమాదానికి వారిదే పూర్తి బాధ్యతని స్పష్టం చేసింది. తనిఖీలకు వీలు లేకుండా పోలీసులను అడ్డుకుని అనుచితంగా ప్రవర్తించారని, భోలే బాబాను ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేకుండానే భక్తులు కలిసేందుకు అనుమతిచ్చారని వివరించింది. సిట్ నివేదికతో యూపీ ప్రభుత్వం హత్రాస్ ఎస్డీఎం, సర్కిల్ అధికారి, మరో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసింది.

పతంజలిలో 14 ఉత్పత్తుల అమ్మకాలు నిలుపుదల

న్యూఢిల్లీ, జూలై 9: తమ సంస్థకు చెందిన 14 ఉత్పత్తుల అమ్మకాలను నిలిపివేసినట్టు పంతంజలి ఆయుర్వేద సంస్థ మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఆ ఉత్పత్తుల తయారీకి ఇచ్చిన లైసెన్సులను ఉత్తరాఖండ్ ప్రభుత్వం రద్దు చేయడంతో దాని పర్యవసానంగా వాటి అమ్మకాలను ఉపసంహరించుకున్నామని పేర్కొంది. ఈ మేరకు దేశంలోని 5,606 అమ్మకం కేంద్రాలకు సూచనలు ఇచ్చామని తెలిపింది. అయితే ఆ 14 ఉత్పత్తుల ప్రకటనలను ప్రసారం చేయకూడదని సామాజిక మాధ్యమాలకు కూడా సూచించారా అని ధర్మాసనం ప్రశ్నించింది. సామాజిక మాధ్యమాలు ఆ సూచనలను అమలు చేస్తున్నదీ లేనిదీ అన్న విషయమై రెండు వారాల్లో అఫిడవిట్ సమర్పించాలని ఆదేశించింది.

ముంబై హిట్ అండ్ రన్ కేసులో శివసేన నేత కుమారుడి అరెస్టు

ముంబై, జూలై 9: బీఎండబ్ల్యూ కారును నిర్లక్ష్యంగా నడిపి ఓ మహిళ నిండు ప్రాణాన్ని బలిగొన్న శివసేన (సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గం) నాయకుడు రాజేశ్ షా కొడుకు మిహిర్ షాను పోలీసులు ఎట్టకేలకు మంగళవారం ముంబైలో అరెస్టు చేశారు. చిరువ్యాపారులైన ప్రదీప్, కావేరి (45) దంపతులు ఆదివారం తెల్లవారుజామున క్రాఫోర్డ్ మార్కెట్ నుంచి స్కూటీపై వెళుతుండగా వర్లీ సమీపంలో అతివేగంగా వచ్చిన మిహిర్ కారు వారిని ఢీకొట్టింది. ప్రమాదం జరిగాక మిహిర్ కారును ఆపలేదు. తీవ్ర గాయాలైన ప్రదీప్ ఘటనా స్థలంలోనే పడిపోగా కారు బంపర్‌లో ఇరుక్కుపోయిన కావేరిని సుమారు 2 కిలోమీటర్ల దూరం ఈడ్చుకెళ్లిపోయారు. అక్కడ కారు ఆపిన మిహిర్, పక్కనే ఉన్న డ్రైవర్ రాజర్షి బిదావత్‌తో కలిసి ఆమెను బయటకు లాగి రోడ్డు మీద పడేశాడు.

అన్షుమన్ కుటుంబానికి రాహుల్ పరామర్శ

లఖ్‌నవూ, జూలై 9: అమరవీరుడు, కీర్తిచక్ర అవార్డు గ్రహీత కెప్టెన్ అన్షుమాన్ సింగ్ కుటుంబాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పరామర్శించారు. మంగళవారం తన సొంత నియోజకవర్గం ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ వెళ్లేందుకు లఖ్‌నవూలో విమానం దిగిన రాహుల్ అక్కడి గెస్ట్ హౌస్‌లో కెప్టెన్ అన్షుమాన్ సింగ్ కుటుంబాన్ని కలుసుకున్నారు. రాహుల్ తమకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారని అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అన్షుమాన్ సింగ్ తల్లి మంజు సింగ్ చెప్పారు. ఆర్మీని రెండు విభాగాలుగా విభజించవద్దని, అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయాలని ఆమె కోరారు. తర్వాత రోడ్డు మార్గంలో రాయ్‌బరేలీ బయలుదేరిన రాహుల్ మార్గం మధ్యలో చుర్వా వద్ద ఆగి హనుమంతుడిని దర్శించుకున్నారు. తర్వాత రాయ్‌బరేలీలో ఎయిమ్స్‌ను రాహుల్ సందర్శించారు.

ఎంత ముద్దొస్తోందో..!

» అమర సైనికుడు అన్షుమన్ భార్యను ఉద్దేశిస్తూ సోషల్ మీడియాలో పలువురి వికృత కామెంట్లు

రాయ్‌బరేలీ, జూలై 9: యూట్యూబర్ ప్రణీత్‌హనుమంతు వ్యవహారంతో సోషల్ మీడియా వికృత రూపంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ మొదలైంది. ఇదే సమయంలో.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన భారత సైనికుడు అన్షుమన్ సింగ్ భార్య స్మృతి గురించి సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన కామెంట్లు పెట్టిన వారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ వెల్లువెత్తుతోంది. అన్షుమన్ త్యాగానికి గుర్తుగా భారత ప్రభుత్వం ఆయనకు కీర్తిచక్ర అవార్డును ప్రకటించింది. ఆయన భార్య స్మృతి ఇటీవల రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా ఆ అవార్డును అందుకున్నారు. ఈ వీడియోను వార్తా సంస్థలు సోషల్ మీడియాలో పోస్టు చేయగా.. "ఎంత ముద్దొస్తోందో...." అంటూ కొంత మంది స్మృతిని ఉద్దేశిస్తూ వికృత కామెంట్లు చేశారు. ఈ నేపథ్యంలో.. ఎక్స్‌లో అహ్మద్ కే పేరుతో ఖాతా ఉన్న వ్యక్తిపై నెటిజన్లు జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అతన్ని గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని కమిషన్ ఢిల్లీ పోలీసులను ఆదేశించింది.

7వ అనుబంధ చార్జిషీటులో కేజ్రీవాల్, ఆప్ పేర్లు

న్యూఢిల్లీ, జూలై 9: ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఈడీ ఏడో అనుబంధ చార్జిషీటు దాఖలు చేసింది. మంగళవారం రౌస్ అవెన్యూ కోర్టులో దాఖలు చేసిన ఈ చార్జిషీటులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీ పేర్లను చేర్చింది. ఈ అభియోగపత్రాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ఈ నెల 12న హాజరవ్వాలంటూ కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేశారు. మనీలాండరింగ్ కేసులో ఈ ఏడాది మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాలే ప్రధాన సూత్రధారి అని ఈడీ ఇప్పటికే ఆరోపించింది. కాగా, ఈడీ అనుబంధ చార్జిషీటుపై ఆప్ తీవ్రంగా స్పందించింది. ఇది తమ పార్టీని దెబ్బతీసేందుకు చేస్తున్న భారీ కుట్రగా అభివర్ణించింది. అనుబంధ చార్జిషీటులో ఆప్ పేరును ప్రస్తావించడమే దీనికి నిదర్శనమని మండిపడింది.

తొలిసారిగా భారత్ స్నైపర్ రైఫిల్స్ ఎగుమతి

న్యూఢిల్లీ, జూలై 9: బెంగళూరుకు చెందిన చిన్న ఆయుధాల తయారీ సంస్థ ఎస్ఎస్ఎస్ డిఫెన్స్ శక్తిమంతమైన '.338 లాపువా మాగ్నమ్ క్యాలిబర్ స్నైపర్ రైఫిల్స్' ఎగుమతి కోసం ఓ మిత్ర దేశం నుంచి మెగా కాంట్రాక్టును దక్కించుకుంది. భారత్... స్నైపర్ రైఫిళ్లను విదేశాలకు ఎగుమతి చేయడం ఇదే తొలిసారని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ స్నైపర్ రైఫిళ్లను బ్యారెల్‌తో సహా పూర్తిగా భారత్‌లోనే తయారు చేశారు. ఈ రైఫిళ్లతోపాటు పలు మిత్రదేశాల నుంచి దాదాపు రూ.418 కోట్ల విలువైన రక్షణ సామగ్రిని సరఫరా చేసే కాంట్రాక్టును కూడా 'ఎస్ఎస్ఎస్ డిఫెన్స్' దక్కించుకుంది. ఎస్ఎస్ఎస్ డిఫెన్స్ సంస్థ ఇప్పటికే 1,500 మీటర్లు, అంతకంటే ఎక్కువ దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం కలిగిన స్నైపర్ రైఫిళ్ల ఎగుమతిని పూర్తిచేసిందని రక్షణ వర్గాలు వెల్లడించాయి.

ఎగురుతున్న విమానం నుంచి ఊడిపడ్డ టైరు

లాస్ ఏంజెల్స్, జూలై 9: అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో ఎగురుతున్న విమానం నుంచి టైరు ఊడి పడింది. సోమవారం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్ది సేపటికే యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 757-200 బోయింగ్ విమానం టైరు ఊడి కింద పడింది. అయితే గమ్యస్థానమైన డెన్వర్‌లో సురక్షితంగా దిగింది. దీంట్లోని 174 మంది ప్రయాణికులు, ఏడుగురు సిబ్బంది క్షేమంగా ఉన్నారని ఎయిర్‌లైన్స్ సంస్థ తెలిపింది. సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొంది. అమెరికాలో బోయింగ్ విమానాల టైరుల ఊడిపడడం ఇటీవల కాలంలో ఇది రెండోసారి.

భారత్‌కు రష్యా అణు సహకారం



(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించింది. భారత అణు ఇంధన కమిషన్ చీఫ్ ఈ ఏడాది మే నెలలో రష్యాలో పర్యటించినప్పుడు ఎఫ్ఎన్‌పీపీలపైన, అతి పెద్ద న్యూక్లియర్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టులపైన చర్చించారు. కాగా.. అణు సాంకేతిక పరిజ్ఞానాన్ని శాంతియుత అవసరాలకు వాడుకోవడంలో రష్యా-భారత్ మధ్య మధ్య సహకారం ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యంలో అత్యంత కీలకమైన అంశమని ఇరు దేశాలూ మంగళవారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. ప్రధాని మోదీ కూడా దీనిపై 'ఎక్స్' వేదికగా ఒక ట్వీట్ చేశారు. ఇరు దేశాల మధ్య సహకారంలో 'ఎనర్జీ' ముఖ్యమైన మూలస్తంభమని, ఈ రంగంలో తమ బంధాన్ని బలోపేతం చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

శాంతి.. శాంతి..

బాంబులు, తుపాకులు, బుల్లెట్ల మధ్య శాంతి చర్చలు సఫలం కావని, ఏ సంక్షోభానికీ యుద్ధరంగం పరిష్కారం చూపదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. కొత్త తరానికి అవసరమైన ఉజ్వల భవిష్యత్తుకు శాంతియుత వాతావరణం అత్యవసమన్నారు. రెండు రోజుల రష్యా పర్యటనలో ఉన్న మోదీ మంగళవారం జరిగిన 22వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. సోమవారం జరిగిన అనధికారిక భేటీలో పుతిన్ చెప్పిన మాటలు తనకు శాంతి సాధ్యమేనన్న ఆశను కల్పించాయన్నారు. ఇదే సందర్భంగా.. ఉక్రెయిన్‌పై రష్యా సోమవారం జరిపిన దాడిలో ఓ పిల్లల ఆస్పత్రి కూడా ఉండటం, పలువురు చిన్నారులు మరణించిన విషయాన్ని మోదీ పరోక్షంగా ప్రస్తావించారు. 'మానవత్వాన్ని విశ్వసించే వారెవరైనా ప్రాణనష్టం సంభవించినప్పుడు బాధపడతారు. అందులోనూ అభంశుభం తెలియని పిల్లలు మరణిస్తే, హత్యకు గురైతే అది హృదయవిదారకంగా ఉంటుంది. ఎంతో ఆవేదన కలుగుతుంది' అని పేర్కొన్నారు. 'నిన్న జరిగిన సమావేశంలో ఉక్రెయిన్‌పై ఒకరి అభిప్రాయాలు మరొకరం విన్నాం. అంతర్జాతీయ శాంతిపై ప్రపంచ దక్షిణ దేశాలకు ఉన్న ఆశలను నేను వెల్లడించాను' అని తెలిపారు. భారత్ ఎల్లప్పుడూ శాంతి కోసమే కృషి చేసిందని, ఉక్రెయిన్‌తో రష్యాకు కొనసాగుతున్న సంక్షోభానికి ముగింపు పలకటానికి తన వంతు పాత్ర పోషించటానికి సిద్ధంగా ఉందని మోదీ చెప్పారు. గత కొన్నేళ్లలో ప్రపంచదేశాలు ఆహారం, ఇంధనం, ఎరువుల కొరతను ఎదుర్కొంటూ ఉంటే.. భారత్‌లో మాత్రం ఆ సమస్య రాలేదని, రష్యాతో తమకు ఉన్న స్నేహమే దీనికి కారణమని, భారత్‌లో పెట్రోల్, డీజిల్ కొరత తలెత్తకుండా రష్యా సహకరించిందని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్ గత 40 ఏళ్లుగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటోందని, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తాము ఖండిస్తామని స్పష్టం చేశారు. శిఖరాగ్ర సదస్సు అనంతరం మోదీ విలేకర్లతో మాట్లాడుతూ, పుతిన్‌తో తన చర్చలు ఫలప్రదంగా సాగాయని తెలిపారు. మరో వైపు, పుతిన్ మాట్లాడుతూ.. ఉక్రెయిన్ సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించటానికి మోదీ ప్రయత్నిస్తున్నారని, అందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఇరుదేశాల వాణిజ్యం గత ఏడాది 66 శాతం పెరిగిందని, ఈ ఏడాది తొలి త్రైమాసికంలో మరో 20 శాతం పెరిగిందన్నారు. ఈ ఏడాది అక్టోబరులో రష్యాలో జరిగే బ్రిక్స్ సదస్సుకు రావాల్సిందిగా మోదీని పుతిన్ ఆహ్వానించారు. కాగా, రష్యా అత్యున్నత పౌర పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ సెయింట్ అండ్రూ ది అపోస్టల్ ద ఫస్ట్ కాల్డ్'ను పుతిన్ మోదీకి అందించారు. ఇరుదేశాల మధ్య స్నేహసంబంధాల బలోపేతానికి కృషిచేసినందుకు ఈ పురస్కారాన్ని మోదీకి ఇచ్చారు. కాగా.. ఇంధనం, వ్యవసాయం తదితర రంగాల్లో పెట్టుబడుల ద్వారా 2030నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రూ.8.3లక్షల కోట్లకు పెంచుకోవాలని ఇరు దేశాలూ నిర్ణయించినట్టు సం యుక్త ప్రకటనలో వెల్లడించాయి. ఇరు దేశాల కరెన్సీలతో వాణిజ్య చెల్లింపులు సహా 9 అంశాలపై ఒక ఒప్పందానికి వచ్చినట్టు వివరించాయి. కాగా.. రెండు రోజుల రష్యా పర్యటన ముగించుకున్న ప్రధాని మోదీ మంగళవారం అక్కడి నుంచే ఆస్ట్రియాకు బయల్దేరి వెళ్లారు.

కారులో షికారు

తమ దేశానికి అతిథిగా వచ్చిన ప్రధాని మోదీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ తన నివాసాన్ని దగ్గరుండి చూపించారు. ఒక ఎలక్ట్రిక్ కారులో మోదీని కూచోబెట్టుకొని స్వయంగా డ్రైవ్ చేస్తూ పుతిన్ ఆ ప్రాంతమంతా చూపించారు. అనంతరం, ఇరువురు నేతలూ కారు దిగి ఒక తోటలో నడుస్తూ మాట్లాడుకున్నారు.

అన్ని వేళలా మిత్రదేశం

రష్యాలో ఉన్న భారతీయులను ఉద్దేశించి మంగళవారం ప్రసంగించిన మోదీ.. రష్యా భారత్‌కు సుఖదుఃఖాల్లో, అన్ని వేళలా విశ్వసించదగిన మిత్రదేశమని పేర్కొన్నారు. 'రష్యాలో శీతాకాలంలో ఉష్ణోగ్రతలు ఎంతగానైనా పడిపోనివ్వండి.. భారత్-రష్యా స్నేహం మాత్రం ఎల్లప్పుడూ వెచ్చగానే ఉంటుంది' అని వ్యాఖ్యానించారు. భారత్-రష్యా స్నేహాన్ని బలోపేతం చేయటానికి బాలీవుడ్ నటులు రాజ్‌కపూర్, మిథున్ చక్రవర్తి సినిమాలు కూడా ఎంతో దోహదం చేశాయన్న మోదీ.. ఈ సందర్భంగా 1955 నాటి 'శ్రీ 420' సినిమాలోని ప్రఖ్యాత సినీగీతం 'మేరీ జూతా హై జపానీ.. సర్ పర్ లాల్ టోపీ రూసీ, ఫిర్ బీ హిందుస్థానీ'ను గుర్తు చేశారు.

భారతీయులను వెనక్కి పంపటానికి ఓకే!

తమ సైన్యంలో సహాయక సిబ్బందిగా భారతీయులను నియమించుకోకూడదన్న భారత్ విజ్ఞప్తికి రష్యా అంగీకరించింది. ఇప్పటికే రష్యా సైన్యంలో పని చేస్తున్న భారతీయులను భారత్‌కు తిప్పిపంపించటానికి కూడా సమ్మతి తెలిపింది. పుతిన్‌తో జరిగిన అనధికారిక భేటీలో మోదీ దీని గురించి చర్చించారని, ఈ నేపథ్యంలోనే రష్యా నిర్ణయం తీసుకుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీనిపై రష్యా అధికారికంగా ప్రకటన చేస్తుందని తెలిపాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా.. పలువురు భారతీయ యువకులను సైన్యంలో చేర్చుకొని వారిని యుద్ధరంగానికి తరలించింది. వీరిలో హైదరాబాద్‌కు చెందిన ఒక యువకుడితోపాటు సూరత్‌కు చెందిన మరో యువకుడు మరణించారు.

రక్తపిపాసితో ఆలింగనమా?



పుతిన్‌ను మోదీ ఆప్యాయంగా ఆలింగనం చేసుకోవటాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తప్పుబట్టారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం నాయకుడు ప్రపంచంలోనే అత్యంత రక్తపిపాసి అయిన ఓ నేరస్థుడిని ఆలింగనం చేసుకోవటం శాంతి ప్రయత్నాలకు పెద్ద దెబ్బ. తీవ్ర నిరుత్సాహం కలిగించే విషయం' అని పేర్కొన్నారు. మోదీ పర్యటన సమయంలోనే ఉక్రెయిన్‌లో ఓ పిల్లల ఆస్పత్రితోపాటు పలు చోట్ల రష్యా దాడులు జరిపింది. ఈ దాడుల్లో 39 మంది మరణించారు.

లోకం తీరు



పూరీ 'రత్న భండార్'ను 14న తెరవాలి

» అవసరమైతే తాళం విరగ్గొట్టాలి

» జగన్నాథ మందిర కమిటీకి సిఫార్సు చేసిన ఉన్నత స్థాయి సంఘం

భువనేశ్వర్, జూలై 9: పూరీ శ్రీజగన్నాథ మందిరంలో నగలు, ఇతర విలువైన వస్తువులను భద్రపరిచే 'రత్న భండార్'లోని లోపలి గదిని ఈ నెల 14న తెరవాలని ఉన్నతస్థాయి సంఘం సిఫార్సు చేసింది. రత్న భండార్‌ను తెరిచే విషయమై ఏర్పాటయిన జస్టిస్ బిశ్వనాథ్ రథ్ ఆధ్వర్యంలోని ఉన్నతస్థాయి సంఘం మంగళవారం పూరీలో సమావేశమయి కూలంకషంగా చర్చలు జరిపింది. లోపలి గదిని తెరవాలని ఆలయ నిర్వహణ కమిటీకి ఏకగ్రీవంగా సిఫార్సు చేసింది. ఆ కమిటీ ఈ సిఫార్సును రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి అనుమతి తీసుకోనుంది. 46 ఏళ్ల క్రితం చివరిసారిగా 1978లో రత్నభండార్‌ను తెరిచి నగల విలువను లెక్కించారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో రత్న భండార్ తెరవడం ప్రచార అంశంగా మారింది. తాము అధికారంలోకి వస్తే రత్న భండార్‌ను తెరిపిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. ప్రస్తుతం ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడడంతో హామీ అమలు కోసం ఉన్నత స్థాయి సంఘాన్ని నియమించింది. ఈ సంఘానికి శ్రీ జగన్నాథ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌జేటీఏ) చీఫ్ అడ్మినిస్ట్రేటర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. రత్న భండార్‌కు ఉన్న రెండో తాళం చెవిని ఇవ్వాలని ఆయనను కమిటీ కోరింది. అయితే ప్రస్తుతం రథయాత్ర దృష్ట్యా బిజీగా ఉన్నందున ఇప్పుడే ఇవ్వలేమని ఆయన సమాధానం ఇచ్చారు. దాంతో ఈ నెల 14న ఇవ్వాలని సూచించింది. ఒకవేళ రెండో తాళం చెవి ద్వారా తెరవలేని పరిస్థితి వస్తే తాళాన్ని బద్దలు కొట్టాలని కమిటీ నిర్ణయించింది. నగల జాబితాను రూపొందించాలని, అవసరమైనవాటికి మరమ్మతులు చేయించాలని ప్రతిపాదించింది.

నకిలీ కంపెనీలు.. బలవంతపు చాకిరీ!

అమెరికాలో నలుగురు తెలుగువారి అరెస్టు

హ్యూస్టన్, జూలై 9: నకిలీ కంపెనీలు సృష్టించి, ఉద్యోగులతో బలవంతంగా పనిచేయిస్తున్నారనే ఆరోపణలపై ఓ మహిళ సహా నలుగురు తెలుగు వారిని అమెరికాలో పోలీసులు అరెస్టు చేశారు. టెక్సాస్‌లో వేర్వేరు చోట్ల దాదాపు వంద మందికిపైగా యువతీ యువకులను నియమించినట్లు గుర్తించారు. ప్రిన్స్‌టన్‌లోని కొలిన్ కౌంటీ ప్రాంతం గిన్స్‌బర్గ్ లేన్‌లోని ఓ ఇంట్లో పెద్దసంఖ్యలో యువతులు నివసిస్తున్నారని, అక్కడేవో అనుమానాస్పద కార్యకలాపాలు సాగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో సంతోష్ కట్కూరి(31)కి చెందిన ఆ ఇంటిని గత మార్చి 13న పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు చెందిన పలు ప్రోగ్రామింగ్ షెల్ కంపెనీల్లో 15మంది యువతులతో సంతోష్ భార్య ద్వారకా గుండా(31) పనిచేయిస్తున్నట్లు గుర్తించారు. మానవ అక్రమ రవాణాకు కేంద్రంగా భావిస్తున్న ఆ ఇంట్లో ఎలాంటి సామగ్రి లేదని, కేవలం కంప్యూటర్లు, దుప్పట్లు మాత్రమే ఉన్నాయని, యువతులంతా అక్కడి గదుల్లో నేలపైనే నిద్రిస్తున్నారని అధికారులు వెల్లడించారు. విచారణలో ప్రిన్స్‌టన్, మెలిస్సా, మెక్ కిన్నే ప్రాంతాల్లోనూ షెల్ కంపెనీలు నెలకొల్పి 100 మందికిపైగా ఉద్యోగులతో ఇదేవిధంగా చాకిరీ చేయిస్తున్నట్లు నిర్ధారించారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడ్డారన్న నేరారోపణలపై సంతోష్, ద్వారకతో పాటు వారికి సహకరించిన చందన్ దేశిరెడ్డి(24), అనిల్ మాలె (37)ను పోలీసులు అరెస్టు చేశారు.

'పథకం' సొమ్ము అందుకొని ప్రియులతో పరార్

యూపీలో ఆవాస్ యోజన నిధులను దుర్వినియోగం చేసిన 11 మంది వివాహితలు

లఖ్‌నవూ, జూలై 9: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల నిధులు ఎలా దుర్వినియోగమవుతాయో చెప్పడానికి ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ జిల్లాలో జరిగిన సంఘటన ఉదాహరణగా నిలుస్తుంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరయిన నిధులు చేతిలో పడగానే ఆ సొమ్ము పట్టుకొని జిల్లా మొత్తమ్మీద 11 మంది వివాహితులు తమ ప్రియులతో పరారయినట్టు సమాచారం అందింది. పేదలు, మధ్యతరగతి వారు ఇళ్లు నిర్మించుకునేందుకు ఈ పథకం కింద ప్రభుత్వం రూ.2.50 లక్షలు ఇస్తుంది. ఇందులో మొదటి విడత కింద రూ.40వేలు అందుకోగానే ఆ 11 మంది ఇల్లాళ్లు తమ ప్రియులతో పరారయ్యారు. భర్తలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దాంతో వారికి రెండో విడత నిధులు ఇవ్వబోమని అధికారులు తెలిపారు. మహిళలు ఇలా పరారవడం ఇదేమీ తొలిసారి కాదు. గత ఏడాది రూ.50వేలు వంతున రాగా వాటిని తీసుకొని నలుగురు వివాహితులు పారిపోయారు. నిధులు ఇచ్చినా ఇళ్ల పనులు ఎందుకు ప్రారంభించలేదని అధికారులు ఆరా తీసినప్పుడు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దాంతో క్షేత్రస్థాయి పరిస్థితి ఏమిటో వివరించాలంటూ అధికారులు వారి భర్తలకు నోటీసులు ఇచ్చారు.

నీట్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

పట్నాలో అదుపులోకి తీసుకున్న సీబీఐ.. వారిలో ఒకరు నీట్ పరీక్ష రాసిన అభ్యర్థి

» ఈ కేసులో 11కు చేరిన అరెస్టులు

» పట్నా, గోధ్రా సెంటర్లలో 183 మందికే 640 కన్నా ఎక్కువ మార్కులు

» నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడి

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నీట్ అక్రమాలపై దర్యాప్తుచేస్తున్న సీబీఐ.. పట్నాలో తాజాగా మరో ఇద్దరిని అరెస్టు చేసింది. నలందకు చెందిన సన్నీ అనే అభ్యర్థిని, రంజిత్ కుమార్ అనే మరో అభ్యర్థి తండ్రిని అదుపులోకి తీసుకుంది. దీంతో ఈ కేసులో సీబీఐ ఇప్పటిదాకా చేసిన అరెస్టుల సంఖ్య 11కు పెరిగింది. ఈ పదకొండు మందిలో.. నీట్ పరీక్ష రాసిన అభ్యర్థి తాజాగా అరెస్ట్ అయిన సన్నీ ఒక్కడే. మిగతా 10 మందీ.. పేపర్ లీకేజీకి పాల్పడటం, నిందితులకు ఆశ్రయం ఇవ్వడం వంటి వేర్వేరు ఆరోపణలపై అరెస్టయినవారు. అలాగే, ఇప్పటిదాకా అరెస్టయినవారిలో ఎనిమిది మంది బిహార్‌కు చెందినవారు కాగా.. ఇద్దరు గుజరాతీలు (గోధ్రా, లాతూరుకు చెందినవారు). మరొకరు డెహ్రాడూన్‌కు చెందిన వ్యక్తి. కాగా.. నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి కేసులు నమోదైన పట్నాలోని 12 పరీక్షా కేంద్రాల్లో 175 మంది, గోధ్రాలోని 2 సెంటర్లలో 8 మంది (మొత్తం కలిపి 183 మంది) మాత్రమే 640 అంతకన్నా ఎక్కువ స్కోర్ చేసినట్టు జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడించింది. పట్నాలో రాసినవారిలో 35 మంది మాత్రమే 680 అంతకన్నా ఎక్కువగా మార్కులు సాధించగా..



గోధ్రాలోని ఎగ్జామ్ సెంటర్లలో పరీక్ష రాసిన ఏ అభ్యర్థీ ఆ మార్కులు సాధించలేకపోయారని వివరించింది. 'నీట్ పేపర్ లీకేజీ సుస్పష్టం. అయితే, అది ఏ స్థాయిలో జరిగిందో తేలాల్సి ఉంది. పెద్ద ఎత్తున జరిగి ఉంటే మళ్లీ పరీక్షకు ఆదేశించక తప్పదు' అంటూ సుప్రీంకోర్టు సోమవారం వ్యాఖ్యానించిన నేపథ్యంలో.. ఎన్‌టీఏ అధికారులు ఈ వివరాలను వెల్లడించారు. పదివేలలోపు ర్యాంకులు సాధించినవారంతా ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాలేదని.. దేశంలోని 800 సెంటర్లలోనూ ర్యాంకర్లు విస్తరించి ఉన్నారని తెలిపారు. ఎంబీబీఎస్‌లో లేదా దంత వైద్య కళాశాలల్లో సీట్లు సాధించే ర్యాంకు సాధించిన లక్ష మందీ.. దేశంలోని 4,500 సెంటర్ల పరిధిలో (మొత్తం పరీక్షా కేంద్రాల సంఖ్య 4,750) విస్తరించి ఉన్నారని తెలపడం ద్వారా.. లీకేజీ పెద్ద ఎత్తున జరగలేదని విషయాన్ని స్పష్టం చేశారు. కాగా, నీట్‌ను రద్దు డిమాండ్ల నేపథ్యంలో.. మాజీ ఐఏఎస్ అధికారులు ఆర్.సుబ్రమణ్యన్, సుతీర్థ భట్టాచార్య, జోధ్‌పూర్ ఐఐటీ మాజీ డైరెక్టర్ ప్రేమ్ కల్రా స్పందించారు. నీట్‌కు ప్రత్యామ్నాయాన్ని సూచిస్తూ.. విద్యార్థుల ప్రతిభను కేవలం 3 గంటల్లో హడావుడిగా అంచనా వేయడానికి బదులు.. 11, 12 తరగతుల్లో తరచుగా అంచనా వేయాలన్నారు. అలాగే.. ఏడాదికి ఆరు వారాల చొప్పున రెండుసార్లు ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎస్ వంటివాటిలో ఇంటర్న్‌షిప్‌కు అవకాశమిచ్చి అక్కడ వారి సామాజిక, వ్యావహారిక స్వభావాలను అంచనా వేయాలన్నది రెండో సూచన. ఈ రెండింటికీ 40 శాతం చొప్పున వెయిటేజీ ఇచ్చి.. ప్రవేశపరీక్షల్లో వచ్చే మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇవ్వాలని (40:40:20 నిష్పత్తి) తమ ప్రతిపాదనలో వివరించారు.

80 శాతం తప్పులు..

ఎన్‌టీఏ ఇటీవల విడుదల చేసిన 'కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ)-యూజీ' పరీక్ష ఆన్సర్ కీలో చాలా తప్పులు ఉన్నాయని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక అభ్యర్థి అయితే ఆన్సర్ కీలో 80శాతం తప్పులే ఉన్నట్టు ఆవేదన వెలిబుచ్చారు. మరో అభ్యర్థి 'ఈ బోగస్ ఆన్సర్ కీని మేం అస్సలు అంగీకరించం' అంటూ 'ఎక్స్'లో ట్వీట్ చేశాడు. ఈ నేపథ్యంలో.. అభ్యర్థులు ఎత్తిచూపిన తప్పులను సబ్జెక్ట్ నిపుణులు పరిశీలిస్తారని, అనంతరం తుది ఆన్సర్ కీని విడుదల చేసి ఫలితాన్ని వెల్లడిస్తామని ఎన్‌టీఏకి చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

అసంఘటిత రంగం గత ఏడేళ్లలో ఢమాల్!

» దేశంలో సగానికి పైగా రాష్ట్రాల్లో ఉపాధి కోల్పోయిన లక్షలాది మంది

» ఎన్ఎస్ఎస్‌వో నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ, జూలై 9: గడిచిన ఏడేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా సగానికిపైగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అసంఘటిత రంగం కుదేలైందని, ఫలితంగా లక్షలాది మంది ఉపాధి కోల్పోయారని నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్(ఎన్ఎస్ఎస్‌వో) నివేదిక స్పష్టం చేసింది. 2015-2023 మధ్య 13 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో కార్మికులు, చిరు వ్యాపారులు, ఇతర అసంఘటిత రంగంలోని వారు లక్షల సంఖ్యలో ఉపాధి కోల్పోయారని తెలిపింది. ఉపాధి కోల్పోయిన వారిలో చిన్నపాటి సంస్థల్లో పనిచేసుకునేవారు, చిన్న పరిశ్రమల ఉద్యోగులు, ఆయా పరిశ్రమల్లో భాగస్వాములు, చిరు వ్యాపారులు ఉన్నారని వివరించింది. పశ్చిమబెంగాల్‌లో అత్యధికంగా 30 లక్షల మంది అసంఘటిత రంగంలో ఉపాధి కోల్పోయారని పేర్కొంది. అదేవిధంగా కర్ణాటకలో 13 లక్షలు, తమిళనాడులో 12 లక్షలు, యూపీలో 7.91 లక్షలు, ఏపీలో 6.77 లక్షలు, కేరళలో 6.4 లక్షలు, అసోంలో 4.94 లక్షలు, తెలంగాణలో 3.44 లక్షల మంది గత ఏడేళ్లలో రోడ్డున పడ్డారని నివేదిక వివరించింది. ఢిల్లీలో 3 లక్షల మంది ఉపాధి కోల్పోయారని నివేదిక స్పష్టం చేసింది. గత ఏడేళ్లలో అసంఘటిత రంగం దెబ్బతినడంపై కేంద్ర ఆర్థిక శాఖ కూడా గమనించినట్టు ఎన్ఎస్ఎస్‌వో నివేదిక స్పష్టం చేసింది. రానున్న బడ్జెట్‌లో ఉపాధి కల్పనకు, గ్రామీణ నిరుద్యోగాన్ని తగ్గించేందుకు ప్రతిపాదనలు చేసే అవకాశం ఉందని తెలిపింది.

ఈ రాష్ట్రాల్లో పెరిగింది..

అయితే.. 2015-23 మధ్య ఏడేళ్ల కాలంలో కొన్ని రాష్ట్రాలో అసంఘటిత రంగం పుంజుకున్నట్టు ఎన్ఎస్ఎస్‌వో నివేదిక వెల్లడించింది. మహారాష్ట్రంలో 24 లక్షల మందికి కొత్తగా ఉపాధి లభించినట్టు తెలిపింది. గుజరాత్‌లో 7.62 లక్షల మంది, ఒడిసాలో 7.61 లక్షల మంది, రాజస్థాన్‌లో 7.56 లక్షల మంది కొత్తగా ఉపాధి పొందినట్టు వివరించింది.

యువత నిరుద్యోగులుగా ఉండాలన్నదే మోదీ లక్ష్యం



న్యూఢిల్లీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): దేశంలోని యువతను నిరుద్యోగులుగా ఉంచడమే మోదీ ప్రభుత్వం లక్ష్యమని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. నిరుద్యోగ సమస్యపై సిటీగ్రూప్ ఇచ్చిన స్వతంత్ర ఆర్థిక నివేదికలను మోదీ ప్రభుత్వం ఖండిస్తోందని, అయితే ప్రభుత్వ డేటాను ఎలా తిరస్కరిస్తారని ఆయన ప్రశ్నించారు. వివిధ సంస్థల నివేదికలను ఉటంకిస్తూ 'ఎక్స్'లో ఖర్గే మంగళవారం సుదీర్ఘ పోస్టు చేశారు. గత పదేళ్లలో కోట్లాది మంది యువత కలలు ఛిన్నాభిన్నం కావడానికి మోదీ ప్రభుత్వమే కారణమని మండిపడ్డారు. "ఎన్ఎస్ఎస్‌వోకు చెందిన అన్‌ఇన్‌కార్పొరేటెడ్ సెక్టర్ ఎంటర్‌ప్రైజెస్ వార్షిక సర్వే ప్రకారం.... 2015-23 మధ్యకాలంలో తయారీ రంగంలోని అసంఘటిత యూనిట్లలో 54 లక్షల ఉద్యోగాలు పోయాయి" అని ఖర్గే పేర్కొన్నారు. ఐఐఎం లఖ్‌నవూ నివేదిక ప్రకారం... దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరుగుదల, విద్యావంతుల్లో అధిక నిరుద్యోగం, శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉందని తేలిందని వివరించారు.

22 నుంచి గ్రూప్ -1 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

- బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్, ఖమ్మంలలో...

హైదరాబాద్, జూలై9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో టీజీపీఎస్సీ గ్రూప్-1(మెయిన్స్) ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని 75 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డి. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని సైదాబాద్ స్టడీ సర్కిల్, ఖమ్మం స్టడీ సర్కిల్‌లో ఈ నెల 22వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. శిక్షణ సమయంలో ప్రతి అభ్యర్థికి నెలకు రూ. 5 వేల స్టైఫండ్ (బుక్ ఫండ్, రవాణా చార్జీలు) ఇస్తామని తెలిపారు. గ్రూప్-1 మెయిన్స్‌కి అర్హత సాధించిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని, ఈ నెల పదో తేదీ నుంచి 19 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు విధించినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ. 5 లక్షలలోపు ఉండాలని, రిజర్వేషన్ ప్రకారం ఎంపిక ఉంటుందని డైరెక్టర్ తెలిపారు. ఏవైనా సందేహాలుంటే.. 040- 24071178 నెంబరుకు కాల్ చేయాలని సూచించారు.

జేఎన్‌టీయూ మెస్ చట్నీలో చిట్టెలుక చక్కర్లు!

సుల్తాన్‌పూర్ క్యాంపస్‌లోని అబ్బాయిల హాస్టల్లో ఘటన.. క్యాంపస్ ఎదుట విద్యార్థుల ఆందోళన

- నాసిరకం భోజనంపై మండిపాటు
- మెస్ కాంట్రాక్టర్ తొలగింపు.. విచారణకు దామోదర ఆదేశం
- మెదక్ జిల్లా కోమటిపల్లి ఆశ్రమపాఠశాలలో ఉప్మాలో బల్లి
- 20 మంది విద్యార్థులకు అస్వస్థత.. ఇంకా ఆస్పత్రిలోనే ముగ్గురు


వంట పాత్రలోని చట్నీలో చిట్టెలుక

పుల్‌కల్, రామాయంపేట, జూలై 9: అది ఓ పెద్ద గిన్నె. దాంట్లో పావు సగం దాకా నీళ్ల నీళ్లగా ఉన్న పల్లీ చట్నీ! అందులో అక్కడక్కడా తాళింపులో భాగంగా వేసిన ఫ్రై అయిన పప్పు దినుసులు, జీలకర్ర, ఎండు మిరపకాయల మధ్య ఓ చిట్టెలుక కూడా ఉంది. చట్నీలో మునుగుతూ తేలుతూ పాత్రంతా తిరుగుతోంది. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జవహర్‌లాల్ టెక్నాలజీ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ)లోని హాస్టల్ మెస్‌లో అల్పాహారంలో భాగంగా వందల మంది విద్యార్థుల కోసం సిద్ధం చేసిన చట్నీ ఇది. మంగళవారం ఉదయం అల్పాహారం చేసేందుకు వెళ్లిన విద్యార్థుల్లో కొందరు చూసి.. వీడియో తీసి వాట్సాప్, సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంతో వైరల్ అయింది. ఈ ఘటన తల్లిదండ్రులను దిగ్ర్భాంతికి గురిచేస్తే రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్, ఎంటెక్, బీఫార్మసీ, ఎంఫార్మసీ విభాగాలకు సంబంధించి 1400 మంది వేర్వేరు హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారు. ఇంజనీరింగ్ కళాశాల బాలుర హాస్టల్‌లోని మెస్‌లో మంగళవారం 'చట్నీలో ఎలుక' ఘటన వెలుగుచూసింది. దీనికి నిరసనగా ఉదయం నుంచే విద్యార్థులు తరగతులను బహిష్కరించి కళాశాల పరిపాలన భవనం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, సీఈ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారుల బృందం.. జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురి హుటాహుటిన సుల్తాన్‌పూర్ క్యాంపస్ హాస్టల్‌కు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్లో తమకు ఏమాత్రం నాణ్యత లేని, రుచీపచీలేని నాసికరమైన భోజనం పెడుతున్నారని.. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రంగా స్పందించిన అధికారులు, అల్పాహారం ఏర్పాట్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు మెస్ కాంట్రాక్టర్‌ను అప్పటికప్పుడు తొలగిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఆరుగురు కేర్ టేకర్లకు మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ వివరణ మరో విధంగా ఉంది. విద్యార్థులు తిన్నాక చట్నీ మిగిలిందని, ఆ పాత్రను శుభ్రం చేసే ప్రదేశంలో సిబ్బంది ఉంచారని, అక్కడే ఎలుక పడిందని చెప్పారు. జేఎన్‌టీయూలో నాణ్యమైన భోజనం అందించడంలో అధికారులు విఫలమయ్యారని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కళాశాల బాలుర హాస్టల్‌లో జరిగిన ఘటనపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఆరా తీశారు. ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బల్లి పడ్డ ఉప్మా తిని..

మెదక్ జిల్లా రామాయంపేట మునిసిపల్ పరిధిలోని కోమటిపల్లి ఆశ్రమ పాఠశాల హాస్టల్లో మంగళవారం ఉప్మా వండుతుండగా బల్లి పడింది. గమనించని సిబ్బంది, ఆ పదార్థాన్ని విద్యార్థులకు పెట్టగా తిన్న గంట తర్వాత 20 మంది వాంతులు చేసుకొని అస్వస్థతకు గురయ్యారు. బాధిత విద్యార్థులను దగ్గర్లోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా 17మందికి చికిత్స చేసి హాస్టల్‌కు పంపారు. ముగ్గురిని ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు.

వరి చేలను ముంచెత్తిన వరద

ఖమ్మం, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఘటనలు.. ఖమ్మం జిల్లాలో 200 ఎకరాలకు పైగా పంట మునక

- అరటి, పామాయిల్ తోటలు కూడా
- ప్రాజెక్టుల్లో పెరుగుతున్న నీటి మట్టాలు
- మేడిగడ్డకు 35 వేల క్యూసెక్కుల వరద
- ఆల్మట్టికి 78 వేలు, తుంగభద్రకు 30 వేలు
- నేడు 6 జిల్లాలకు భారీ వర్ష సూచన

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)


ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి- సత్యనారాయణపురం మధ్య నీటి మునిగిన వరిపొలాలు

భారీ వర్షాలకు ఖమ్మం, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాగుల్లోకి వరద నీరు పోటెత్తడంతో వరి చేలు నీట మునిగాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురవగా, ఏపీలోని చింతంపల్లి, తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో ఏపీ వైపు నుంచి రాళ్లగండి వాగు ద్వారా సత్తుపల్లి మండలాన్ని వరద తాకి బేతుపల్లి- సత్యనారాయణపురం మధ్య వరద పోటెత్తింది. దీంతో 200 ఎకరాలకు పైగా వరి మడులతోపాటు అరటి, పామాయిల్ తోటలు నీట మునిగాయి. ఇక, సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని లింగాపూర్, ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన మండలాల్లోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కెరమెరి మండలంలో వరద నీరు పంట చేలలోకి చేరింది. ఆసిఫాబాద్ మండలంలోని గుడిగుడి, అప్పపల్లి గ్రామాల వద్ద ఉన్న ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించడంతో ఆ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గడిచిన 24 గంటల్లో 44.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. కరీంనగర్ జిల్లా కరీంనగర్ రూరల్ మండలంలో మంగళవారం అత్యధికంగా 21.6 మి.మీ వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పిడుగుపాటుకు చెన్నూరులో ఓ చింత చెట్టు ధ్వంసమవ్వగా దాని పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా మంగళవారం సగటున 9.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కృష్ణా-గోదావరి బేసిన్‌కు పెరుగుతున్న వరద

ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న వర్షాలతో కృష్ణా-గోదావరి బేసిన్ ప్రాజెక్టులకు క్రమంగా వరద పెరుగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి మంగళవారం 35 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. తుపాకులగూడెం(సమ్మక్కసాగర్) బ్యారేజీకి 53 వేలు, దుమ్ముగూడెం (సీతమ్మసాగర్) బ్యారేజీకి 54వేలు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 3275, కడెం ప్రాజెక్టుకు 2404, సుందిళ్లకు 956, అన్నారం బ్యారేజీకి 1250 క్యూసెక్కుల వరద వచ్చింది. మేడిగడ్డలో 85గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం(సరస్వతి) బ్యారేజీ రెండో దశ జియో ఫిజికల్ పరీక్షలకు రెండో రోజు మంగళవారం వర్షం ఆటంకం కలిగించింది. ఇక కృష్ణా బేసిన్‌లో కీలకమైన ఆల్మట్టి ప్రాజెక్టుకు 78 వేల క్యూసెక్కుల వరద రాగా తుంగభద్ర ప్రాజెక్టుకు 30 వేల క్యూసెక్కుల వరద రికార్డయింది. ఆల్మట్టి ప్రాజెక్టు సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా ప్రస్తుతం 66.54 టీఎంసీల నిల్వ ఉంది. 100టీఎంసీలు దాటిన తర్వాతే నీటిని దిగువన ఉన్న నారాయణపూర్ జలాశయానికి వదిలిపెడతారు. తుంగభద్ర సామర్థ్యం 100.86 టీఎంసీలు కాగా ప్రస్తుతం 20.85 టీఎంసీల నిల్వ మాత్రమే ఉంది. ఇక గోదావరి నదిపై దిగువన రాజమహేంద్రవరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి 53 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా దిగువకు వదిలేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి 2650 క్యూసెక్కుల వరద రికార్డయింది.

ఆరు జిల్లాలకు ఎల్లో అలెర్ట్

తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం భారీ వర్షం కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందంటూ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

ఉద్యోగాలిప్పిస్తామని 4.8కోట్ల వసూళ్లు

- దాదాపు అరవై మందికి ఓ ముఠా టోకరా
- భద్రాద్రి కొత్తగూడెంలో 10 మంది అరెస్టు
- 1.47కోట్ల నగదు, ఆభరణాలు స్వాధీనం
- పరారీలో మరో ముగ్గురు నిందితులు


వివరాలు వెల్లడిస్తున్న భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో జూనియర్ అసిస్టెంట్, క్లర్క్, డిపెండెంట్ ఉద్యోగాలతో పాటు గ్రూప్-2 పోస్టులు ఇప్పిస్తామని, వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయిస్తామని మాయమాటలు చెప్పి సుమారు 60 మంది నుంచి రూ.4.8కోట్లు వసూలు చేసిన ఘరానా ముఠాను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో మొత్తం 13మంది నిందితులు ఉండగా వారిలో 10మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1.47కోట్లను స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ మంగళవారం కొత్తగూడెంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కొంత మంది మోసం చేశారని గతేడాది మేలో బాధితులు ఫిర్యాదు చేశారని తెలిపారు. చుంచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా దాసు హరికిషన్, గుండా వినోద్‌కుమార్, ఉపేంద్రనాయుడు అనే వారి ఆధ్వర్యంలో ఈ వసూళ్లకు పాల్పడినట్లు తేలిందన్నారు. ఈ కేసులో 9మందిని ఇంతకుముందే అరెస్టు చేయగా మరో నిందితురాలైన దాసు హారికను మంగళవారం అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులు 2018 నుంచి పలువురిని మోసగించారని తెలిపారు. అరెస్టయిన నిందితుల నుంచి ఇప్పటి వరకు రూ.1.47కోట్ల నగదుతో పాటు 4తులాల బంగారు ఆభరణాలు, ఒక రాయిల్‌ఎన్‌ఫీల్డ్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. వసూళ్లకు పాల్పడిన డబ్బుతో కొనుగోలు చేసిన 92.5తులాల బంగారు ఆభరణాలను మళ్లీ బ్యాంకులో తాకట్టు పెట్టి లోన్ తీసుకున్నట్లు నిందితులు తెలిపారని ఎస్పీ వివరించారు. వాటిని కూడా వీలైనంత త్వరగా స్వాధీనం చేసుకుంటామని ఆయన చెప్పారు. ఈ కేసులో పరారీలో ఉన్న ముగ్గురు నిందితులు రూహత్‌బేగ్, ఉపేందర్‌నాయుడు, రవిరాజులను కూడా త్వరలో పట్టుకుంటామన్నారు.

నకిలీ విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోండి

- ఎనిమిదేళ్ల క్రితం రేవంత్‌రెడ్డి వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ 2016లో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. నకిలీ విత్తనాల వల్ల పెట్టుబడులు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేయాలని రేవంత్ రెడ్డి తన పిటిషన్‌లో కోరారు. ఏపీ రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం సంబంధిత విత్తన కంపెనీల స్థిరచరాస్తులను జప్తుచేయడం ద్వారా రైతులకు పరిహారం చెల్లించాలని సూచించారు. అప్పటికీ బకాయిలు రికవరీ కాపోతే యజమానులను అరెస్ట్ చేయాలని కోరారు. అలాంటి కంపెనీల లైసెన్స్‌లను విత్తనాల చట్టం ప్రకారం రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు విత్తన సరఫరా, ధరల నిర్ధారణ, డిమాండ్ సప్లై వంటి అంశాలను నియంత్రించాలని కోరారు. వారిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతోపాటు పీడీ యాక్ట్ ప్రయోగించడం ద్వారా రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్ చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్.. కౌంటర్ దాఖలు చేయడానికి నాలుగువారాల సమయం ఇవ్వాలని కోరారు. దీంతో విచారణ వాయిదాపడింది.

భూసేకరణ చేయకుండానే బస్టాండు నిర్మాణం

- పరిహారం చెల్లించాలన్న ఆదేశాలూ బేఖాతరు
- భువనగిరి జిల్లా అధికారుల హాజరుకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి భూసేకరణ చేయకుండానే ప్రైవేటు వ్యక్తుల భూమిలో బస్టాండు వంటి నిర్మాణాలు చేపట్టిన భువనగిరి జిల్లా అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. యజమానికి పరిహారం చెల్లించకుండానే రోడ్లు, పాఠశాల భవనం, వాటర్ ట్యాంక్, బోర్‌వెల్స్, బస్టాండ్ నిర్మించడాన్ని తప్పుపట్టింది. ఇందుకు సంబంధించి దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో ప్రత్యక్షంగా తమ ఎదుట హాజరుకావాలని పేర్కొంటూ భువనగిరి కలెక్టర్, ఆర్డీవో, తుర్కపల్లి మండల ఎంపీడీవో, తహసీల్దార్‌కు ఆదేశాలు జారీచేసింది. భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గోపాలపురానికి చెందిన 85 ఏళ్ల వృద్ధుడు రహీముద్దీన్ అమెరికాలో సెటిల్‌అయ్యారు. ఆయనకు తెలియకుండానే అతనికి చెందిన సర్వేనం.171లో దాదాపు రెండెకరాల భూమిలో ప్రభుత్వం వివిధ నిర్మాణాలు చేపట్టింది. 2010లో స్వగ్రామానికి వచ్చినప్పుడు ఈ నిర్మాణాలు చూసిన రహీముద్దీన్ ఆశ్చర్యానికి గురై అధికారులను ఆశ్రయించారు. లాభంలేకపోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2022లో జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం పిటిషనర్‌కు అనుకూలంగా తీర్పు ఇస్తూ పరిహారం చెల్లించాలని కలెక్టర్ తదితరులకు ఆదేశాలు ఇచ్చింది. దీనిపై ప్రభుత్వం డివిజన్ బెంచ్‌లో అప్పీల్‌కు వెళ్లింది. ఆ భూమిని పిటిషనర్ సాదాబైనామా (తెల్లకాగితం) ద్వారా సర్పంచికి విక్రయించారని ప్రభుత్వం పేర్కొంది. ఈ వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. సాదాబైనామా చేసినట్లు ఎలాంటి ఆధారాలు లేవని తెలిపింది. గ్రామపంచాయతీ తరఫున భూలావాదేవీలు నిర్వహించడానికి సర్పంచి గుర్తింపు పొందిన అథారిటీ కాదని రూలింగ్ ఇచ్చింది. డివిజన్ బెంచ్ సైతం పిటిషనర్‌కే అనుకూలంగా తీర్పు ఇచ్చింది. పరిహారం చెల్లించకపోవడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం.. కోర్టు ధిక్కరణ చర్యలు ఎదుర్కోవడానికి వీలుగా వారంతా తమ ఎదుట ప్రత్యక్షంగా హాజరుకావాలని ఆదేశిస్తూ ఫారం -1 నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ ఆగస్టు 5కు వాయిదా పడింది.

భార్యను రోకలి బండతో కొట్టిచంపి.. భర్త ఆత్మహత్య!

- ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతోనే
- అనాథలైన ముగ్గురు పిల్లలు
- వరంగల్ జిల్లా కేంద్రంలో విషాదం


చరణ్, స్వప్న(ఫైల్), అనాథలైన ముగ్గురు పిల్లలు

ఖిలావరంగల్, జూలై 9: రాత్రంతా మామయ్య ఇంట్లో ఉన్న ఆ ముగ్గురు పిల్లలు ఉదయం ఇంటికొచ్చి లోపల తల్లిని రక్తపు మడుగులో ఓ చోట, తండ్రి మరోచోట విగతజీవులుగా చూసి షాక్‌కు గురయ్యారు. అమ్మా, నాన్నా అంటూ గుండెలవిసేలా రోదించారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో దిక్కుతోచని స్థితిలో భర్త ఉన్మాదిగా మారి ఘోరానికి పాల్పడ్డాడు. పథకం ప్రకారం.. పిల్లలను తన బావమరిది ఇంటికి పంపించి.. ఆ రోజు రాత్రి భార్యతో గొడవపెట్టుకొని ఆమెను రోకలి బండతో కొట్టి చంపి.. తర్వాత తాను ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. మంద చరణ్ (45), స్వప్న (40)కు 18 ఏళ్ల క్రితం పెళ్లయింది. వీరికి కుమార్తెలు గ్రేసీ, మెర్సీ, కుమారుడు శాలూమ్ ఉన్నాడు. ఈ కుటుంబం వరంగల్‌లోని 18వ డివిజన్ చెన్నారెడ్డి కాలనీలో ఉంటోంది. పెద్ద అమ్మాయి గ్రేసీ ఏడో క్లాసు దాకా చదివి ఇంట్లోనే ఉంటోంది. మెర్సీ గుండెకు రంధ్రం ఉండటంతో ఆమె తరచూ అనారోగ్యం బారిన పడుతోంది. ఫలితంగా ఆమె కూడా బడికి వెళ్లడం లేదు. బాబు శాలూమ్ పుట్టుకతోనే అంధుడు. చరణ్ భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. స్వప్న కూరగాయల మార్కెట్లో కూలీ పనికి వెళుతోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొద్దిరోజులుగా చరణ్, స్వప్న మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం సాయంత్రం చరణ్ తన ముగ్గురు పిల్లలను వరంగల్‌లోని ఉర్సు ప్రాంతంలో నివాసం ఉండే తన బావమరిది ఇంట్లో దింపేసి వచ్చాడు. రాత్రి ఇంట్లో స్వప్నతో చరణ్ గొడవపడ్డాడు. తీవ్ర ఆగ్రహంతో రోకలిబండ తీసుకొని స్వప్న తలపై కొట్టాడు. తీవ్ర గాయమై రక్తస్రావం జరగడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. తర్వాత.. అప్పటికే తెచ్చుకున్న పురుగు మందును తాగి చరణ్ ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం తమ మామయ్య ఇంటినుంచి ఆటోలో తిరిగొచ్చిన ముగ్గురు పిల్లలు ఇంట్లోకి వెళ్లి చూడగా తల్లి రక్తపు మడుగులో, తండ్రి విగతజీవిగా కనిపించారు. భయంతో బిగ్గరగా కేకలు పెడు తూ బయటకొచ్చిన పిల్లలు అమ్మ.. నాన్న అంటూ రోదించారు. తల్లిదండ్రుల మృతితో అనాథలైన పిల్లలను చూసి స్థానికుల కళ్లు చెమర్చాయి. పోలీసులొచ్చి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు మార్చురీకి తరలించారు. గ్రేసీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ధనమదం!

ముంబైలోని వర్లీలో మద్యంమత్తులో బీఎండబ్ల్యూకారును అతివేగంగా నడిపి ఒక మహిళను చంపివేసిన మిహిర్ షా అనే వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్టుచేశారు. మూడురోజులుగా పరారీలో ఉన్న అతడిని పట్టుకోవడానికి ఏకంగా పదకొండు పోలీసు బృందాలు రాష్ట్రాన్ని జల్లెడపట్టాల్సివచ్చిందట. ఈ ధనిక యువకుడు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండే వర్గానికి చెందిన రాజేష్ షా అనే నాయకుడి కుమారుడు కావడంవల్లనే అరెస్టులో ఇంత తాత్సారం జరిగిందని, ప్రమాదం సమయంలో మద్యం తాగివున్న రుజువులు నాశనం చేయడానికి పోలీసులు ఉద్దేశపూర్వకంగా ఈ జాప్యం చేశారన్నది విపక్షనేతల ఆరోపణ. ఈ కేసులోనే కాదు, భవిష్యత్తులోనూ ఈ తరహా హిట్ అండ్ రన్ కేసుల విషయంలో తాను కఠినంగా వ్యవహరిస్తానని, పోలీసుల పనిలో ఎవరిజోక్యమూ లేకుండా చూస్తానని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రజలకు హామీ ఇస్తున్నారు.

ఇటువంటి ఘటనలను రోడ్డు ప్రమాదాలుగా కాక, ధనమదంతో చేసిన హత్యలుగా అభివర్ణించడం సముచితంగా ఉంటుందేమో. అతి ఖరీదైన, అధిక అశ్వశక్తిగల కార్లు కొనడం, వాటిని విపరీతమైన వేగంతో నడిపి సామాన్యుల ప్రాణాలు తీయడం ఇటీవల తరచుగా జరుగుతోంది. దీనికి మద్యం మత్తుకూడా తోడైనప్పుడు ఎదుటివారి ప్రాణాలు తృణప్రాయమైపోతాయి. వొర్లి ఘటన మనసు కలచివేస్తుంది. ఆదివారం ఉదయం ఐదున్నర సమయంలో నిందితుడు మద్యం మత్తులో కారు అతివేగంగా నడుపుతూ ముందువెళుతున్న స్కూటీని ఢీకొట్టాడు. దీంతో స్కూటీపై ఉన్న దంపతుల్లో భర్త పక్కకు ఎగిరిపడి తీవ్రంగా గాయపడ్డాడు. కానీ, కారుముందుభాగంలో చిక్కుకుపోయిన నలభైఐదేళ్ళ కావేరీ నక్వాను నిందితుడు కిలోమీటరున్నర వరకూ ఈడ్చుకుపోవడంతో ఆమె శరీరం ఛిద్రమై మరణించింది. కారు ఆపమని వేడుకుంటూ భర్త కేకలు వేస్తున్నప్పటికీ వారు లక్ష్యపెట్టలేదు. సంఘటనస్థలానికి చాలా దూరంలో ఆపి, సదరు నిందితుడు, అతడి డ్రైవర్ కలసి ఆమె శరీరాన్ని కారునుంచి విడదీశారు. ఆ తరువాత డ్రైవింగ్ సీటులో ఉన్న మిహిర్ షా స్థానంలోకి పక్కనే ఉన్న డ్రైవర్ వచ్చి కూర్చున్నాక కారు మరోమారు కావేరీ నక్వా శరీరంమీద నుంచి పోనిచ్చి అక్కడనుంచి తప్పించుకున్నారు. తమ స్కూటీని గుద్దిన వెంటనే మిహిర్ షా కారు ఆపివుంటే తన భార్య కచ్చితంగా జీవించేదని భర్త గట్టిగా చెబుతున్నాడు. చాలా దూరం కారువెనుక అరుస్తూ, ఏడుస్తూ పరిగెత్తినా మిహిర్ మనసు కరగలేదని, ఒక్క క్షణం కారును ఆపివుంటే సరిపోయేదని అతడు అంటున్నాడు.

నిందితుడిని ఇంతకాలమూ దాచిన వారందరినీ పోలీసులు అరెస్టు చేశారు కానీ, మిహిర్ అరెస్టులో ఈ సుదీర్ఘజాప్యం వల్ల కేసు బలహీనపడుతుందన్న భయాలైతే ఉన్నాయి. ప్రమాదానికి ముందు అతడు బార్‌లో నలుగురు స్నేహితులతో గడపడం, వేలాది రూపాయలు బిల్లు చెల్లించడం వంటి ఆధారాలున్నప్పటికీ, ప్రమాదం జరిగినప్పుడు మిహిర్ షా తాగివున్నాడని, ఆ సమయంలో అతడి శరీరంలో ఇంత మొత్తం ఆల్కహాల్ ఉన్నదనే విషయాలు రుజువుచేయడం కష్టం కావచ్చు. ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్న డ్రైవర్, తానే యాక్సిడెంట్ చేశానని దబాయించినపక్షంలో అది అబద్ధమని రుజువుచేయడం కూడా పోలీసులకు కష్టం కావచ్చు.

ఈ దారుణానికి సంబంధించి ఇప్పుడు వినబడుతున్న కథనాలు, పోలీసుల వాదనలూ రేపు న్యాయస్థానాల్లో నిలుస్తాయన్న నమ్మకమేమీలేదు. రెండునెలల క్రితం పూణేలో ఇదే తరహాలో జరిగిన పోర్షే కారు ప్రమాదం దేశాన్ని కుదిపేసింది. రెండుకోట్ల ఖరీదైన లగ్జరీ కారును మద్యం మత్తులో రెండువందలయాభై కిలోమీటర్ల వేగంతో నడుపుతూ ఒక మైనర్ బాలుడు చేసిన ఈ అకృత్యానికి ఇద్దరు యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు దుర్మరణం పాలైనారు. రియలెస్టేట్ వ్యాపారి అయిన తండ్రి ఇంకా రిజిస్ట్రేషన్ కూడా కాని ఆ కారును కొడుకు చేతుల్లో పెడితే, ఆ మైనర్ కుర్రాడు బార్‌లో పూటుగా తాగి ఈ ఘోరానికి కారకుడైనాడు. ఇద్దరిని ఇలా హత్యచేసినప్పటికీ, ఇంకా పిల్లవాడే కనుక ఓ మూడువందల పదాల్లో వ్యాసం రాయించి, జువనైల్ బోర్డు బెయిల్ మంజూరు చేయడం, ఆ బెయిల్ వచ్చేలోగా ఆ కుర్రవాడికి పోలీసులు రాచమర్యాదలు చేయడం వంటి పరిణామాలు సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. ప్రజాగ్రహానికి జడిసి నాయకులూ పోలీసులూ ఆ తరువాత గట్టిగా వ్యవహరించక తప్పలేదు. ఆశ్చర్యకరంగా జువనైల్ బోర్డు కూడా తన మనసు మార్చుకుంది. ధనికులు తమ ఖరీదైన కార్లతో సామాన్యుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్న ఘటనలు వేగంగా పెరుగుతున్నాయి. ధనబలం, నిర్లక్ష్యం, ఇతరుల ప్రాణాలపట్ల లెక్కలేనితనంతో పాటు, డబ్బుతో దేనినైనా సాధించగలమన్న ధైర్యం ఈ తరహా ఘటనలకు దోహదం చేస్తున్నమాట నిజం.

18వ లోక్‌సభ సవ్యంగా జరిగేనా?



పరస్పర శత్రుత్వ వాతావరణంలో 18వ లోక్‌సభ ప్రారంభమైన తీరు ఈ దేశంలో నిర్మాణాత్మక రాజకీయాలకు విఘాతం కలిగిస్తుందా అన్న ఆందోళనకు దారితీస్తోంది. ఎన్నికల ఫలితాలు మోదీకి ఒక సందేశాన్ని అందించాయన్న విషయంలో సందేహం లేదు కాని తమ బలం పెరిగినంత మాత్రాన సభలో గందరగోళం సృష్టించడానికి ప్రతిపక్షాలకు లైసెన్స్ ఇచ్చినట్లు ఎంత మాత్రమూ కాదు. రాహుల్ మాట్లాడినప్పుడు బీజేపీ ఎంపీలు మౌనంగా ఉన్నా మోదీ మాట్లాడుతున్నప్పుడు విపక్ష సభ్యులు గందరగోళం సృష్టించడం అసంబద్ధంగా కనిపిస్తోంది.

'ఇప్పటి వరకు జరిగిందంతా ట్రైలర్, ఇక ముందుముందు అసలు పిక్చర్ కనపడుతుంది' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ లోక్‌సభ ఎన్నికలకు ముందు ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఇదే విషయాన్ని గత వారం ఆయన రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ఇచ్చిన సమాధానంలో మరో రకంగా చెప్పారు. గత పదేళ్ల బీజేపీ పాలన భోజనానికి ముందు సేవించే అపిటైజర్ (సూప్) మాత్రమేనని ఇక ప్రధాన భోజనం వడ్డించడం ప్రారంభమైందని ఆయన అన్నారు. బహుశా ప్రతిపక్షాలు కూడా ఇదే ఆలోచనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయి. గత పదేళ్లూ బీజేపీకి పూర్తి మెజారిటీ వచ్చినందువల్ల పార్లమెంట్‌లో వారు ఎంత ప్రతిఘటించినా పెద్ద ఫలితం లేకపోయింది. ఇప్పుడు ప్రతిపక్షం బలోపేతం కావడం, బీజేపీ మిత్రపక్షాలపై ఆధారపడి ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి రావడంతో వారు తమ నిరసన ధ్వనులు మరింత మిన్నంటించేందుకు తయారవుతున్నారు. అందువల్ల ఎవరు అసలు పిక్చర్ చూపిస్తారో, ఏ భోజనం వడ్డిస్తారో రాబోయే రోజులు తేల్చనున్నాయి.

18వ లోక్‌సభ తొలి 9 రోజుల సమావేశాల్లోనే ప్రభుత్వానికీ ప్రతిపక్షాలకూ మధ్య ఘర్షణాయుత వాతావరణం కనిపించడంతో జూలై 22 నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాలు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు. పార్లమెంట్ సమావేశాలు జరిగినప్పుడల్లా అధికార పార్టీ, ప్రతిపక్షాలు రాజకీయ ప్రత్యర్థులుగా కాకుండా ఆజన్మ శత్రువులుగా వ్యవహరించడం వల్ల ఉద్వేగపూరిత నాటకీయ సన్నివేశాలు కనిపించక తప్పదు. తద్వారా అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన పార్లమెంట్ ప్రాధాన్యత మరింత తగ్గిపోయే అవకాశాలున్నాయి. నిశితంగా పరిశీలిస్తే ప్రతిపక్షాలు కేవలం నరేంద్రమోదీనే లక్ష్యంగా పెట్టుకుని వాగ్బాణాలు సంధిస్తున్నాయని అర్థమవుతుంది. చర్చల్లో బీజేపీ నేతలు ఎవరు మాట్లాడినా పెద్దగా స్పందించని ప్రతిపక్షాలు కేవలం మోదీ మాట్లాడినప్పుడు గందరగోళం సృష్టిస్తున్నాయి. ప్రతిపక్ష నేతల ప్రసంగాల్లో అధిక భాగం మోదీని విమర్శించేందుకు, ఎద్దేవా చేసేందుకు పరిమితమయ్యాయి.

సాధారణంగా చట్టసభల సమావేశాల్లో అద్భుతమైన ప్రసంగాలు ప్రతిపక్ష శిబిరంనుంచే వస్తాయి. ప్రభుత్వ పక్షం తరఫున మాట్లాడే వారికి తమ పాలన గురించి గణాంక వివరాలు చెప్పడం మినహా చెప్పగలిగింది పెద్దగా ఉండదు. కొద్ది రోజులు జరిగినప్పటికీ ఈ లోక్‌సభ సమావేశాల్లో సహజంగానే రాహుల్‌గాంధీ, మహువా మొయిత్రా, కల్యాణ్ బెనర్జీ, ఎ. రాజా లాంటి నేతలు ప్రభుత్వంపై, ముఖ్యంగా ప్రధానమంత్రిపై శక్తిమంతంగా విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. అంతే శక్తిమంతంగా మాట్లాడగలిగిన నేత అధికార పక్షంలో మోదీ తప్ప ఎవరూ కనపడకపోవడం విస్మరించదగిన విషయం కాదు. ఒక రకంగా ఈ సమావేశాలను చూస్తుంటే ఎన్నికలు ఇంకా కొనసాగుతున్నాయా అన్న అభిప్రాయం కలుగుతోంది. నిన్నమొన్నటి వరకూ జరిగిన ఎన్నికల ప్రసంగాలు మళ్లీ అదే ధోరణిలో పార్లమెంట్‌లో కూడా వినపడడమే ఇందుకు కారణం.

అయితే ప్రతిపక్ష నేత అయిన తర్వాత రాహుల్ గాంధీ తడుముకోకుండా, సూటిగా, విస్పష్టంగా మాట్లాడడం కాంగ్రెస్ నేతలకు చాలా కాలం తర్వాత హర్షాతిరేకం కలిగించింది. 2008లో రాహుల్‌గాంధీ తన పర్యటనలో కలుసుకున్న ఒక పేద మహిళ కళావతి గురించి పార్లమెంట్‌లో చేసిన ప్రసంగంలో తాను చెప్పదలుచుకున్న విషయాన్ని విస్పష్టంగా చెప్పలేక నవ్వుల పాలయ్యారు. ఆ తర్వాత కూడా ఆయన పార్లమెంట్‌లోను, బయటా అనేకసార్లు మాట్లాడినప్పుడు వినే వారికీ, ఆయనకూ మధ్య సమాచార అగాధం కనిపించేది. శిక్షపడ్డ ఎంపీలను కాపాడేందుకు 2013లో జారీ చేసిన ఆర్డినెన్స్ ప్రతిని రాహుల్ గాంధీ ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో చింపివేసి తమ యూపీఏ ప్రభుత్వాన్నే ఇరకాటంలో పెట్టారు. 2018లో తన ప్రసంగం తర్వాత రాహుల్ మోదీ వైపు వచ్చి ఆయనను కౌగిలించుకోవడం, ఆ తర్వాత సహచర ఎంపీలకు కన్ను కొట్టడం కూడా చర్చనీయాంశమైంది.

కాని 2008లో రాహుల్ ప్రసంగం విన్న వారికి, దాదాపు 16 ఏళ్ల తర్వాత 2024లో ప్రతిపక్ష నేతగా ఆయన ప్రసంగం విన్న వారికి ఒక చెప్పుకోదగ్గ మార్పు కనిపించింది. అప్పటి, ఇప్పటి రాహుల్‌లో స్పష్టమైన తేడా ఉన్నది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, మణిపూర్, అగ్నివీర్, నీట్ ప్రశ్న పత్రాల లీక్‌పై మాట్లాడడంతో పాటు మోదీ వ్యవహార శైలిపై తడుముకోకుండా తీవ్రవిమర్శనాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ పార్టీ తమ నాయకుడుగా భావిస్తున్న వ్యక్తి ఇన్నాళ్ల వరకూ లోక్‌సభలో పెద్దగా గొంతు విప్పగలిగే వాడు కాదు. ఒకవేళ మాట్లాడినా అందులో ఒక ధార కానీ, ప్రవాహం కానీ కనిపించేది కాదు. ఇప్పుడు కాంగ్రెస్‌కే కాక ప్రతిపక్షాలకు ఒక నేత అంటూ లభించాడని చెప్పక తప్పదు. మోదీ సభలో ప్రవేశించినప్పుడు ఎప్పటి మాదిరి మోదీ, మోదీ అన్న నినాదాలు వినిపిస్తే రాహుల్ సభలో ప్రవేశించినప్పుడు మొదటి సారి రాహుల్, రాహుల్ అన్న నినాదాలు ప్రతిపక్ష శిబిరం నుంచి వినిపించాయి. మోదీ తన ప్రసంగంలో రాహుల్‌ను బాలకుడని అభివర్ణించినప్పటికీ రాహుల్ బాలకుడి స్థాయిని వయసు రీత్యానే కాక, పరిణతి రీత్యా దాటిపోయారని ఎవరికైనా అనిపిస్తుంది. గతంలో సభలో అరుదుగా కనిపించే మోదీ ఇప్పుడు రాహుల్ ఉన్నంత సేపూ సభలో కూర్చోవడం విస్మరించదగిన విషయం కాదు. మోదీ అబద్ధాలు చెబుతున్నారని రాహుల్ అంటే రాహుల్ అబద్ధాలు చెబుతున్నారని మోదీ అంటున్నారు. మోదీ ఇప్పుడు ఎన్డీఏ నాయకుడని రాహుల్‌కు, రాహుల్ మొత్తం ఇండియా కూటమి నాయకుడని మోదీకి తెలిసినా ఇరువురూ పరస్పరం ఒకర్నొకరు లక్ష్యంగా పెట్టుకోవడం వెనుక ఒక వ్యూహం ఉన్నట్లు కనిపిస్తోంది.

పార్లమెంట్‌లో ప్రారంభమైన ఈ వ్యూహాలు ఇప్పుడు బయట కూడా అమలయ్యే అవకాశాలున్నాయి. మణిపూర్, హత్రాస్, అస్సాం దేశంలో ఎక్కడ ఏ సమస్య తలెత్తినా రాహుల్‌గాంధీ అక్కడకు వెళ్లి జనంలో కలిసిపోవడమే కాకుండా మోదీపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధులు, ప్రధాన కార్యదర్శులు, మీడియా విభాగం గతంలో కంటే మరింత చురుకుగా కనిపిస్తోంది. ప్రతిపక్షాల సంఘటిత కార్యాచరణ గతంలో కంటే బలంగా మారింది. ఈ రీత్యా బలమైన ప్రతిపక్షాలను ఎదుర్కొనేందుకు మోదీ కూడా సంఘటిత కార్యాచరణ ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైంది.

ఎవరు ఎన్ని చెప్పినా దేశంలో ప్రజలు ఎన్డీఏ, ఇండియా కూటమిల మధ్య చీలిపోయారన్నది విస్పష్టంగా కనిపిస్తోంది. ఈ రెండు పక్షాల్లో లేనివారు కకావికలయ్యే పరిస్థితి ఏర్పడింది తమ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ తమ వైపుకు తిప్పుకుంటోందని, ఇది రాజ్యాంగ వ్యతిరేకమని మంగళవారం బీఆర్ఎస్ నేతలు ఢిల్లీలో విలేఖరుల సమావేశం పెట్టి మరీ వాపోయారు. దేశంలో చాలా మంది నేతలకు రాజ్యాంగం వారు కష్టకాలంలో ఉన్నప్పుడే గుర్తుకు వస్తుంది. తాము అధికారంలో ఉన్నప్పుడు ఇదే రాజ్యాంగాన్ని తామే కాలరాశామన్న విషయం వారు మరిచిపోతారు.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

పరస్పర శత్రుత్వ వాతావరణంలో 18వ లోక్‌సభ ప్రారంభమైన తీరు ఈ దేశంలో నిర్మాణాత్మక రాజకీయాలకు విఘాతం కలిగిస్తుందా అన్న ఆందోళనకు దారితీస్తోంది. 'బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకదానినొకటి శత్రువులుగా కాకుండా రాజకీయ ప్రత్యర్థులుగా మాత్రమే భావించాలి. జాతీయ అంశాలపై ఏకాభిప్రాయ సాధన కోసం ప్రయత్నించాలి, తమ మధ్య సమాచార సంబంధాలు ఏర్పర్చుకోవాలి..' అని బీజేపీ కురువృద్ధుడు లాల్‌కృష్ణ అద్వాణీ తన ఆత్మకథలో రాశారు. ఇదే విషయాన్ని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ఎన్నికల అనంతరం నాగపూర్‌లో చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. 'మన సంప్రదాయం ఏకాభిప్రాయంతో ముడిపడి ఉన్నది..' అని ఆయన చెప్పారు. 'అందర్నీ కలుపుకుపోవడం, ఏకాభిప్రాయానికి ప్రయత్నించడం అధికారంలో ఉన్న వారి బాధ్యత' అన్నారు. సమాజంలో ఉన్న వైమనస్యాలు, మైనారిటీల్లో ఉన్న ఆందోళనలు తొలగించడం అధికారంలో ఉన్నవారే చేయాలని. వివిధ వర్గాల మధ్య పరస్పర గౌరవం ఏర్పడేలా చూడాలని, అహంకారం లేని హుందాతనం అవసరమని ఆయన అన్నారు.

మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు బీజేపీ అగ్రనేతలను ఉద్దేశించి చేసి ఉండవచ్చు కాని రాజకీయాల్లో ప్రవర్తనా నియమావళి అన్ని వర్గాలకూ వర్తిస్తుంది. ఎన్నికల ఫలితాలు మోదీకి ఒక సందేశాన్ని అందించాయన్న విషయంలో సందేహం లేదు కాని తమ బలం పెరిగినంత మాత్రాన సభలో గందరగోళం సృష్టించడానికి ప్రతిపక్షాలకు లైసెన్స్ ఇచ్చినట్లు ఎంత మాత్రమూ కాదు. రాహుల్ మాట్లాడినప్పుడు బీజేపీ ఎంపీలు మౌనంగా ఉన్నా మోదీ మాట్లాడుతున్నప్పుడు విపక్ష సభ్యులు గందరగోళం సృష్టించడం అసంబద్ధంగా కనిపిస్తోంది.

గత లోక్‌సభ సమావేశాలు చరిత్రలో ఎన్నడూ లేనంతగా అతి తక్కువ రోజులు జరిగాయి. 18వ లోక్‌సభ సమావేశాలు కూడా వ్యర్థం కాకుండా చూసుకోవడం ఇరు పక్షాలకు అవసరం. ఇప్పటికే వ్యవస్థలు పనిచేయడం లేదని చాలా మంది వాపోతున్నారు. చట్టసభల పట్ల కూడా అలాంటి అభిప్రాయం ఏర్పడుతోంది. గత ఎన్నికల్లో కంటే ప్రజల ఓట్ల శాతం ఈ సారి తగ్గిపోయింది. ఓటర్లలో దాదాపు సగం మంది ఎన్నికలను విస్మరించడమో, విముఖంగా ఉండడమో చేశారు. ప్రజలకు ప్రజాస్వామ్యం పట్ల ఆసక్తి పెరిగేలా చేయాలంటే అధికార, ప్రతిపక్షాలు పార్లమెంటులో తమ పాత్రను బాధ్యతాయుతంగా నిర్వర్తించడం తప్ప వేరే మార్గం లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

కాంగ్రెస్ డీఎన్ఏలోనే హిందూ వ్యతిరేకత!

రాజ్యాంగాన్ని ప్రదర్శిస్తూ ఎంపీగా ప్రమాణం చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే దాని విలువలను విస్మరించడాన్ని బట్టి కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి రాజ్యాంగం పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతున్నది. కులమతాలకు అతీతంగా, సర్వ మానవ శ్రేయస్సు కోసం పనిచేస్తానని జూన్ 25న ప్రమాణం చేసిన రాహుల్‌గాంధీ జూలై 1న హిందూ సమాజంపై విషం చిమ్మడం రాజ్యాంగ విలువలకే అవమానం. ఈ దేశాన్ని సుదీర్ఘకాలం పాటు పరిపాలించిన జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల 'కుటుంబ ప్రతినిధి'గా రాజకీయాల్లో రాణిస్తున్న రాహుల్‌గాంధీ ఈ దేశ మెజార్టీ ప్రజలపై, వారి విశ్వాసాలపై మాటల తూటాలతో దాడులకు తెగబడడం అప్రజాస్వామికం. 'హిందువులు హింసావాదులు, విధ్వంసకారులు, కుట్రదారులు' అంటూ నిరాధార ఆరోపణలు చేయడం దుర్మార్గం!

'మైనార్టీలు దేశానికి గర్వకారణం, అన్ని రంగాల్లోనూ దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న దేశ భక్తులు వారు' అంటూ ఓటు బ్యాంకు మాటలు మాట్లాడటం మెజారిటీ ప్రజల మనోభావాలను గాయపరచడమే. దాదాపు ఆరు దశాబ్దాలకు పైగా ఈ దేశ పీఠంపై కూర్చున్న కాంగ్రెస్ నేడు ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ ప్రచారం పొందాలనుకోవడం సముచితం కాదు. పదిహేను నిమిషాల్లో హిందువులను అంతం చేస్తానన్న అక్బరుద్దీన్ ఓవైసీ, సనాతన ధర్మాన్ని పెకిలించివేస్తానని వెకిలి మాటలు మాట్లాడిన ఉదయనిధి స్టాలిన్ వంటి నేతల సరసన రాహుల్‌గాంధీ కూడా చేరడం లోక్‌సభలో ప్రతిపక్ష నేత స్థాయిని తగ్గించే విషయం. ఓటు బ్యాంకు రాజకీయాలను దృష్టిలో ఉంచుకొని, లౌకికవాదం ముసుగులో హిందుత్వంపై దాడి చేస్తే నేటి నాగరిక సమాజం హర్షించదు. రాజకీయ అవసరాల కోసం హిందూ ధర్మంపై దాడి చేస్తే, తగు రీతిలో జవాబు చెప్పేందుకు హిందూ సమాజం కూడా సిద్ధంగా ఉందనే విషయం తెలుసుకోవాలి. భారతీయత కోసం, సనాతన ధర్మం కోసం, జాతీయ వాదం కోసం ప్రాణాలను లెక్కచేయక పోరాడిన పరాక్రమ వీరుల చరిత్ర ఓసారి గుర్తెగాలి.



ఎన్నికలప్పుడు దేవాలయాలను సందర్శిస్తూ హిందువుల ఓట్ల కోసం నకిలీ ప్రేమను వలకబోసిన కాంగ్రెస్ ఇప్పుడు చీమకు కూడా హాని తలపెట్టని హిందువులను ఉగ్రవాదులతో పోల్చడం దుర్మార్గం. హిందువులు ఉగ్రవాదులు అనే వ్యాఖ్యలపై రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్క హిందువు స్పందించాలి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలోని హిందువులందరూ జాగృతం కావాలి.

హిందూ సమాజాన్ని అంతం చేయాలని పంతం పట్టి, అదే ఎజెండాగా పాలన సాగించిన అనేకమంది రాజులు ఆ కోరిక నెరవేరకుండానే కాలగర్భంలో కలిసిపోయారు. భౌతికంగా దేవాలయాలను, శిల్ప సంపదను కొల్లగొట్టగలిగారు తప్ప, ఈ దేశ మూలాలను, హిందూ సంస్కృతీ సంప్రదాయాలను తాకలేకపోయారు. నేటి సందర్భంలో ఈ దేశ సమగ్రతకు పెనుముప్పుగా సంక్రమిస్తున్న ప్రమాదకర 'హిందూ విద్వేషపు మాట'లను హిందూ సమాజం నిశితంగా గమనిస్తున్నది. లోతుగా ఆలోచిస్తున్నది కూడా. రాజకీయ నేతలు పెంచి పోషిస్తున్న మతమార్పిడి మాఫియా, హిందూ వ్యతిరేక విధానాలపై స్పందించేందుకు సిద్ధంగా ఉంది.

భారతీయ జీవన విధానానికి వ్యతిరేకంగా పని చేస్తున్న సంస్థలకు వంతపడటం కాంగ్రెస్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ముఖ్యంగా తన డీఎన్ఏలోనే హిందూ వ్యతిరేక భావాన్ని నింపుకున్నట్టుంది ఆ పార్టీ. అందులో భాగంగానే అయోధ్య శ్రీ రామ జన్మభూమిలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను బహిరంగంగా బహిష్కరించి, హిందూ విరోధిగా ముద్ర వేసుకుంది. దాదాపు 500 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం అనంతరం 'హిందూ లోకం' చేసుకుంటున్న పండుగను వ్యతిరేకించింది. 'రాముడు లేడు, రామాయణం లేదు, రామసేతు కల్పితం' అంటూ వాదించింది. హిందుత్వం బలపడుతుంటే ఓర్చుకోలేని కాంగ్రెస్ అయోధ్య రాముడి అక్షింతలను అవహేళన చేసింది. శ్రీరాముడిపై, హిందూ ధర్మంపై అక్కసు వెళ్ళగక్కిన విషయం ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమైన మతపరమైన రిజర్వేషన్లను ప్రవేశపెట్టి హిందువుల (బీసీ) రిజర్వేషన్లు లాక్కొని ఓట్ల కోసం ముస్లింలకు అప్పజెప్పిన పార్టీ కాంగ్రెస్.

మొత్తంగా హిందువులంటే కాంగ్రెస్ పార్టీకి లెక్కలేనంత విద్వేషం. అందులో భాగంగానే హిందువులపై భారీ కుట్రలకు తెరలేపుతున్నది. హిందూ ఉగ్రవాదం అనే భయానకమైన మాటలతో ధర్మంపై దాడికి దిగటం కూడా ఈ కోవకి చెందినదే. హిందూ సంస్కృతీ సంప్రదాయాలపై, ఆచార వ్యవహారాలపై, అనాదిగా వస్తున్న పరంపరపై నిందలు మోపేందుకు ప్రణాళిక ప్రకారం కాంగ్రెస్ నేతలు కుట్ర పన్నుతున్నారు. రాజకీయ లబ్ధి కోసం హిందూ ధర్మాన్ని విమర్శించడం కొంతమంది నేతలకు ఈ రోజుల్లో ఫ్యాషన్‌గా మారిపోయింది.

ఈ సృష్టిలో 1600 ఏళ్ల క్రితం ఇస్లాం లేదు. 2000 ఏళ్ల క్రితం క్రైస్తవం లేదు. 600 ఏళ్ల క్రితం కశ్మీర్‌లో ముస్లిం అనేవారు లేరు. అందుకు చక్కని ఉదాహరణ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత గులాం నబీ ఆజాద్ వ్యాఖ్యలే. 'భారతీయులంతా ఒకప్పటి హిందువులే'నని ఆజాద్ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ లోతుగా ఆలోచిస్తే హిందుత్వం విలువలు బోధపడే అవకాశం ఉంది. హిందూ ధర్మం అతి ప్రాచీనమైనది. అత్యంత ప్రముఖమైనది కూడా. భారతీయ విలువలు, సనాతన ధర్మం లక్షల ఏళ్లుగా వస్తున్న పరంపర. హిందుత్వం ఎవరో తయారు చేసిన మతం కాదు. భగవంతుడు సృష్టించిన జీవన విధానం. అన్ని మతాలను ఆచారాలను ఎలాంటి కల్మషం లేకుండా తన కడుపులో దాచుకునే ఉదారమైన ధర్మం హైందవం. అలాంటి ధర్మంపై నిందలు వేయడం పాపం.

ప్రస్తుతం ప్రపంచంలో అతి వేగంగా విస్తరిస్తున్న ధర్మం హిందూ ధర్మమే. ప్రపంచ దేశాలను హిందూ జీవన విధానం, సంస్కృతీ సంప్రదాయాలు ఆకర్షిస్తున్నాయి. చెట్టు, పుట్ట, మట్టి, పాము, కుక్క, ఎలుక నుంచి మొదలుకొని ఏనుగు వరకు ప్రతి ప్రాణిని పూజించే వ్యక్తులు హిందువులే. అహింసను శాంతిని ప్రపంచానికి చాటి చెప్పి, సేవా మార్గాన్ని చూపించింది హిందువులే. నిప్పును అగ్ని దేవతగా, నీరును గంగా దేవతగా, నేలను భూమాతగా, గాలిని వాయుదేవుడిగా ప్రకృతిని ఆరాధిస్తూ సకల జీవరాశులను ప్రేమించే ధర్మం హిందువుల సొంతం. హిందువులు సహనశీలురు శాంతి స్వరూపులు. ఈ దేశంలోని అన్ని మతాలను గౌరవిస్తున్నారు, కాబట్టే ఇక్కడ ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోంది.

ఎన్నికలప్పుడు దేవాలయాలను సందర్శిస్తూ హిందువుల ఓట్ల కోసం నకిలీ ప్రేమను వలకబోసిన కాంగ్రెస్ ఇప్పుడు చీమకు కూడా హాని తలపెట్టని హిందువులను ఉగ్రవాదులుగా పోల్చడం దుర్మార్గం. హిందువులు ఉగ్రవాదులు అనే వ్యాఖ్యలపై రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్క హిందువు స్పందించాలి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలోని హిందువులందరూ జాగృతం కావాలి. లేదంటే స్వార్థ రాజకీయాల కుట్రలలో హిందుత్వం నలిగిపోయే ప్రమాదం ఉన్నది.

ప్రపంచానికే దిక్సూచి హిందుత్వమని, 131 ఏళ్ల క్రితమే ప్రపంచ మత మహాసభల్లో హిందూ మతం గొప్పతనాన్ని స్వామి వివేకానందుడు ప్రపంచానికి తెలియజేశారు. ఇంతటి గొప్ప వైవిధ్యం గల హిందూ ధర్మంపై విధ్వంసకర మాటలు మాట్లాడిన రాహుల్‌గాంధీ, వెంటనే హిందువులందరికీ క్షమాపణ చెప్పి దేశ సమగ్రతను కాపాడాలి.

• పగుడాకుల బాలస్వామి
ప్రచార ప్రసార ప్రముఖ్, విశ్వహిందూ పరిషత్

కరపత్రం

బొగ్గుగనుల వేలం ఆపాలి!

సింగరేణికి చెందిన సత్తుపల్లి, కోయగూడెం(ఇల్లందు), శ్రావణపల్లి, తాడిచెర్ల తదితర బొగ్గు బ్లాకులతో కలిపి దేశవ్యాప్తంగా 60కి పైగా గనులను మోదీ ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. ఇది గని కార్మికుల మెడకు ఉరి తాడు బిగించడమే. సింగరేణిని బొగ్గు ఉత్పత్తి చేసే సంస్థగా మాత్రమే చూడకూడదు. అది తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక. దీనిని ప్రైవేట్ పరం చేయవద్దని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. బొగ్గుగనుల ప్రైవేటీకరణలో అక్రమాలను నియంత్రించేందుకే వేలం అమలు చేయాలని సుప్రీంకోర్టు చెప్పింది, అంతేగాని వేలం వేసి ప్రైవేటీకరించాలని చెప్పలేదు. ఈ నేపథ్యంలో బొగ్గుగనుల అమ్మకాలను ఉపసంహరించుకోవాలని, సింగరేణిలో వేలానికి పెట్టిన నాలుగు బొగ్గు బ్లాకులను ఆ సంస్థకే కేటాయించాలని, సింగరేణి పరిరక్షణకు అండర్‌గ్రౌండ్ బావులను తీయాలని, మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలుగా అమలుచేయాలని కోరుతున్నాం.


–తెలంగాణ కార్మిక సంఘం

తెలంగాణ ప్రగతి రథం కాళేశ్వరం

గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ఆధారంగా గోదావరి జలాల్లో ఉమ్మడి రాష్ట్రానికి 75శాతం విశ్వసనీయత కలిగిన నికర జలాల కేటాయింపులు 1480 టిఎంసిలు ఉంటాయని లెక్కగట్టి అందులో 969 టిఎంసిలను తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించారు. ఈ కేటాయింపులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసినప్పటికీ ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం చేత అవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. వాస్తవ వినియోగం ఏనాడూ 400 టిఎంసిలకు మించలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఈ అంశాలను కూలంకషంగా మథించి గోదావరి జలాల గరిష్ఠ వినియోగం కాళేశ్వరం ప్రాజెక్టు, సమ్మక్క సాగర్, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల నిర్మాణంతోనే సాధ్యం అవుతుందని భావించి ఆయా ప్రాజెక్టులకు రూపకల్పన చేసింది. ఈ మూడింటిలో కాళేశ్వరం, సమ్మక్కసాగర్ పూర్తయ్యాయి. సీతమ్మ సాగర్ చివరి దశలో ఉన్నది. ఇవి కాక గోదావరి బేసిన్‌లో ఉన్న అన్ని పెండింగ్ ప్రాజెక్టులను తెలంగాణ ప్రభుత్వం పూర్తి చేసి గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను సంపూర్ణంగా వినియోగించడానికి కృషి చేసింది. తెలంగాణలో గోదావరి, కృష్ణా నదులు తక్కువ ఎత్తులో ప్రవహిస్తాయి. సాగు యోగ్యమైన భూములు ఎక్కువ ఎత్తులో ఉంటాయి. ఈ భూములకు సాగునీరు అందించాలంటే ఎత్తిపోతలు తప్ప మరో మార్గం లేదు. వానాకాలం నాలుగు నెలల్లో కురిసే వర్షపు నీళ్ళను భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒడిసి పట్టి ఖరీఫ్, రబీ రెండు పంటలకు నీరు అందించడానికి ప్రాజెక్టులు అవసరమయ్యాయి. స్వాతంత్ర్యానంతరం ఈ ప్రాజెక్టులే దేశ ఆహార స్వావలంబనకు దోహదం చేశాయి. అయితే తెలంగాణ లాంటి మెట్ట ప్రాంతాలు మాత్రం సాగునీటి పారుదల సౌకర్యానికి నోచుకోలేదు ఉమ్మడి రాష్ట్ర పాలకులు దశాబ్దాల పాటు కృష్ణా, గోదావరి నీటిని ఆంధ్ర ప్రాంతానికి తరలించారు. ఎత్తిపోతల సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత ఉమ్మడి రాష్ట్ర పాలకులకు తెలంగాణలో ఎత్తిపోతల పథకాలను రూపొందించే అగత్యం ఏర్పడింది. అట్లా వచ్చినదే తెలంగాణ విశ్రాంత ఇంజనీర్లు రూపొందించిన 'ప్రాణహిత – చేవెళ్ళ సుజల స్రవంతి' ప్రాజెక్టు, ఇతర ఎత్తిపోతల పథకాలు. ప్రాజెక్టుల రూపకల్పన అయితే జరిగింది కానీ వాటిని అనేక సమస్యల్లో ఇరుక్కునేలాగా చేసి పూర్తి చేయలేదు. వాటి పేరే పెండింగ్ ప్రాజెక్టులు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాతనే అవి రన్నింగ్ ప్రాజెక్టులుగా మారి రైతాంగానికి సేవలు అందిస్తున్నాయి. 'ప్రాణహిత– చేవెళ్ళ ప్రాజెక్టు' అనే ఒక పదేళ్ళ పెండింగ్ ప్రాజెక్టును రీ ఇంజనీరింగ్ ద్వారా నాలుగేళ్లలోనే రన్నింగ్ ప్రాజెక్టుగా మారిస్తే అదే ఇవాళ మన ముందు 'కాళేశ్వరం ప్రాజెక్టు'గా సాక్షాత్కారమయింది.

ముఖ్యమంత్రి స్థాయిలో ప్రాజెక్టులపై సమీక్షలు జరుపుతున్న క్రమంలో జలయజ్ఞంలో చేపట్టిన కొన్ని ప్రాజెక్టుల్లో సాంకేతిక అపసవ్యతలు, మరి కొన్ని డిజైన్ల లోపాలు, నీటి లభ్యత, అమలులో ఎదురవుతున్న సమస్యలు, అంతర్రాష్ట్ర సమస్యలు, వన్యప్రాణి కేంద్రాలు, బొగ్గు గనులు ప్రాజెక్టులకు అవరోధాలుగా మారనున్నాయని ప్రభుత్వం గ్రహించింది. వీటిని రీ ఇంజనీరింగ్ చేస్తే తప్ప ఈ ప్రాజెక్టుల ద్వారా నీటిని అందించలేమని ప్రభుత్వం నిర్ధారణకు వచ్చింది. గంటల తరబడి కొన్ని నెలల పాటు ఇంజనీరింగ్ నిపుణులతో, రిటైర్డ్ ఇంజనీర్లతో సమావేశమై సర్వే ఆఫ్ ఇండియా వారి మ్యాపులు, గూగుల్ ఎర్త్ సాఫ్ట్‌వేర్ సహాయంతో మథించిన అనంతరం ప్రాణహిత చేవెళ్ళ సుజల స్రవంతి, ఎస్ఆర్ఎస్‌పీ వరద కాలువ, దేవాదుల, కంతనపల్లి, ఖమ్మం జిల్లాలో చేపట్టిన రాజీవ్ దుమ్ముగూడెం, ఇందిరాసాగర్ ప్రాజెక్టులను రీ ఇంజనీరింగ్ చేసే కొత్త ప్రతిపాదనలని సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందులో ప్రధానంగా 'ప్రాణహిత – చేవెళ్ళ ప్రాజెక్టు'కు రీ ఇంజనీరింగ్ ఎందుకు అవసరమయిందో సంక్షిప్తంగా సమీక్షించుకుందాము.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణలో పండిన వరి ధాన్యం ఒక కోటి మెట్రిక్ టన్నులు. కాళేశ్వరం నిర్మాణం తర్వాత వరి ధాన్యం ఉత్పత్తి 3 కోట్ల మెట్రిక్ టన్నులకు పెరిగింది. ఇది కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం వల్లనే సాధ్యమయింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో హైదరాబాద్ నగరానికి 30 టిఎంసిలు, పారిశ్రామిక అవసరాలకు 16 టిఎంసిల నీటి కేటాయింపులు ఉన్నాయి. రాబోయే 100 సంవత్సరాల వరకు హైదరాబాద్ నగరానికి నీటి కొరత ఏర్పడే సమస్యే ఉత్పన్నం కాదు.



మూడు కారణాల వలన ప్రాణహిత – చేవెళ్ళ ప్రాజెక్టుకు రీ డిజైనింగ్‌ని చేపట్టవలసి వచ్చిందని ప్రభుత్వ పత్రాల ద్వారా తెలుస్తున్నది. 1) తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ళ ప్రాజెక్టు అవసరాలకు తగినన్ని నికర జలాలు లేవు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టు నిర్మాణంపై పునరాలోచన చేయాలని కేంద్ర జల సంఘం హైడ్రాలజీ విభాగం సూచించింది. 2) ప్రాజెక్టులో ప్రతిపాదించిన జలాశయాల సామర్థ్యం తగినంతగా లేదు కాబట్టి ప్రాజెక్టు అవసరాలకు తగినంతగా ఆన్‌లైన్ జలాశయాల సామర్థ్యాన్ని పెంచుకోవాలని, కొత్త జలాశయాలు నిర్మించుకోవాలని కేంద్ర జల సంఘం సూచించింది. 3) తమ భూభాగంలో ముంపుని అనుమతించే ప్రశ్నేలేదని, బ్యారేజి ఎత్తును 152 మీటర్ల నుంచి 148 మీటర్లకు తగ్గించుకోవాలని మహారాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఆనాటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డికి అక్టోబర్, 2013లో రాసిన లేఖ అందుకు సాక్ష్యంగా ఉంది.

తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత – చేవెళ్ళ ప్రాజెక్టు కింద ప్రతిపాదిత ఆయకట్టుకు, తాగునీటికి, పారిశ్రామిక అవసరాలకు సరిపడా 160 టిఎంసిల నికర జలాలు లభ్యం కావని, ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణ స్థలంపై పునరాలోచన చేయాలని కేంద్ర జల సంఘం సూచించిన కారణంగా ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలం కోసం అన్వేషణ చేసింది. దానికి తోడు ముంపుపై మహారాష్ట్ర తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ముంపు లేని ప్రత్యామ్నాయాన్ని ఆలోచించవలసి వచ్చింది. ఈ అన్వేషణలో ప్రాణహిత, గోదావరి నదుల సంగమానికి సుమారు 20 కిలోమీటర్ల దిగువన మేడిగడ్డ అనువైన స్థలమని కేంద్ర ప్రభుత్వ సంస్థ వాప్కోస్ నిర్ధారించింది. కేంద్ర జల సంఘం కూడా మేడిగడ్డ వద్ద 284 టిఎంసిల నికర జలాలు లభ్యమవుతాయని, ఇందులో నుంచి 240 టిఎంసిలను వినియోగించుకోవచ్చునని హైడ్రాలజీ అనుమతిలో పేర్కొన్నది. తమ భూభాగంలో ముంపు గణనీయంగా తగ్గిపోయిన కారణంగా మేడిగడ్డ వద్ద 100 మీటర్ల పూర్తి స్థాయి నీటి మట్టంతో (FRL) బ్యారేజి నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం కూడా అంగీకరించింది. కాబట్టి తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజి తక్కువ ఎత్తులో నిర్మించి ఆ నీటిని ఆదిలాబాద్ జిల్లాకు పరిమితం చేసి, మిగతా ప్రాజెక్టు అవసరాల కోసం మేడిగడ్డ వద్ద బ్యారేజీని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మొదట మేడిగడ్డ నుంచి నేరుగా మిడ్ మానేరు జలాశయానికి గోదావరి నీటిని ఎత్తిపోయాలని ప్రతిపాదించారు. ఈ మార్గం సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయడానికి ప్రభుత్వం రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటి కూలంకషంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి బ్యారేజి నిర్మాణానికి మేడిగడ్డ స్థలం అనువైనదని, మేడిగడ్డ నుంచి నేరుగా మిడ్ మానేరు జలాశయానికి నీటిని తరలించడం వీలుకాదని పేర్కొన్నారు. విశ్రాంత ఇంజనీర్ల సూచన మేరకు మేడిగడ్డ – మిడ్ మానేరు మార్గాన్ని త్యజించి మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి బ్యారేజీకి నీటిని గోదావరి నదీ మార్గం ద్వారానే తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు వీలుగా అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు, వాటి అనుబంధ పంప్ హౌజ్‌లను కూడా ప్రభుత్వం నిర్మించింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణలో పండిన వరి ధాన్యం ఒక కోటి మెట్రిక్ టన్నులు. కాళేశ్వరం నిర్మాణం తర్వాత వరి ధాన్యం ఉత్పత్తి 3 కోట్ల మెట్రిక్ టన్నులకు పెరిగింది. ఇది కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం వల్లనే సాధ్యం అయ్యింది. తెలంగాణ రాష్ట్రంలో మంచి నీటి చేపల ఉత్పత్తి అనూహ్యంగా పెరిగింది. మత్స్యశాఖ గణాంకాల ప్రకారం 2016–17లో 1,93,732 మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి జరిగింది. వాటి విలువ రూ. 1356.61 కోట్లు. అది 2020–21 నాటికి 3,49,000 మెట్రిక్ టన్నులకు పెరిగింది. వాటి విలువ రు.3141 కోట్లు. నాలుగేండ్లలోనే చేపల ఉత్పత్తి 1,55,268 టన్నులు పెరిగింది. పెరిగిన ఉత్పత్తి విలువ 1784.39 కోట్లు. కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్ద జలాశయాల నిర్మాణం జరిగినందున, చెరువులు, చెక్‌డ్యాంలు సంవత్సరం పొడుగునా నీటితో నిండి ఉండటం వల్లనే ఇది సాధ్యమయింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం తర్వాత భూగర్భ జలాల మట్టం ప్రాజెక్టు పరిధిలో సగటున 5.36 మీటర్లు పైకి లేచినట్టు భూగర్భ జల శాఖ నివేదికలు వెల్లడించాయి. దీనివల్ల బోరుబావుల కింద వ్యవసాయం అనూహ్యంగా పుంజుకున్నది.

కాళేశ్వరం ప్రాజెక్టులో హైదరాబాద్ నగరానికి 30 టిఎంసిలు, పారిశ్రామిక అవసరాలకు 16 టిఎంసిల నీటి కేటాయింపులు ఉన్నాయి. రాబోయే 100 సంవత్సరాల వరకు హైదరాబాద్ నగరానికి నీటి కొరత ఏర్పడే సమస్యే ఉత్పన్నం కాదు. ప్రాజెక్టు పరిధిలో పారిశ్రామికాభివృద్ధికి కాళేశ్వరం భరోసా ఇస్తున్నది. అందుకే ప్రపంచ దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయి. మొత్తంగా చూస్తే కాళేశ్వరం తెలంగాణ ప్రగతి రథంగా (Telangana Growth Engine) మారింది.

గడచిన యాసంగి అనుభవాలను దృష్టిలో పెట్టుకొని వచ్చే ఖరీఫ్ పంట కాలానికి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసే కార్యక్రమం మొదలు కావాలని మేము కోరుకుంటున్నాము. ఇందులో రాజకీయాలకు తావు లేదని మేము భావిస్తున్నాము. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం విశాల హృదయంతో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటుందని మేము ఆశిస్తున్నాము. కాళేశ్వరం ఎత్తిపోతలపై న్యాయ విచారణ జరుపుతున్న పిసి ఘోష్ విచారణ కమిషన్ తెలంగాణ ప్రజలకు అండగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాము. బహుళ ప్రయోజనకారిగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో పునరుద్ధరించడానికి కమిషన్ తగిన ఆదేశాలు ప్రభుత్వానికి జారీ చేయగలదని నమ్ముతున్నాము.

■ డాక్టర్ బి.ఎస్.రావ్
బి.ఎస్.రావ్ ఫౌండేషన్, కరీంనగర్



మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.7 కనిష్ఠం 24.5

కమనీయం.. ఎల్లమ్మ కల్యాణం

- బల్కంపేటలో కనులపండువగా వేడుక
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు
- జనసంద్రమైన ఆలయ పరిసరాలు

సుందరంగా తీర్చిదిద్దిన కల్యాణ వేదికపై, వేలాది మంది భక్తుల సమక్షంలో, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ బాజాభజంత్రీలతో బల్కంపేట రేణుకా ఎల్లమ్మ కల్యాణం కనులపండువగా మంగళవారం జరిగింది. ఉదయం 11.34 గంటలకు వివాహ ఘట్టాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.





పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్



తాళిబొట్టు చూపిస్తున్న పండితుడు



త్రిశూల జమదగ్ని, ఎల్లమ్మ మూర్తులు



భక్తులతో జనసంద్రంగా మారిన బల్కంపేట పురవీధులు



అమీర్‌పేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం అంగరంగ వైభవంగా సాగింది. ప్రభుత్వం తరఫున మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దంపతులు, సీఎస్ శాంతికుమారి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్, గణేష్, రాజ్యసభసభ్యుడు అనిల్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఈసారి మంత్రులు, వీఐపీలు ఎవరూ వేదికపైకి రాకుండా, నేలపైనే కూర్చుని కల్యాణాన్ని తిలకించారు. కల్యాణం అనంతరం క్యూలో నిలబడి వీఐపీలతో పాటు సాధారణ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టువస్త్రాలను సమర్పించిన మంత్రులను గర్భగుడిలోకి తీసుకువెళ్లి శేష వస్త్రాలను బహూకరించి సన్మానించారు.

బారులు తీరిన భక్తులు

అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు భారీఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో బల్కంపేట వీధులన్నీ జనసంద్రంగా మారాయి. దానికి తగ్గట్లు ఏర్పాట్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. బల్కంపేట

మిగతా 6వ పేజీలో..

ఏర్పాట్లలో నిర్లక్ష్యం



- అధికారుల్లో కొరవడిన సమన్వయం
- ప్రజాప్రతినిధులకు చేదు అనుభవం
- సదుపాయాలు లేక భక్తుల్లో గందరగోళం

బంజారాహిల్స్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఎల్లమ్మ కల్యాణం ఏర్పాట్లలో పోలీసు, దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. ఎన్నో ఏళ్ల నుంచి జరుగుతున్న ఈ వేడుకలో ఎన్నడూలేని విధంగా చేదు అనుభవాలు ఎదురయ్యాయి. అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి

మిగతా 6వ పేజీలో..

చెరువుల పునరుద్ధరణకు అడుగులు

- ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, జూలై9 (ఆంధ్రజ్యోతి): నగరంలో అన్యాక్రాంతమైన చెరువుల పునరుద్ధరణకు అడుగులు వేద్దామని ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్ అన్నారు. మంగళవారం బుద్ధభవన్‌లో ట్రై సిటీ పరిధిలోని రెవెన్యూ, జీఐఎస్ హబ్ టీమ్స్, ఇరిగేషన్ విభాగాలకు చెందిన అధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. నగరంలో గతంలో ఎన్ని చెరువులు ఉన్నాయి, ప్రస్తుతం ఎన్ని ఉన్నాయి, ఎన్ని అన్యాక్రాంతమయ్యాయి అనేది పరిశీలించాలన్నారు. అనంతరం సిటీ ప్లానింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. బహుళ అంతస్తులు, గృహ నిర్మాణాలను అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించాలని, చెరువులను ఆక్రమించి కడుతుంటే అడ్డుకోవాలని, అన్నీ సక్రమంగా ఉంటేనే అనుమతులు మంజూరు చేయాలని సూచించారు.



ఉల్లం'ఘనులు'..
18.15 లక్షలు

- 5 నెలల్లో ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోని నగరవాసుల సంఖ్య ఇది
- గతేడాదితో పోల్చితే 3.87 లక్షలు అదనం
- కేసులు నమోదు కానివి ఇంకెన్నో..

కేవలం 150 రోజుల్లో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన నగరవాసుల సంఖ్య అక్షరాలా 18.15 లక్షలు. అధికారికంగా గుర్తించిన లెక్క ఇది. సీసీ కెమెరాలకు, పోలీసులకు చిక్కనివారు అంతకుమించే ఉంటారని అంచనా. సిగ్నల్ జంపింగ్స్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, రోడ్లపై వాహనాలను అడ్డదిడ్డంగా నడపడం వంటి చర్యలతో అనేక మంది ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్నారు. పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా, స్పెషల్‌డ్రైవ్‌లు నిర్వహించి చర్యలు తీసుకుంటున్నా కొందరు వాహనదారుల్లో మార్పు రావడం లేదు.

హైదరాబాద్ సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): నగరవాసుల్లో కొందరు యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతూ ట్రాఫిక్ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు ఐదు నెలల్లోనే 18,15,721 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదయ్యాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గతేడాది ఐదు నెలల సమయంతో పోల్చితే ఈ కేసుల సంఖ్య 3,87,788 పెరిగింది. అంటే 27.16 శాతం అధికం. ఈ లెక్కన ఏడాది ముగిసే సరికి గతేడాది కంటే రెట్టింపు సంఖ్యలో కేసులు నమోదయ్యే అవకాశం ఉంది. ఇంత జరుగుతున్నా, వాహనదారుల్లో మార్పు రావడం లేదని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హెల్మెట్ లేకుండా..



చాలా మంది వాహనదారులు చలానాలను తప్పించుకోవడానికే అన్నట్లుగా హెల్మెట్ ధరిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎంతోమంది ద్విచక్ర వాహనదారులు తలకు తీవ్ర గాయాలై ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా కొందరు హెల్మెట్ ధరించడానికి నామోషీగా ఫీలవుతున్నారు. బైక్ రైడర్‌తో పాటు.. వెనకాల కూర్చున్న వ్యక్తికూడా హెల్మెట్ ధరించాలని పోలీసులు చెబుతుంటే, కనీసం వాహనం నడుపుతున్న వ్యక్తి కూడా ధరించడం లేదు. ప్రమాదాలు జరిగినప్పుడు బైక్ నడిపే వ్యక్తి కన్నా వెనకాల కూర్చున్న వారే ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఇది ఎన్నో రోడ్డు ప్రమాదాల్లో నిర్ధారణ అయింది. అయినా వెనుక కూర్చున్నవారు అస్సలు హెల్మెట్ ధరించడం లేదు.

5 నెలల్లో కేసులు	
2024	11,46,698
2023	9,40,670

సెల్ మాట్లాడుతూ..

పది మంది వాహనదారుల్లో కనీసం ముగ్గురు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారని పోలీసులు అంటున్నారు. ఒక చేతిలో సెల్‌ఫోన్, మరొకచేతిలో స్టీరింగ్ పట్టుకొని కార్లు నడుపుతున్న దృశ్యాలు నగరంలో కోకొల్లలు. ద్విచక్ర వాహనదారులైతే చెవిలో ఇయర్ ఫోన్ పెట్టుకొని, లేదా హెల్మెట్ చాటున సెల్‌ఫోన్ పెట్టుకొని మాటలు, పాటలతో ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్నారు. వెనకాల వచ్చే వాహనదారులు హారన్ కొట్టినా వినిపించుకోవడం లేదు.

5 నెలల్లో కేసులు	
2024	31,711
2023	27,392



సిగ్నల్ జంపింగ్..

రోడ్లపై రయ్‌మంటూ సిగ్నల్స్‌ను జంప్‌చేసి మరీ దూసుకెళ్తున్నారు. పోలీసులు పోకిరీల దూకుడుకు కళ్లెం వేయలేకపోతున్నారు.

5 నెలల్లో కేసులు	
2024	34,181
2023	31,133

ఓవర్ స్పీడ్/డేంజరస్ డ్రైవింగ్

అడుగడుగునా ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతూ.. నగరంలో ఇష్టానుసారంగా వాహనాలపై దూసుకెళ్తున్న పోకిరీల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. ఓవర్ స్పీడ్, డేంజరస్ డ్రైవింగ్‌తో, వింత విపరీత శబ్దాలతో ఇతర వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

5 నెలల్లో కేసులు	
2024	35,954
2023	34,547

2024 జనవరి నుంచి మే నెలల్లో నమోదైన 18.15 లక్షల ట్రాఫిక్ ఉల్లంఘన కేసుల్లో టాప్5 కేసుల లెక్క

హెల్మెట్ లేకుండా డ్రైవింగ్	11,14,698
పార్కింగ్ ఆన్ సర్వీస్ రోడ్స్	1,16,815
రోడ్డు మార్గంలో పార్కింగ్	1,05,504
నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్	37,655
రాంగ్ పార్కింగ్	76,008



మొహర్రం ఊరేగింపునకు బందోబస్తు

- అన్నిశాఖలూ సమన్వయంతో పనిచేయాలి
- నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా బీబీకా ఆలం ఊరేగింపులకు పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో సాలార్‌జంగ్ మ్యూజియంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఈనెల 17న మొహర్రం ఊరేగింపులో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యాలు లేకుండా చూడాలని, ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, ఎంఎల్‌సీ మీర్జా రియాజ్ ఉల్ హసన్, అడిషనల్ సీపీలు విక్రమ్‌సింగ్ మాన్, విశ్వప్రసాద్, సౌత్‌జోన్ డీసీపీ స్నేహ మెహ్రాతో పాటు.. జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్, విద్యుత్తు, వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక శాఖ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆమ్రపాలి

పబ్లిక్ టాయిలెట్లను వినియోగంలోకి తీసుకురావాలి

- పారిశుధ్య నిర్వహణ మెరుగవ్వాలి : ఆమ్రపాలి

హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, మహానగరంలోని పబ్లిక్ టాయిలెట్లన్నింటినీ వినియోగంలోకి తీసుకురావాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. మంగళవారం బుద్ధభవన్‌లో రెవెన్యూ, పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, ఆర్థిక విభాగాల అదనపు కమిషనర్లు, ఇతర అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగరంలోని అన్ని భవనాలు, ఖాళీ స్థలాలను ఆస్తిపన్ను పరిధిలోకి తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన జీఐఎస్ సర్వేను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలన్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు పెరుగుతున్న దృష్ట్యా.. పట్టణ ప్రణాళికా విభాగం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేసేలా చూడాలని సూచించారు. రోడ్ల పక్కన చెత్త కుప్పలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, నాలాల్లో వరద నీరు నిలవకుండా ఫ్లోటింగ్ మెటీరియల్ ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలని, ఇందుకోసం స్వచ్ఛ ట్రాలీ కార్మికులకు సూచనలు చేయాలన్నారు.

పనిచేయని లగేజీ స్కానర్

- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో భద్రత డొల్ల



లగేజీ స్కానింగ్ మెషీన్

అడ్డగుట్ట, జూలై 9(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో అతిపెద్ద నాలుగో రైల్వేస్టేషన్‌గా గుర్తింపు పొందిన సికింద్రాబాద్ స్టేషన్‌లో భద్రత డొల్లగా ఉంది. రైల్వేస్టేషన్ మార్గం ముందు ప్రయాణికుల లగేజీని స్కానింగ్ చేయడానికి మెషీన్ ఏర్పాటు చేశారు. ప్రతినెలా దాదాపు 20 రోజుల పాటు ఈ యంత్రం మొరాయిస్తోంది. ప్రయాణికుల లగేజీని తనిఖీ చేసేందుకు కానిస్టేబుళ్లు కూడా కనిపించడం లేదు. గతంలో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ప్రయాణికుల లగేజీలను కంప్యూటర్‌లో పరిశీలించేవారు. దాదాపు 15 రోజులుగా ఇప్పుడు ఆ యంత్రం పనిచేయడం లేదు.

నీటి బిల్లు.. గుండె గుభిల్లు

- కమర్షియల్ కనెక్షన్లకు ఇష్టానుసారంగా బిల్లులు
- మీటర్ పని చేయకపోతే డకెట్ ఆధారంగా నిర్ణయం
- ఆ ఏరియాలో వచ్చే అత్యధిక బిల్లే ప్రామాణికం




హైదరాబాద్ సిటీ, జూలై9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరంలో నీటి బిల్లుల జారీలో వాటర్‌బోర్డు ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. గృహ కనెక్షన్లలో దాదాపు 50 శాతం వరకు జీరో నీటిబిల్లులు జారీ చేస్తుండగా, ఇతర కనెక్షన్లకు జారీ చేస్తున్న నీటి బిల్లులు హడలెత్తిస్తున్నాయి. వాటర్‌బోర్డుకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న కమర్షియల్ కనెక్షన్లకు మీటర్ పని చేయకపోతే వచ్చే బిల్లును చూస్తే గుండెలు అదురుతున్నాయి. ఆ ఏరియాలో నీటి కనెక్షన్ సైజ్ ఆధారం చేసుకొని అందులో ఏ కనెక్షన్‌కు ఎక్కువ నీటి బిల్లు వస్తుందో.. అదే బిల్లును పని చేయని మీటర్ కనెక్షన్‌కు కూడా వేస్తున్నారు. సాధారణంగా వచ్చే బిల్లుకంటే రెండింతలకు పైగా ఉండడంతో వినియోగదారులు హడలిపోతున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఔటర్ పరిధిలోని ప్రాంతాల్లో వాటర్‌బోర్డు నీటి సరఫరా చేయడంతో పాటు నీటి బిల్లులు వసూలు చేస్తోంది. అయితే జీహెచ్‌ఎంసీ పరిధిలోని గృహ కనెక్షన్లకు నెలకు 20వేల లీటర్ల వరకు తాగునీటిని ఉచితం అందిస్తుండగా, అంతకు మించి నీటిని వినియోగిస్తే నీటి బిల్లులు వసూలు చేస్తున్నారు. ఇందుకోసం నీటి మీటర్లే ప్రామాణికంగా మారాయి. మెకానికల్ నీటిమీటర్‌తో సమస్యలు వస్తున్నాయని, వాటి స్థానంలో ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ (ఏఎంఆర్) మీటర్లను తీసుకొచ్చారు. ఈ మీటర్లలో వచ్చే రీడింగ్‌ను గతంలో మీటర్ రీడర్లు ఇంటింటికి తిరిగి తమ వద్ద ఉన్న ఈ-పాస్ మిషన్లలో నమోదు చేసి వెంటనే నీటిబిల్లు ఇచ్చేవారు. అయితే మీటర్ రీడర్లు తక్కువ రీడింగ్ నమోదు చేసి అవకతవకలు పాల్పడుతున్నారని, ఆ స్థానంలో కొత్తగా ప్రత్యేకంగా ఓ మొబైల్ యాప్ తీసుకొచ్చారు. మీటర్ రీడర్

మిగతా 6వ పేజీలో..

మీరాలం చెరువుకు పర్యాటక సొబగులు

- 2.65 కిలోమీటర్ల మేర ఆరు లైన్ల ఐకానిక్ బ్రిడ్జి

8





సెయిలింగ్ వారోత్సవాల ముగింపు వేడుకల్లో విజేతలతో లెఫ్టినెంట్ జనరల్ నీరజ్‌వర్షనే

ముగిసిన జాతీయ 38వ సెయిలింగ్ పోటీలు

అల్వాల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్, లేజర్‌క్లాస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్‌తో కలిసి హుస్సేన్‌సాగర్‌లో నిర్వహించిన జాతీయ 38వ సెయిలింగ్ పోటీలు మంగళవారం ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంసీఈఎంఈ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ నీరజ్‌వర్షనే బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ క్లబ్ ప్రెసిడెంట్ గౌతమ్‌భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక నిర్మాణాల పరిరక్షణ పనులు పూర్తిచేయాలి

హైదరాబాద్,జులై 9(ఆంధ్రజ్యోతి):- అర్ధంతరంగా నిలిచిపోయిన పురాతన ప్రాశస్త్యం పొందిన చారిత్రాత్మక కట్టడాల పరిరక్షణ కోసం చేపట్టిన మరమ్మతు పనులనుపూర్తి చేసేందుకు చర్యలుతీసుకోవాలని పర్యాటక,హెరిటేజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హెరిటేట్ శాఖ డైరెక్టర్ భారతి హోళీ కేరీ తో కలిసి పురావస్తు శాఖ కార్యకలాపాలను సమీక్షించారు. పరిరక్షణ కోసం పనులు చేపట్టిన పలు చారిత్రాత్మక నిర్మాణాల ప్రస్తుత పరిస్థితిని ఆమె అధికారుల ద్వారాతెలుసుకున్నారు. గన్‌ఫౌండ్రీలోనిమ్యూజియంనుపరిశీలించారు.



శెభాష్.. శ్రాద్ధాంజలి

మౌంట్ కాంగ్ యాట్స్-2 అధిరోహణ
ప్రతికూల పరిస్థితుల్లో 20,505 అడుగుల ఎత్తును చేరిన సాహూ

అల్వాల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నేషనల్ కెడెట్స్ కార్ప్స్(ఎన్‌సీసీ) హైదరాబాద్ గ్రూప్‌నకు చెందిన జూనియర్ అండర్ ఆఫీసర్(జేయూవో) శ్రాద్ధాంజలి సాహూ(20) మౌంట్ కాంగ్ యాట్స్-2ని అధిరోహించారు. ప్రతికూల పరిస్థితుల్లో సైతం ఏమాత్రం వెనకాకుండా 20,505 అడుగు ఎత్తుగల పర్వతాన్ని అధిరోహించారు. దీంతో ఎన్‌సీసీ హైదరాబాద్ యూనిట్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో గ్రూప్ కమాండర్, కల్నల్ అనిల్ ఆమెకు నగదు బహుమతితో పాటు పురస్కారాన్ని అందించి అభినందించారు. 2024, మే 28న న్యూఢిల్లీలో ప్రారంభమైన పర్వతారోహణ యాత్రలో 5మంది ఎన్‌సీసీ డైరెక్టరేట్ అధికారులు, 17 మంది ఇన్‌స్ట్రక్టర్లతో పాటు 24 మంది కెడెట్స్‌లో 12 మంది బాలికలు, 12 మంది బాలురు ఉన్నారు. కాగా వారిలో ఎన్‌సీసీ గ్రూప్ హైదరాబాద్ 7వ తెలంగాణ బెటాలియన్‌కు చెందిన జూనియర్ అండర్ ఆఫీసర్ శ్రాద్ధాంజలి సాహూ అసాధారణమైన పర్వతారోహణను విజయవంతంగా పూర్తి చేసి మౌంట్ కాంగ్ యాట్స్-2ను చేరుకున్నారు. 24మందిలో కేవలం 10మంది ఎన్‌సీసీ కెడెట్‌లు మాత్రమే కాంగ్ యాట్స్-2 పర్వతంపైకి చేరుకున్నారని గ్రూప్ కమాండర్, కల్నల్ అనిల్ తెలిపారు. శ్రాద్ధాంజలి సాహూ ప్రస్తుతం హైదరాబాద్ కొంపల్లిలోని సెయింట్ మార్టీన్ ఇంజినీరింగ్ కళాశాలలో బీ-టెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు.




శ్రాద్ధాంజలి సాహూను అభినందిస్తున్న గ్రూప్ కమాండర్, కల్నల్ అనిల్, మౌంట్ కాంగ్ యాట్స్-2పై జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న దృశ్యం

19, 20 తేదీల్లో అంతర్ విశ్వవిద్యాలయ పోటీలు

హైదరాబాద్ సిటీ, జూలై9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల పరిధిలోని ఎం.కామ్ విద్యార్థులు వివిధ అంశాల్లో తమ ప్రతిభను, నైపుణ్యాన్ని చాటుకునేందుకు వీలుగా ఉస్మానియా వర్సిటీలోని కామర్స్ డిపార్ట్‌మెంట్ 'వాణిజ్య 2024' పేరుతో తెలంగాణ కామర్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ మీట్ నిర్వహించేందుకు సిద్ధమైంది. అంతర్ విశ్వవిద్యాలయ స్థాయిలో ఈ నెల 19, 20 తేదీల్లో ఈ పోటీలు జరగనున్నాయి. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లక్ష్మీనారాయణ మంగళవారం ఆవిష్కరించారు. వివరాల కోసం విద్యార్థులు dcouvanijya2024@gmail.com కు మెయిల్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

ఓయూలో జియో మాగ్నెటిక్ సర్వే

ఓయూలోని జియో ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో డ్రోన్ మాగ్నెటిక్ సర్వే విజయవంతంగా ముగిసింది. జియో ఫిజిక్స్ రంగంలో అత్యాధునిక పరికరాలు, సమర్థత కలిగిన స్టైగర్ జియోసైన్స్ అండ్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో సర్వే చేశారు.

దేశవ్యాప్తంగా పెండింగ్‌లో మూడున్నర కోట్ల కేసులు

బర్కత్‌పుర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో మూడున్నర కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగేష్ భీమపాక తెలిపారు. రోజుకు వంద కేసులు పరిష్కరించుకున్నా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి 34 ఏళ్ల సమయం పడుతుందని, అందువల్ల మధ్యవర్తిత్వం ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలని సూచించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారంరాత్రి సీపీడీఆర్‌టీ ఆధ్వర్యంలో 'మధ్యవర్తిత్వం - ప్రత్యామ్నాయ చట్టాలు - బార్‌కౌన్సిల్ బెంచ్ లేదా న్యాయవాదులు' అంశంపై ఒకరోజు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో హైకోర్టు అడిషనల్ సొలిసిటార్ జనరల్ బి.నర్సింహ్మశర్మ, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, సీనియర్ అడ్వకేట్లు పాల్గొన్నారు.

సీఐ జితేందర్‌రెడ్డిని అరెస్ట్ చేయాలి

● దళిత, ప్రజా సంఘాల డిమాండ్

రాంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దళిత ఎస్ఐ శ్రీరాములు శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకుడైన అశ్వారావుపేట పీఎస్ సీఐ జితేంతర్‌రెడ్డితో పాటు నలుగురు కానిస్టేబుళ్లపై హత్యానేరం కేసు నమోదు చేయాలని దళిత, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో డీబీఎఫ్, కేవీపీ, ఎస్ఎన్‌ఏపీఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో నేషనల్ అట్రాసిటీ ప్రివెన్షన్ ఫోర్స్ (ఎన్ఏపీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలకర శ్రీనివాస్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు తదితరులు మాట్లాడారు. ఎస్ఐ ఆత్మహత్య సంఘటనపై న్యాయ విచారణ జరిపి సీఐని సస్పెండ్ చేసి హత్యానేరం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐది ఆత్మహత్య కాదని ప్రభుత్వ హత్య అని వారు ఆరోపించారు. ఎస్ఐ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మాల మహానాడు, ఓయూ అంబేడ్కర్ విద్యార్థి సంఘం తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.





అరబ్ దేశాల్లో ఉద్యోగాలంటూ గాలం

● లక్షలు దోచేస్తున్న సైబర్ దొంగ అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): అరబ్ దేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మబలికి నిరుద్యోగులను బురిడీ కొట్టించి రూ.లక్షల్లో కొల్లగొడుతున్న ఢిల్లీకి చెందిన సైబర్ క్రిమినల్‌ను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి 6 ల్యాప్‌టాప్‌లు, 6 మొబైల్స్, 5 బీటెల్ వైర్‌లెస్ ఫోన్లు, 5 డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. సైబర్ క్రైమ్ డీసీపీ కవిత తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన యువకునికి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి సౌదీ అరేబియాలోని జెనాన్ యూనివర్సిటీలో మీరు ఉద్యోగానికి ఎంపికయ్యారని చెప్పారు. వెళ్లడానికి ఇంట్రెస్టు ఉన్నట్లయితే వెంటనే రిజిస్ట్రేషన్ ఫీజు, ప్రాసెసింగ్ ఫీజు, వీసా ఫీజు, జీఎస్టీ చెల్లించాలంటూ విడతల వారీగా రూ.4.71లక్షలు దోచేశారు. ఎంతకీ ఉద్యోగానికి సంబంధించి వివరాలు పంపకపోవడంతో బాధితుడు వారిని నిలదీశాడు. దీంతో అవతలివైపు వ్యక్తులు స్పందించడం మానేశారు. మోసపోయానని భావించిన బాధితుడు సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ తన బృందంతో టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించి ఢిల్లీకి చెందిన నిషాంత్ కుమార్‌రాయ్‌ని నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడు ఒక కాల్‌సెంటర్ ఏర్పాటు చేసి నలుగురు టెలీకాలర్స్‌తో నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని సైబర్‌క్రైమ్‌లకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

కమనీయం.. ఎల్లమ్మ కల్యాణం

(5వ పేజీ తరువాయి)

పరిసరాల్లో 100కు పైగా అన్నప్రసాద వితరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానికులు పులిహోర, మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్, అడిషనల్ కమిషనర్ జ్యోతి, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ క్రిష్ణవేణి, ఆర్‌జేసీ రామకృష్ణ, సికింద్రాబాద్, హైదరాబాద్ ఏసీలు బాలాజీ, సంధ్యారాణి, స్థానిక కార్పొరేటర్ సరళ, ఈవో అంజనీదేవి, చైర్మన్ సాయిబాబా గౌడ్ తదితరులు ఉన్నారు.

వరుడిగా త్రిశూలం

సీతారాములు, పార్వతీపరమేశ్వరులు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి.. ఇలా దేవతల కల్యాణాలకు వధూవరులుంటారు. బల్కంపేట ఎల్లమ్మకు మాత్రం వరుడు త్రిశూలమే. ఆలయ అర్చకులు తెలిపిన వివరాల ప్రకారం.. పరశురాముని తల్లి, జమదగ్ని భార్యే రేణుకా ఎల్లమ్మ. జమదగ్ని పరమశివుని భక్తుడు. త్రిశూలంగా మారి శివుడితోనే ఉంటాడు. అందుకే అమ్మవారి కల్యాణం రోజున జమదగ్ని రూపమైన త్రిశూలాన్ని వరుడిగా పీటలపై నిలబెడతారు. ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారితో పాటు త్రిశూలానికి కూడా పూజలు చేస్తారు.

ఏర్పాట్లలో నిర్లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు మేయర్ విజయలక్ష్మికీ ఇబ్బందులు తప్పలేదు. వారు కూడా భక్తులతో క్యూలో నలిగిపోయారు. పోలీసులు కనీసం ప్రోటోకాల్ పాటించలేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

సెలవులో ఈవో

ఎల్లమ్మ తల్లి కల్యాణానికి నెల రోజుల ముందు నుంచే ఏర్పాట్లు, సమీక్షలు జరుగుతుంటాయి. పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించిన సందర్భాలూ ఉన్నాయి. ఈసారి అలాంటివేమీ జరగలేదు. ఆలయ ఈవో నాగరాజు అనారోగ్యం కారణంగా సెలవులో ఉన్నారు. ఈవో లేకపోవడంతో ముందుగా పనులు మొదలు కాలేదు. మంత్రులు పొన్నం, కొండా సురేఖ ప్రభుత్వ శాఖల అధికారులను సమన్వయపరుస్తూ సమీక్షా సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకున్నారు. ఈవో లేకపోవడంతో దేవాదాయశాఖలో జువెలరీ వెరిఫికేషన్ అధికారిగా ఉన్న అంజనీదేవికి ఇరవై రోజుల క్రితం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సూపరింటెండెంట్‌తో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. సూపరింటెండెంట్ స్థాయి అధికారి కూడా పనుల నిర్వహణలో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారం రోజుల క్రితం నుంచే హడావుడి మొదలైంది. ఆలయానికి పూర్తిగా రంగులు కూడా వేయలేదు. కల్యాణం ముందురోజు వరకు కూడా క్యూల విషయంతో పాటు ఇతర సదుపాయాల కల్పన పూర్తిగా కాలేదు.

లైన్‌లు లేక..

భక్తులు అమ్మవారి కల్యాణాన్ని వీక్షించేందుకు ఏటా రెండు మూడు లైన్‌లు ఏర్పాటు చేసేవారు. వీఐపీ, ప్రొటోకాల్ భక్తుల కోసం ప్రధానద్వారాన్ని ఉపయోగించేవారు. ఈ ఏర్పాట్లు పోలీసులు, ఆలయ నిర్వాహకులు సమన్వయంతో చేసేవారు. ఈసారి సమన్వయం లోపించింది. భక్తుల కోసం ఒకే లైన్ ఏర్పాటు చేశారు. అదే ఉదయం నుంచీ రద్దీగా ఉంది. దీంతో అనేక మంది భక్తులు ప్రధానద్వారం నుంచి లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఇక్కడ భక్తులను నిలువరించేందుకు పోలీసులు సరైన భద్రతా ఏర్పాటు చేయలేదన్న విమర్శలు ఉన్నాయి. చిన్నచిన్న విషయాలకే అధికంగా స్పందించే ఉన్నతాధికారులు అమ్మవారి కల్యాణం విషయంలో ఎందుకింత పట్టనట్టు ఉన్నారని సోషల్‌మీడియాలో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

నీటి బిల్లు.. గుండె గుభిల్లు!

(5వ పేజీ తరువాయి) ఇంటింటికి తిరిగే సందర్భంలో అక్కడ ఏఎంఆర్ మీటర్ రీడింగ్‌ను ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దాన్ని చూసి వివిధ డివిజన్ల వారీగా డీజీఎం స్థాయి అధికారులు మీటర్ రీడింగ్‌ను పరిశీలించి నీటి బిల్లు వేస్తారు. ఆ బిల్లును ఆన్‌లైన్‌లోనే పొందాల్సి ఉంటుంది. లేకుంటే రీడర్ మరోసారి ఇంటికి వచ్చిన సందర్భంలో ఇస్తారు.

కమర్షియల్ కనెక్షన్లకు ఇష్టానుసారం

కమర్షియల్ కనెక్షన్లకు నీటి బిల్లుల జారీ క్రమంలో వాటర్‌బోర్డు రెవెన్యూ విభాగం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. ప్రత్యేక మొబైల్ యాప్‌లో మీటర్ రీడింగ్ ఫొటో తీసి పంపిన తర్వాత రెండు, మూడు రోజుల వ్యవధిలోనే బిల్లును జారీ చేయాలి. కానీ సకాలంలో జారీ కావడం లేదు. ఇక కమర్షియల్ కనెక్షన్లకు మీటర్ పని చేయకపోతే చాలు.. అడ్డగోలుగా బిల్లు వేస్తున్నారు. వాటర్‌బోర్డు వివరాల ప్రకారం.. 25 ఎంఎం సైజు గల కనెక్షన్‌కు మీటర్ పని చేయకపోతే నెల రోజులకు 54 కిలో లీటర్లను వినియోగించినట్లుగా గుర్తించాలి. ఇక 50సైజుకు అయితే 106కిలో లీటర్ల వరకు.. ఇలా ఒక్కో సైజుకు ఒక్కో విధానాన్ని రూపకల్పన చేశారు. ఆ ప్రకారంగా నీటి బిల్లులు వేయాల్సి ఉండగా మీటర్ పనిచేయకపోతే అందుకు భిన్నంగా విధిస్తున్నారు.

ఆ ఏరియాలో ఎక్కువగా వచ్చే బిల్లే ప్రామాణికం

వెయ్యి నల్లా కనెక్షన్లను ఓ డకెట్‌గా నిర్ణయిస్తున్నారు. ఆ డకెట్‌లో ఏ కనెక్షన్‌కు బిల్లు ఎక్కువగా వస్తుందో, అంతే మొత్తంబిల్లును మీటర్ పనిచేయని కనెక్షన్‌కు కూడా వేస్తున్నారు. కొండాపూర్ ఏరియాలో ఓ కమర్షియల్ నీటి కనెక్షన్‌కు మీటర్ పని చేసే సందర్భంలో సాధారణంగా నెలకు రూ.4వేలు నీటి బిల్లు వచ్చేది. ఆ కనెక్షన్ పైపు సైజ్ 25 కావడంతో ఏకాలంలోనైనా రూ.5వేలకు మించి నీటి బిల్లు రాదు. అయితే గత ఫిబ్రవరి నెలలో మీటర్ పాడవ్వడంతో రెండునెలల పాటు సాధారణంగానే నీటి బిల్లు వేశారు. కానీ మే నెలకు వచ్చేసరికి ఒక్కసారిగా రూ.9వేలు నీటి బిల్లు విధించారు. ఈ స్థాయిలో బిల్లు రావడంపై అధికారులను ఆరా తీస్తే.. ఆ ఏరియాలో నీటి కనెక్షన్ 25సైజు ఉండే వెయ్యి కనెక్షన్లలో దేనికి ఎక్కువ బిల్లు వస్తుందో అదే విధించామని చెప్పడం గమనార్హం.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాదరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు

మహంకాళి ఆలయ బోనాల బ్రోచర్ ఆవిష్కరణ

చాంద్రాయణగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం 76వ వార్షిక బోనాల ఉత్సవాల బ్రోచర్‌ను మంగళవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాదరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ జూలై 19 నుంచి 29 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 19న కలశస్థాపన, 21న ఘట స్థాపన, 28న మహిళల బోనాల సమర్పణ, 29న రంగం భవిష్యవాణి, అంబారిపై అమ్మవారి ఘటం ఊరేగింపు ఉంటాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఆలయ స్థలంలో బారికేడ్లను తొలగించాలి

చాంద్రాయణగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ సమీపంలోని కట్టమైసమ్మ మహంకాళి మాత ఎల్లమ్మ దేవాలయానికి ఆనుకొని ఉన్న స్థలంలో రైల్వే శాఖ తమ ఆధీనంలోకి తీసుకోవడంతో భక్తులకు అసౌకర్యంగా మారిందని ఆలయ కమిటీ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసినవారిలో ఆలయ అర్చకులు బొల్లు పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్‌బేగ్

రాజేంద్రనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్‌బేగ్ అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ ఎంఎం పహాడీలోని మీరాలం పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులకు కారణం పర్యావరణం దెబ్బతినడమే అన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలన్నారు. కాలనీలు, పార్కులు, పాఠశాలల్లో మొక్కలు నాటుతున్నామని గుర్తుచేశారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు నవాజుద్దీన్, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్, తదితరులు



జగదీశ్వర్, డాక్టర్ ఎస్.ఎం.హుస్సేన్‌ను సన్మానిస్తున్న కోదండరామ్

తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర కీలకం

● ప్రొఫెసర్ కోదండరామ్

రవీంద్రభారతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర కీలకమైనదని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. మంగళవారం లలితకళాతోరణంలో టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో యూనియన్, కేంద్ర సంఘం నూతన అధ్యక్షుడు మారం జగదీశ్వర్, నూతన ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్)లకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కోదండరామ్ సత్కారగ్రహీతల్ని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మలిదశ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదన్నారు. సకలజనుల సమ్మె ఉద్యమానికి ఊపునిచ్చిందని అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులను విస్మరించిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షుడు ఏల్లారి శ్రీనివాసరావు, వివిధ జిల్లాల అధ్యక్షులు, జిల్లా కార్యదర్శి ఎస్.విక్రమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

అఫ్జల్‌గంజ్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా ఓ వ్యక్తి బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టగా న్యాయస్థానం ఆదేశాల మేరకు మంగళవారం బేగంబజార్ పోలీసుల భారీ బందోబస్తు మధ్య అక్రమ కట్టడాలను టౌన్ ప్లానింగ్ ఏసీపీ సైఫుద్దీన్, సెక్షన్ అధికారి ముఖేశ్, సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్‌బాగ్‌కు చెందిన జశ్‌రాజ్ జైన్ తన 42 గజాల ఇంటి స్థలానికి జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం జీ ప్లస్-2 అనుమతి తీసుకున్నాడు. జశ్‌రాజ్ జైన్ జీహెచ్ఎంసీ నిబంధనలను తుంగలో తొక్కి జీ ప్లస్-5తో పాటు పెంటౌజ్‌ను అక్రమంగా నిర్మాణం చేపట్టారు. దీనిపై గతేడాది సెప్టెంబర్ 14వ తేదీన జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై 26-6-24న అక్రమ కట్టడాలను కూల్చివేయాలని కోర్టు ఆదేశించడంతో మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య సుమారు 8 గంటల పాటు అక్రమ కట్టడాలను కూల్చివేశారు.



భవనాన్ని కూల్చివేయిస్తున్న టౌన్ ప్లానింగ్ ఏసీపీ సైఫుద్దీన్, సెక్షన్ అధికారి ముఖేశ్, సిబ్బంది

రాజేంద్రనగర్ సర్కిల్‌లో..

రాజేంద్రనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు ఉక్కు పాదం మోపుతున్నారు. వారం రోజుల క్రితం గోల్డెన్ హైట్స్ కాలనీలో గతంలో సెప్టిక్ ట్యాంక్ కోసం వదిలిన 200 గజాల స్థలాన్ని కొందరు ప్రైవేటు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేయాలని ప్రయత్నించగా టౌన్‌ప్లానింగ్ అధికారులు అడ్డుకున్నారు.



అత్తాపూర్ హైదర్‌గూడ అంబియెన్స్ ఫోర్ట్ కాలనీ గేటు సమీపంలో వేసిన షెడ్డును తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

అత్తాపూర్ అంబియెన్స్ ఫోర్ట్ కాలనీ సమీపంలో నివాస సముదాయంలో కమర్షియల్‌గా హరి హోమ్ నైప్స్ గోదాం ఏర్పాటు చేయడమే కాకుండ రోడ్డుపై షెడ్డు వేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం రాజేంద్రనగర్ టౌన్‌ప్లానింగ్ అధికారులు షెడ్డును కూల్చడానికి వెళ్లగా దుకాణదారులు అడ్డుకున్నారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ అబ్దుల్ ఖాదర్ సంఘటనా స్థలానికి చేరుకుని షెడ్డును కూల్చివేయించారు.

శివరాంపల్లిలోని శ్రీదేవీ హౌసింగ్ సొసైటీలో రెండు అంతస్థుల భవనానికి అనుమతులు తీసుకున్న వ్యక్తి నాలుగు అంతస్థుల భవనం నిర్మించారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు అందగా సోమవారం సాయంత్రం అధికారులు ఆ భవనాన్ని సీజ్ చేశారు.



సాహితీవేత్తలను సత్కరిస్తున్న రమణాచారి తదితరులు

సాహితీమూర్తులకు స్వరనీరాజనం

రవీంద్రభారతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న సాహితీమూర్తులకు స్వరనీరాజనం పలకడం ఆనందకరమని రిటైర్డ్ ఐఏఎస్ డా. కేవీ.రమణాచారి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ రజతోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీమూర్తులకు స్వరనీరాజనం పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాస్త్రీయ, సినీ గీతాలను ఆలపించారు. చక్కటి స్వరాలతో గాయనీగాయకులు అలరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణాచారి గాయనీగాయకులను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ ఆధ్వర్యంలో విభిన్నమైన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, తిరుమల శ్రీనివాసాచార్య, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

నాలాలో చెత్తాచెదారం తొలగింపు

నల్లకుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పాత రామాలయం వీధిలో నాలాలో చెత్తాచెదారాన్ని తొలగించారు. నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్, హైదరాబాద్ జిందాబాద్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నాలా సమస్యపై జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో మంగళవారం అధికారులు చెత్తాచెదారంతోపాటు, పూడిక తీత పనులను చేపట్టారు. తొలగించిన చెత్తను అక్కడి నుంచి తరలించారు. ఈఈ వీర్రాజు, ఏఈ దివ్యతేజ పనులను పరిశీలించారు.



దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకుడు ధన్‌రాజ్

కాంగ్రెస్‌లో చేరిన ధన్‌రాజ్

గోషామహల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ జాంబాగ్ డివిజన్ కో-ఆర్డినేటర్ ఎస్. ధన్‌రాజ్ పార్టీకి రాజీనామా చేశారు. మంగళవారం తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి నేతృత్వంలో ఆమె నివాసంలో ధన్‌రాజ్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దీపాదాస్ మున్షి ధన్‌రాజ్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ధన్‌రాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రజాపాలనను చూసి ఆకర్షితులవడంతో పాటు గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని, అందుకే పార్టీలో చేరానన్నారు. ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ రావు, మాజీ డైరెక్టర్ పి.సతీష్, ఎం.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి క్రిమినల్ కోర్టులో బోనాలు

గోషామహల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆషాడమాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని నాంపల్లి క్రిమినల్ కోర్టులో బోనాల ఉత్సవాలను ఆలయ నిర్వాహకులు అజయ్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బోనాల ఉత్సవాలకు గోషామహల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.మురళీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించిన అనంతరం పోతురాజుల విన్యాసాలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

నాలా పై కప్పు వేయాలి

పహాడిషరీఫ్ జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎర్రకుంట, ఓవైసీ కాలనీలో నాలాపై కప్పు లేకపోవడం దుర్వాసన వచ్చి అనారోగ్యాల పాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. చిన్న పిల్లలు ఆడుకుంటూ నాలాలో పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూడిక తీసి పక్కనే వేస్తుండడంతో మళ్లీ నాలాలో పడి వరద నీరు సాఫీగా వెళ్లక నాలా పొంగి కాలనీల్లోకి నీరు చేరుతోందంటున్నారు. నాలాలో వ్యర్థాలను తొలగించాలని, పై కప్పు వేయాలని సమీపంలోని బస్తీలు, కాలనీల వాసులు కోరుతున్నారు. మూడేళ్ల నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.దీనిపై జల్‌పల్లి మునిసిపాలిటీ కమిషనర్ వాణిరెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. నాలాలో పూడిక తీస్తున్నామని, పై కప్పు వేయడానికి నిధులు లేవని తెలిపారు.



ఎర్రకుంట ఓవైసీ కాలనీలో పై కప్పు లేని నాలా

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ndpS9xh లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

మహిళా ఉద్యోగిని బెదిరించి

రూ.1.50 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పోలీసులం మాట్లాడుతున్నాం.. మీ మీద 10 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి అంటూ బెదిరించిన సైబర్ నేరగాళ్లు నగరవాసి నుంచి రూ.1.50 లక్షలు కొల్లగొట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం బాధితురాలికి వాట్సాప్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి ఢిల్లీ పోలీస్‌గా పరిచయం చేసుకున్నాడు. కస్టమ్స్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మీ పేరుమీద పది అరెస్టు వారెంట్‌లు జారీ అయ్యాయని చెప్పాడు. పూర్తి వివరాలు కస్టమ్స్ అధికారి వివరిస్తారని ఫోన్‌కాల్‌ను వేరే వ్యక్తికి ట్రాన్స్‌ఫర్ చేశారు. మరో వ్యక్తి మాట్లాడుతూ.. కస్టమ్స్ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. మనీ ల్యాండరింగ్, చట్టవ్యతిరేకంగా ఇతర దేశాలకు వెళ్తున్న పార్శిల్స్‌లో మీ పాత్ర ఉన్నట్లు తేలిందని, కేసును సీబీఐ అధికారులు దర్యాప్తు చేస్తున్నారని, మిగిలిన పూర్తి వివరాలు సీబీఐ అధికారి వివరిస్తారని చెప్పి ఫోన్‌కాల్ ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆ తర్వాత మరోవ్యక్తి మాట్లాడుతూ ఇది దేశ భద్రతకు సంబంధించిన విషయం కాబట్టి మీకు చెప్పే విషయాన్ని మీ కుటుంబ సభ్యులకు కూడా చెప్పొద్దు చాలా రహస్యంగా ఉంచాలి, లేదంటే మీపై కఠిన చర్యలు ఉంటాయని బెదిరించారు. నిబంధనల ప్రకారం.. మీ ఆస్తులన్నీ జప్తు చేయమని ఆర్డర్స్ ఉన్నాయి. అలా జరగకుండా ఉండాలంటే మీరు కొంత నగదు పంపిస్తే నోటరీ తయారు చేయించి ఆస్తులు జప్తుకాకుండా చూస్తామన్నారు. దాంతో బాధితురాలు వారు చెప్పిన విధంగా తన బ్యాంకు ఖాతా నుంచి రూ.1.50 లక్షలు వారి ఖాతాకు బదిలీ చేసింది. ఆ తర్వాత వారు స్పందించకపోవడంతో అనుమానం వచ్చి ఆరా తీయగా ఇదంతా సైబర్ నేరగాళ్ల మోసమని తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్లాస్టిక్ సర్జరీపై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ పలుకూరి లక్ష్మి

ప్లాస్టిక్ సర్జరీపై అవగాహన సదస్సు

హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ డే వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, బాధితులకు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ సర్జరీలో ఆరు విభాగాలపై రోజుకో విభాగంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పుట్టకతో వచ్చే వైకల్యాలు, చేతి గాయాలు, నరాల ఇబ్బందులు, ప్రమాదాల సమయంలో చేయి, చేతి వేళ్లు కట్ అయితే వాటిని ఆస్పత్రికి ఎలా తీసుకురావాలి, వాటికి ఎలా చికిత్సలు అందిస్తారు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఉస్మానియా ఆస్పత్రి ప్లాస్టిక్ సర్జరీ యూనిట్ చీఫ్, న్యాబి, ఆప్సి ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు ప్రొఫెసర్ పలుకూరి లక్ష్మి తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రిలో సోమవారం వరకు అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆమె చెప్పారు.

చెట్ల కొమ్మల తొలగింపు

అఫ్జల్‌గంజ్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వర్షా కాలంలో విద్యుత్ వైర్లను తాకుతున్న చెట్ల కొమ్మలతో విద్యుత్ షాక్ వచ్చే ప్రమాదం ఉందని బస్తీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ బీసీ సెల్ నాయకుడు కోటి శైలేష్ జీహెచ్ఎంసీ సిబ్బందికి ఫిర్యాదు చేశాడు. మంగళవారం జీహెచ్ఎంసీ సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా కోటి శైలేష్ మాట్లాడుతూ తరుమా లక్ష్మీనారాయణ్ బాగ్ తదితర బస్తీల్లో చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లకు తాకుతున్నాయని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశానని, పెరిగిన చెట్ల కొమ్మలను పూర్తిగా తొలగించారని తెలిపారు.

'కేర్'లో మహిళ స్పృహలో ఉండగానే మెదడుకు శస్త్రచికిత్స

గోషామహల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు న్యూరో విభాగం వైద్యులు అరుదైన బ్రెయిన్ శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడిన సంఘటన మంగళవారం ఎంజే మార్కెట్ కేర్ ఆస్పత్రిలో జరిగింది. ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి న్యూరో సర్జన్ డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ నగరానికి చెందిన ఓ మహిళ కొంతకాలంగా ఆమెకు కాంట్రాస్ట్ మెదడులో కణితి పెరగడంతో దాని వల్ల ఆమె ప్రాణానికి ప్రమాదం వాటిల్లడంతో కుటుంబ సభ్యుల సలహా మేరకు ఆస్పత్రిలో చేరినట్లు తెలిపారు. ఆ మహిళకు కాంట్రాస్ట్ ఎంఆర్ఐ వైద్య పరీక్షలు నిర్వహించగా మెదడులో కణితి ఉన్నట్లు గుర్తించారు. ఈ సర్జరీ అనేది అరుదైనదని రోగి స్పృహలో ఉన్నప్పుడే సర్జరీ చేయాలని... లేని పక్షంలో డ్యామేజ్ జరిగే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. న్యూరో సర్జన్ విభాగం వైద్యులు డాక్టర్ అరుణా రెడ్డి, భవానీ ప్రసాద్, అనస్థీషియా హెచ్ఓడీ డాక్టర్ ఇర్ఫాన్ అహ్మద్, వైద్య బృందం సుమారు 2 గంటలు శ్రమించి రోగిని స్పృహలో ఉంచి శస్త్ర చికిత్స చేశారు. ఈ విధానాన్ని వైద్య పరిభాషలో అవేక్ క్రానియోటమీ అని అంటారని తెలిపారు.



అరుదైన బ్రెయిన్ సర్జరీ అయిన మహిళతో కేర్ ఆస్పత్రి వైద్య బృందం

ప్రస్తుతం మహిళ ఆరోగ్యంగా ఉందని, త్వరలో డిశ్చార్జి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కేర్ ఆస్పత్రి హెచ్‌సీఓఓ డాక్టర్ సమీ, వైద్యులు పాల్గొన్నారు.

బంగారం దుకాణంలో దోపిడీ చేసిన ఇద్దరి అరెస్ట్

● 56 గ్రాముల బంగారం, రూ.90 వేల నగదు స్వాధీనం

మదీన, జులై 9 (ఆంధ్రజ్యోతి): తమకు వచ్చే సంపాదనతో కుటుంబపోషణ కష్టంగా మారడంతో ఐదుగురు వ్యక్తులు పథకం ప్రకారం బంగారం షాపులో బంగారం దోచుకున్నారు. ఈ సంఘటనలో ఇద్దరు నిందితులను మంగళవారం దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్, హుసేనిఆలం పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోల్‌కత్తాకు చెందిన షేక్ రోస్టిక్(39) బంగారు నగలు తయారుచేసే కార్మికుడు. ఇతను హుసేనిఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముంటూ ఓ బంగారు నగల తయారీ దుకాణంలో పనిచేస్తుంటాడు. ఇతనికి వచ్చే సంపాదనతో కుటుంబపోషణ కష్టంగా మారడంతో కోల్‌కత్తాకు చెందిన షేక్ హసిజుల్(33)ను కలిసి సలహా చెప్పమని కోరాడు. దీంతో అతను తనకు తెలిసిన కోల్‌కత్తాకు చెందిన బాపి, మాణిక్, కార్తీక్ అనే ముగ్గురు యువకులున్నారని, అందరం కలిసి ఏదైనా బంగారం దుకాణంలో దోపిడీ చేద్దామని పథకం పన్నారు. పథకంలో భాగంగా ఈ నెల 5న ఘాన్సీబజార్‌లోని ఓ బంగారు దుకాణంలో చొరబడి దుకాణం యజమానిని కత్తితో బెదిరించి 80 గ్రాముల బంగారం, రూ.2 వేల నగదు దోచుకొని పారిపోయారు.


దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రధాన నిందితులైన షేక్ రోస్టిక్, షేక్ హసిజుల్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి 56 గ్రాముల బంగారం, రూ.90 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. మిగతా ముగ్గురు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామన్నారు.

మీరాలం చెరువుకు పర్యాటక సొబగులు

- 2.65 కిలోమీటర్ల మేర ఆరు లేన్ల ఐకానిక్ బ్రిడ్జి
- లేక్ ఫ్రంట్ పార్కు సుందరీకరణ
- సందర్శకులను ఆకర్షించేలా మౌలిక సదుపాయాలు
- పీపీపీ పద్ధతిలో ఏరియా అభివృద్ధికి హెచ్‌ఎండీఏ ప్రణాళికలు

మీరాలం చెరువుకు పర్యాటక సొబగులు అద్దేందుకు హెచ్‌ఎండీఏ సిద్ధమైంది. పాలనా పరమైన అనుమతులు రావడంతో మిరాలం ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్‌కు రూపకల్పన చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. 2.65 కిలోమీటర్ల మేర ఆరులేన్ల ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేయనున్నారు. మీరాలం లేక్ ఫ్రంట్ పార్కు పేరుతో పరిసర ప్రాంతాలన్నింటినీ సుందరీకరణ చేయనున్నారు.

హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మీరాలం చెరువుపై దుర్గంచెరువు తరహాలోనే భారీ కేబుల్ బ్రిడ్జిని తీసుకొచ్చేందుకు రెండేళ్ల క్రితం హెచ్‌ఎండీఏ ఓ కన్సల్టెన్సీ ద్వారా ప్రతిపాదనలు రూపొందించింది. అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయగా పాలనాపరమైన అనుమతులు ఇవ్వలేదు.



రూ.363 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం అనుమతి

గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న మీరాలం చెరువు ప్రాజెక్టుకు కొత్తగా వచ్చిన రేవంత్ సర్కార్ తుది మెరుగులిచ్చింది. మీరాలం చెరువుపై హైలెవల్ ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.363 కోట్లకు పాలనా అనుమతులిచ్చింది. మీరాలం ట్యాంక్ పశ్చిమ భాగాన గల చింతల్‌మెట్ రోడ్డు(మీర్ మెహమూద్ పహాడీ రోడ్డు) నుంచి మీరాలం ట్యాంక్ తూర్పున గల బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి 44ను అనుసంధానం చేస్తూ నాలుగు లేన్లతో 2.65 కిలోమీటర్ల పొడువున ఈ హైలెవల్ ఐకానిక్ బ్రిడ్జి ఉంటుంది. బ్రిడ్జిపైన రెండు చోట్ల 140 మీటర్లతో ప్రవేశానికి ర్యాంపులను ఏర్పాటు చేస్తారు. ఒక చోట 110 మీటర్లతో నిష్క్రమణ ర్యాంపు ఉంటుంది. అలాగే, కేబుల్ బ్రిడ్జిపైన ఆర్నమెంటల్ లైటింగ్ ఏర్పాటు చేస్తారు. ఈ కేబుల్ బ్రిడ్జి నిర్మాణం కోసం అవసరమైన భూమిని ట్రాన్స్‌ఫర్ డైరెక్ట్ రైట్స్(టీడీఆర్) పద్ధతిలో సేకరించనున్నారు. హైలెవల్ ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.363 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం పాలన అనుమతులివ్వగా, అందులో రూ.359.53 కోట్లు సివిల్ పనుల కోసం ఖర్చు చేయనున్నారు. మరో రూ.3.47 కోట్లు షిఫ్టింగ్ పనులకు వినియోగించనున్నారు.

ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్‌తో మరింత వ్యయం

పాతబస్తీలో అభివృద్ధి పరుగులు తీసేందుకు మీరాలం ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మీరాలం పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని, కొత్త నగరానికి.. పాత నగరానికి ఉన్న వ్యత్యాసాలను తొలగించేందుకు అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టాలని ఇటీవల నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా ప్రస్తుతం మీరాలంపై అనుమతించిన హై లెవల్ బ్రిడ్జిని నాలుగు లేన్ల నుంచి ఆరు లేన్లుగా పెంచనున్నారు. చింతల్‌మెట్ రోడ్డు నుంచి జూపార్కు సమీపంలోనే హైలెవల్ బ్రిడ్జి బెంగళూరు రహదారికి కలుస్తుండడంతో మీరాలం ట్యాంక్ విశిష్టతను తెలియజేసేలా అక్కడే ప్రత్యేక థీమ్ ఏర్పాటు, వాహనదారులతో పాటు పర్యాటకులు, సందర్శకులు వినియోగించేందుకు ప్రత్యేకంగా ఫుట్‌పాత్, కేబుల్ బ్రిడ్జి సమీపంలోనే ల్యాండ్‌స్కేప్ అభివృద్ధి, మీరాలం చెరువును పూర్తిగా సుందరీకరణ చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు చేస్తున్నారు. టూరిజానికి అనువుగా సందర్శకులను ఆకర్షించేందుకు వ్యూ పాయింట్లు, సమాచార కేంద్రాలు, సంస్కృతి, చారిత్రక వారసత్వ నేపథ్యాన్ని తెలియజేసేందుకు వివిధ అభివృద్ధి పనులను చేపట్టాలని హెచ్‌ఎండీఏ నిర్ణయించింది. ఆరు లేన్ల ఐకానిక్ బ్రిడ్జితో పాటు మీరాలం చెరువు పరిసర ప్రాంతాలన్నీ పూర్తిగా ప్రజలు, ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకు ఆదాయ, వ్యయాలను అంచనా వేసేందుకు ప్రత్యేకంగా ఓ కన్సల్టెన్సీని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఆ దిశగా హెచ్‌ఎండీఏ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. సంబంధిత కన్సల్టెన్సీ మూడు నెలల్లో తుది నివేదికను హెచ్‌ఎండీఏకు అందజేయాల్సి ఉన్నది.

11న మొండిరుణాల చెల్లింపునకు వన్‌టైం సెటిల్‌మెంట్

- బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలంగాణ జోన్ డిప్యూటీ జోనల్ మేనేజర్

హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వన్ టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్)కింద రుణ గ్రహీతల మొండిబకాయి రుణ ఖాతాలను పరిష్కరించేందుకు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ నెల 11(గురువారం)న దేశవ్యాప్తంగా అన్ని శాఖలు/జోన్లు, ఎఫ్‌జీఎంలలో సంజౌతా దినోత్సవం నిర్వహిస్తుందని బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలంగాణ జోన్ డిప్యూటీ జోనల్ మేనేజర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏవైనా పలు కారణాల వల్ల సకాలంలో రుణాన్ని తిరిగి చెల్లించలేని మొండిబకాయి రుణగ్రహీతల కోసం సంజౌతా దినం ప్రత్యేకంగా రూపొందించబడిందని పేర్కొన్నారు. చిన్న ఖాతాలు, మిడ్-సైజ్ ఖాతాలను పరిష్కరించేందుకు బ్యాంక్ ప్రత్యేక ఓటీఎస్ పథకాన్ని అమలు చేస్తుందని, దీంతో మొండి బకాయి ఖాతాలున్న రుణగ్రహీతలకు ప్రత్యేక డిస్కౌంట్లు అందిస్తోందని తెలిపారు. గురువారం నిర్వహించే ఓటీఎస్ పథకాన్ని రుణ ఖాతాలను సెటిల్ చేసుకోవాలనుకునే వారంతా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ప్రజావాణిలో సమస్యలు తెలుసుకుంటున్న డా. చిన్నారెడ్డి, ఐఏఎస్ దివ్య

ప్రజావాణికి 618 దరఖాస్తులు

బేగంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మంగళవారం ప్రజావాణికి 618 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూకు సంబంధించినవి 163, పౌరసరఫరాల శాఖ 89, విద్యుత్ శాఖ 56, హౌసింగ్ 63, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ 36, ఇతర శాఖలకు చెందిన 211 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రేఖాశర్మ

ట్రెయినీ ఎస్సైలకు జెండర్ సెన్సిటైజేషన్‌పై వర్క్‌షాప్

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పోలీస్ శిక్షణా కేంద్రంలో ట్రైనీ ఎస్సైలకు 'జెండర్ సెన్సిటైజేషన్'పై వర్క్‌షాప్ నిర్వహించారు. జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో 538 మంది ట్రైనీ ఎస్సైలకు రెండు రోజులపాటు వర్క్‌షాప్ కొనసాగింది. మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రేఖాశర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాల్ని అమలు చేసే పోలీస్ వ్యవస్థ.. లింగ వివక్ష, సున్నితత్వం ప్రాముఖ్యత అర్థం చేసుకోవాలన్నారు. పరిస్థితిలో మార్పు వస్తోందని, భవిష్యత్తులో జాతీయ మహిళా కమిషన్‌కు వచ్చే ఫిర్యాదుల సంఖ్య ఏదో ఒక రోజు కచ్చితంగా తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పిల్లలకు పాలు ఇస్తున్న ట్రైనీ ఎస్సైలకు అకాడమీలో వసతి కల్పించామని అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ తెలిపారు. కార్యాలయాల్లో మహిళలు తమ విధులు నిర్వహించేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించామన్నారు. విశ్రాంత ఐపీఎస్ డా.బి.సంధ్య, జాతీయ మహిళా కమిషన్ కౌన్సిలర్ తునికా, అదనపు డీజీపీ మహేష్ భగవత్ తదితరులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

14 నుంచి సమగ్ర కులగణన సాధన యాత్ర

పంజాగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లను పెంచాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 14 నుంచి 31 వరకు కామారెడ్డి నుంచి కరీంనగర్ వరకు పది జిల్లాల్లో 'సమగ్ర కులగణన సాధన యాత్ర' చేపడుతున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ ఛైర్మన్ కుందారం గణేశ్‌చారి, కన్వీనర్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ హామీలను గుర్తు చేసేందుకు యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. 31న ముగింపు సభ కరీంనగర్‌లో లక్షలాది మందితో నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన బీసీ కమిషన్ ఏర్పాటు చేసి కులగణన ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నగేష్‌గౌడ్, బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్, బీసీ సంఘాల నాయకులు గూడూరు భాస్కర్, సమతాయాదవ్, సంధ్య, శ్యామల, రేణుక, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ వెనకబడిన తరగతుల సాధికారత సంఘం నూతన కార్యవర్గం

అధికారానికి దూరంగా వెనకబడిన తరగతులు

పంజాగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అరవై శాతం జనాభా ఉన్న వెనకబడిన తరగతుల వారు ఇప్పటికీ అధికారానికి దూరంగానే ఉన్నారని, బీసీల హక్కుల కోసం ఇంకా పోరాటం చేయాల్సిన పరిస్థితి ఉందని తెలంగాణ వెనకబడిన తరగతుల సాధికారత సంఘం నూతన అధ్యక్షుడు, దర్శకనిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నూతన కార్యావర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రతాని రామకృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శిగా జె.వెంకటేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షుడిగా కొండ దేవయ్య పటేల్, తెలుగు రాష్ట్రాల కౌన్సిల్ అధ్యక్షుడిగా కొప్పూరి భాస్కర్‌రావు, ఉపాధ్యక్షులుగా గురురాజ్, వెంకటేశ్, సహాయ కార్యదర్శులుగా ప్రముఖ దర్శకుడు సముద్ర, రాజు, కార్యదర్శులుగా ఆకుల బాలకృష్ణ, పొలాస వాసు, భక్తవత్సలం, కార్యనిర్వాహక కార్యదర్శిగా దేశెట్టి శివకుమార్, నగర గౌరవ అధ్యక్షుడిగా ఆర్వీ మహేందర్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో అత్యధికంగా బీసీలు ఉన్నా, బీసీల హక్కుల కోసం నేటికీ అడుక్కోవాల్సిన దుస్థితి నెలకొన్నదన్నారు. సమావేశంలో వేముల తిరుమలదేవి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయించేందుకు యత్నించిన వ్యక్తి అరెస్ట్

- ఐదు కిలోల గంజాయి స్వాధీనం

హైదర్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ వద్ద గంజాయి విక్రయించేందుకు యత్నించిన వ్యక్తిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిషాకు చెందిన ప్రఫుల్ల మండల్ అనే యువకుడు కొంతకాలం కిందట బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి శంషాబాద్ ప్రాంతంలో భవన నిర్మాణ కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బాలానగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ తదితర ప్రాంతాలకు చెందిన కూలీలతో పరిచయం ఏర్పడింది. ఒడిషాలో అతితక్కువ ధరకే గంజాయి దొరుకుతుండడంతో ప్రఫుల్ల మండల్ సొంతూరు వెళ్లినప్పుడల్లా గంజాయిని నగరానికి తెచ్చి కేజీ రూ.25 వేల చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఇటీవల ఒడిషాకు వెళ్లి ఐదు కేజీల గంజాయిని సేకరించి బ్యాగులో పెట్టుకొని బస్సులో మంగళవారం హైదరాబాద్‌కు వచ్చాడు. ఎంజీబీఎస్ నుంచి నేరుగా కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ వద్దకు ఆటోలో వెళ్లాడు. అక్కడ గంజాయిని విక్రయించేందుకు కస్టమర్ల కోసం వేచి ఉన్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు మండల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఐదు కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

గంటల కొద్దీ విద్యుత్ అంతరాయాలు..

- చాచా నెహ్రూకాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్
- 9 గంటలు నిలిచిన విద్యుత్ సరఫరా
- పట్టించుకోని క్షేత్రస్థాయి అధికారులు



హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వీఐపీ జోన్‌గా పిలవబడే హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లో గంటల కొద్దీ విద్యుత్ అంతరాయాలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణను ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలు నేరుగా క్షేత్రస్థాయిలో పరిశీలించి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు నివారించాలంటూ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ ఆదేశించినా కొంతమంది నిర్లక్ష్యం వీడడం లేదు. ఇటీవల వర్షం కారణంగా ఆనంద్‌నగర్ కాలనీలో రాత్రి 9 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఉదయం 8 గంటలకు పునరుద్ధరించారు. దీంతో ఆ రాత్రంతా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్‌సౌధకు పక్కనే ఉన్న ఆనంద్‌నగర్ కాలనీలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తుతుండడంపై పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో సీఎండీ ఆగ్రహం వ్యక్తం చేయగా, అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్ చాచా నెహ్రూ కాలనీ సమీపంలో ఉదయం 9 గంటలకు ఓ ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిలై విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రత్యామ్నాయంగా మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు అలాంటి చర్యలేవి తీసుకోకపోవడంతో సుమారు 9 గంటలు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. గంటల కొద్దీ విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నా.. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. టీజీ ట్రాన్స్‌కో, జెన్‌కో ప్రధాన కార్యాలయం, టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయాలుండే ప్రాంతాల్లోనే విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు నెలకొంటున్నా క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదు. ఆపరేషన్ విభాగంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇంజనీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

బర్కత్‌పుర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్(హెచ్‌యూజే) అధ్యక్షుడు శిగ శంకర్‌గౌడ్, కార్యదర్శి అబ్దుల్ హమీద్ షౌకత్ ఆధ్వర్యంలో ఉర్దూ జర్నలిస్ట్ ఫయాజ్, మహ్మద్ అస్గర్ మెమోరియల్ 2024 అవార్డును ఐజేయూ జాతీయ కార్యదర్శి వై.నరేందర్‌రెడ్డికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గాన్ని శాలువా మెమోంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొన్నం మాట్లాడుతూ త్వరలో సమావేశం ఏర్పాటు చేసి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ జర్నలిస్టు అవార్డును రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పునరుద్ధరించాలని కోరారు. అనంతరం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, కోశాధికారి వెంకట్‌రెడ్డి, కార్యదర్శులు వరకాల యాదగిరి, శ్రీకాంత్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు అనిల్‌కుమార్, రాజేష్, కిరణ్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎన్.హరి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రాములు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నరేందర్‌రెడ్డికి మహ్మద్ అస్గర్ మెమోరియల్ జర్నలిస్ట్ అవార్డును ప్రదానం చేస్తున్న మంత్రి పొన్నం, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

హాస్టళ్లలో మెనూ పాటించాలి : కలెక్టర్

హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం అంబర్‌పేట్‌లోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం, సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. తాను కూడా తెలంగాణ బిడ్డనే అని, మారుమూల గ్రామం మెట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో చదివానని తెలిపారు. తర్వాత జగిత్యాల, కరీంనగర్‌లో చదివానని, హైదరాబాద్ కలెక్టర్ అయ్యానని తెలిపారు. కష్టపడి చదివిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం లభిస్తాయని తెలిపారు. కష్టంగా కాకుండా ఇష్టంగా చదివినప్పుడే మంచి ర్యాంకులు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఆశన్న తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఆగస్టు 4న శ్రావణ మాసం స్పెషల్

సికింద్రాబాద్ నుంచి 'దివ్య జ్యోతిర్లింగ దర్శనయాత్ర' రైలు



భారత్ గౌరవ్ రైల్లో ప్రయాణించేందుకు వచ్చిన ఓ కుటుంబం

హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి శ్రావణమాసం ప్రత్యేక రైలును నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేస్తోంది. 'దివ్య జ్యోతిర్లింగ దర్శన యాత్ర' పేరిట ఆగస్టు 4 నుంచి 12 వరకు పలు పుణ్యక్షేత్రాలను దర్శించేలా టూర్‌ను ప్లాన్ చేశారు. ఈ యాత్రలో భాగంగా తిరువన్నామలైలో అరుణాచలం ఆలయం, రామేశ్వరంలో రామనాథస్వామి టెంపుల్, కన్యాకుమారిలో కుమారి అమ్మన్, త్రివేండ్రంలో పద్మనాభస్వామి, తిరుచ్చిలో రంగనాథ స్వామి, తంజావూరులో బృహదేశ్వరాలయాన్ని దర్శించుకోవచ్చు. ఈ రైలు తెలంగాణలోని సికింద్రాబాద్, ఖాజీపేట(వరంగల్), ఖమ్మం, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్‌లలో ప్రయాణికులకు మార్గమధ్యలో ఎక్కే/దిగే సౌకర్యాన్ని కల్పిస్తుంది. యాత్రకు స్లీపర్ టికెట్ ధర రూ.14,250 కాగా, కంఫర్ట్ కేటగిరీకి రూ.28,450గా నిర్ణయించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సూచించారు. అలాగే, భారతీయ రైల్వే ప్రారంభించిన భారత్ గౌరవ్ సర్క్యూట్ రైలు 360 మంది ప్రయాణికులతో మంగళవారం సికింద్రాబాద్ నుంచి బయల్దేరింది. ఈ రైలును ప్రయాణికుల్లో ఒకరైన సీనియర్ సిటిజన్ 67 ఏళ్ల హన్మంతు ప్రారంభించారు. ఈ రైలు అయోధ్య, గయా, వారణాసి, ప్రయాగ్‌రాజ్‌లోని దివ్య/తీర్థ స్థలాలను 9 రోజుల్లో కవర్ చేస్తుందని అధికారులు తెలిపారు.

హైదరాబాద్-వాడి ప్రత్యేక రైళ్లు

సికింద్రాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వాడి జంక్షన్ సమీపంలో జరిగే ఉర్సు ఉత్సవాలకు హైదరాబాద్-వాడి-హైదరాబాద్ మార్గంలో నాలుగు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణమధ్యరైల్వే అధికారులు తెలిపారు. హైదరాబాద్-వాడి స్పెషల్(రైల్ నెంబర్: 07175) ఈ నెల 20వ తేదీ ఉదయం 10.05 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి, మధ్యాహ్నం 3.30 గంటలకు వాడి చేరుతుంది. వాడి- హైదరాబాద్ స్పెషల్ (రైల్ నెంబర్: 07176) ఈ నెల 20వ తేదీ సాయంత్రం 4.20 గంటలకు వాడి నుంచి బయల్దేరి, రాత్రి 9.20 గంటలకు హైదరాబాద్ చేరుతుంది. హైదరాబాద్-వాడి స్పెషల్ (రైల్ నెంబర్: 07177) ఈ నెల 22వ తేదీ ఉదయం 5.00 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి, ఉదయం 10.15 గంటలకు వాడి చేరుతుంది. వాడి-హైదరాబాద్ స్పెషల్ (రైల్ నెంబర్: 07178) ఈ నెల 22వ తేదీ ఉదయం 11.05 గంటలకు వాడి నుంచి బయల్దేరి, సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ చేరుతుంది.

ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తకు జియోసైన్స్ పురస్కారం

ఉప్పల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సీఎస్ఐ-ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్త డా.బి.ప్రశాంత కె.పాత్రోకు జాతీయ భూ విజ్ఞాన పురస్కారం లభించింది. భూ భౌతికశాస్త్రంలో చేసిన పరిశోధనలకు కేంద్ర ప్రభుత్వ గనుల శాఖ పురస్కారాన్ని అందించిందని ప్రశాంత కె.పాత్రో తెలిపారు. రెసిస్టివిటీ, ద్రవాలు, ఖనిజాలు ఉనికి స్పందించేలా పరిశోధన సాగిందని పేర్కొన్నారు. మంగళవారం ఆయనను పలువురు అభినందించారు.



డా.బి.ప్రశాంత కె.పాత్రో

ఉద్యోగాల ఊసెత్తని ప్రభుత్వం : ఈటల

మల్లాపూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రెండు లక్షల ఉద్యోగాలు ప్రకటిస్తామని ఎన్నికలకు ముందు వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే వాటి ఊసే ఎత్తడం లేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్స్‌లో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బాలచందర్ ఆధ్వర్యంలో ఉప్పల్ అసెంబ్లీ కృతజ్ఞత సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారుపై అవిశ్వాసం ప్రకటించిన నిరుద్యోగ యువత యుద్ధం చేస్తున్నారని విమర్శించారు. పీర్జాదిగూడలో 1985లో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్లను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూల్చడం సరికాదన్నారు. ఉప్పల్‌లో 35 ఏళ్ల క్రితం పేదలు నిర్మించుకున్న ఇళ్లను వక్ఫ్ భూములు అంటూ ప్రభుత్వ స్థలాలుగా చెప్పడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఈటల

అసెంబ్లీ రిటైర్డ్ డిప్యూటీ సెక్రటరీ మృతి

నార్సింగ్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ రిటైర్డ్ డిప్యూటీ సెక్రటరీ ఇ.సంజీవ్‌రావు అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఈయన మూడు నెలల క్రితమే ఆ పదవి నుంచి రిటైర్ అయ్యారు. హైదరాబాద్ ఆసిఫ్‌నగర్ నివాసి అయిన సంజీవ్‌రావు కొన్నేళ్లుగా మణికొండలో నివాసం ఉంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీ అసిస్టెంట్ సెక్రటరీగా ఉన్న ఈయన రాష్ట్ర విభజన తర్వాత కొన్ని రోజులు ఆంధ్ర అసెంబ్లీకి పనిచేశారు. ఏడాది క్రితం తిరిగి తెలంగాణకు బదిలీ అయి డిప్యూటీ సెక్రటరీగా పదోన్నతి పొందారు. ఈ ఏడాది మార్చి 31న పదవీ విరమణ పొందారు. మణికొండలో ఇంటి వద్దనే ఉంటున్న ఆయనకు గుండెపోటు రావడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. మళ్లీ ఒంట్లో బాగోలేదని, తనను ఆస్పత్రికి తీసుకెళ్లాలని మంగళవారం కోరారు. రాయదుర్గంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన కొద్దిసేపటికే కన్నుమూశారు. ఆయన అంతిమ సంస్కారాలు మణికొండలో నిర్వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం అనంతరం సంజీవ్‌రావు వారితో సంతకం చేయించారు.



సంజీవ్‌రావు(ఫైల్)

వినియోగదారులతో మర్యాదగా వ్యవహరించండి

- ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులతో అధికారులు, సిబ్బంది గౌరవప్రదంగా వ్యవహరించాలని ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్ ఆదేశించారు. ఇంధనశాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాక.. తొలిసారి దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్) కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని, అంతరాయం ఏర్పడితే యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని సూచించారు. చీఫ్ ఇంజనీర్లు, ఎస్ఈలు క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ స్థానిక ప్రజాప్రతినిధులు, వినియోగదారులతో సమావేశమై, వారి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు స్వీకరించాలన్నారు. సమావేశంలో దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీతో పాటు ఇన్‌చార్జి డైరెక్టర్లు పాల్గొన్నారు.

15న 'చలో సచివాలయం' విజయవంతం చేయాలి

పంజాగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల ఓట్లతో రాష్ట్రంలో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం వారిని విస్మరిస్తోందని పలువురు వక్తలు ఆరోపించారు.అశోక్‌నగర్ క్రాస్ రోడ్స్‌లో విద్యార్థులు, నిరుద్యోగులతో మాట్లాడిన రాహుల్ గాంధీ ఇప్పుడెందుకు స్పందించడం లేదని వారు ప్రశ్నించారు. సమగ్ర కులగణన, రెండు లక్షల ఉద్యోగాల సాధన కోసం ఈ నెల 15న తలపెట్టిన చలో సచివాలయం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. నిరుద్యోగులకు మద్దతుగా విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొంపెల్లి రాజు అధ్యక్షతన మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. విద్యార్థి, నిరుద్యోగులతో ప్రభుత్వం చర్చలు జరిపి, వారి న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఒక్క జీవోతో 45 వేల పోలీసు ఉద్యోగాలు ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. టెట్ ఫలితాల తర్వాత వెంటనే డీఎస్సీకి నోటిఫికేషన్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. బీసీ జనసభ అధ్యక్షుడు, విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు రాజారాం యాదవ్ మాట్లాడుతూ ప్రత్యక్ష పోరాటాల ద్వారా ప్రభుత్వం మెడలు వంచినప్పుడే విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. సమావేశంలో ప్రొ.గాలి వినోద్ కుమార్, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్లు, టీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రమణ కుమార్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్, న్యాయవాది శారదాగౌడ్, వివిధ సంఘాల నాయకులు రాంకోటి ముదిరాజ్, రామ్మూర్తిగౌడ్, కోట్ల వాసుదేవ్, ఎల్చాల దత్తాత్రేయ, లింగం శాలివాహన, రాంచందర్ యాదవ్ పాల్గొన్నారు.

అనుమానంతో భార్యను చంపేశాడు

మల్కాజిగిరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అనుమానంతో ఓ ప్రబుద్ధుడు భార్యను చంపేశాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయ్‌నగర్ కాలనీకి చెందిన ఎ.రాజేందర్(45) కారు డ్రైవర్. భార్య కృష్ణకుమారి(38) కాచిగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సు. వీరికి ఇద్దరు పిల్లలు. కొంతకాలంగా రాజేందర్‌కు భార్యపై అనుమానం ఉంది. ఇదే విషయంలో సోమవారం రాత్రి ఇద్దరూ గొడవ పడ్డారు. కోపంతో భార్యపై దాడి చేశాడు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ కృష్ణకుమారి తెల్లవారే సరికి చనిపోయింది. ఆమె సోదరి జ్యోత్స్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ ఐఏఎస్ ఇంట్లో చోరీ

నార్సింగ్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఐఏఎస్ ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు తాళాలు పగులగొట్టి విలువైన సొత్తు దోచుకెళ్లారు. నార్సింగ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గంధంగూడ ప్రాంతంలోని కిష్టారెడ్డినగర్‌లో రవిబాబు నివాసం ఉంటున్నారు. ఈయన వారం రోజుల క్రితం విజయవాడకు వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి తిరిగొచ్చారు. ఇంట్లో చోరీ జరిగిందని గమనించి నార్సింగ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు క్లూస్‌టీమ్‌ను రంగంలోకి దింపి ఆధారాలు సేకరించారు. దాదాపు పది తులాల బంగారం, ల్యాప్‌టాప్, ఇతర సామగ్రి చోరీకి గురైనట్లు ఫిర్యాదు అందిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నవ్య

కుటుంబ కదంబం

బుధవారం • 10 జూలై 2024

విన్నర్

వారసత్వం అంటే పెద్దల వ్యాపారాన్ని కొనసాగించడం... ఆస్తులను పంచుకోవడం మాత్రమే కాదు... వారు నిర్దేశించిన విలువలు, వ్యక్తిత్వాన్ని కూడా స్ఫూర్తిగా తీసుకోవడం. ఆ దారిలోనే అడుగులు వేస్తున్నారు **రోష్నీ నాడార్ మల్హోత్రా**. చైర్‌పర్సన్‌గా 'హెచ్‌సీఎల్ టెక్నాలజీస్'ను విజయపథాన నడిపిస్తున్న ఆమె... తాజాగా ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారమైన 'నైట్ ఆఫ్ ది లెజియన్ ఆఫ్ హానర్'ను అందుకున్నారు. బిజినెస్ పరంగానే కాదు... నిరాడంబరమైన జీవన శైలిలోనూ తండ్రిని అనుసరిస్తూ... నేటి తరానికి ప్రేరణగా నిలుస్తున్నారు 43 ఏళ్ల రోష్నీ.



తండ్రికి తగ్గ తనయ

చదువుకొనే రోజుల్లో రోష్నీ నాడార్‌కు తన కుటుంబం ఎంత సంపన్నమైనదో తెలియదు. తండ్రి శివ్‌నాడార్ నుంచి 'హెచ్‌సీఎల్ టెక్నాలజీస్' పగ్గాలు చేపట్టాకనే తమకు ఎంత సంపద ఉందో అర్థమైందని ఓ సందర్భంలో చెప్పారు రోష్నీ. ఢిల్లీలో పెరిగిన ఆమె అక్కడి 'వసంత్ వ్యాలీ స్కూల్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేశారు. అమెరికాలోని 'నార్త్ వెస్ట్రన్ యూనివర్సిటీ' నుంచి రేడియో, టీవీ, ఫిలిమ్ సబ్జెక్ట్‌లుగా కమ్యూనికేషన్స్‌లో డిగ్రీ పట్టా పొందారు. నిజానికి అప్పటికి ఆమె మనసు వ్యాపార రంగాన్ని కోరుకోలేదు. మీడియాలో రంగంలోకి వెళదామనుకున్నారు. 'అందుకు నాన్న ఏ మాత్రం అభ్యంతరం చెప్పలేదు. ఆయనే మంచి యూనివర్సిటీ చూసి పెట్టారు. డిగ్రీ తరువాత రెండేళ్లు లండన్‌లోని ఓ చానల్‌లో న్యూస్ ప్రొడ్యూసర్‌గా చేశాను. కొంతకాలం నాకు నచ్చిన రంగంలో ఉన్నాక... 'కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్'లో ఎంబీఏ చదివా. భారత్‌కు తిరిగివచ్చి మా హెచ్‌సీఎల్‌లో సాధారణ ఉద్యోగిగా చేరా' అంటున్న రోష్నీ... కంపెనీలో వివిధ హోదాల్లో పని చేశారు. అంచలంచెలుగా ఎదిగి 2020లో 'హెచ్‌సీఎల్ చైర్‌పర్సన్‌గా తండ్రి నుంచి పూర్తి స్థాయి పగ్గాలు అందుకున్నారు. భారత్‌లో లిస్ట్ అయిన ఒక ఐటీ కంపెనీకి తొలి మహిళా సారథిగా చరిత్ర సృష్టించారు.

సంచలనాలకు కేరాఫ్...

చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టకముందు రోష్నీ... తమ 'శివ్ నాడార్ ఫౌండేషన్' ట్రస్టీగా ఉన్నారు. తన ఆధ్వర్యంలో ఫౌండేషన్ కింద అత్యున్నత ప్రమాణాలతో పాఠశాలలు, కళాశాలలు నెలకొల్పారు. చెన్నైలోని 'శ్రీ శివసుబ్రహ్మణ్య నాడార్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్' వాటిల్లో ఒకటి. ఇది లాభాపేక్ష లేని విద్యా సంస్థ. ఆమె పర్యావరణ ప్రేమికురాలు కూడా. 2018లో 'ది హ్యాబిటాట్స్ ట్రస్ట్' నెలకొల్పారు. వన్యప్రాణులు, వాటి ఆవాసాలను పరిరక్షించేందుకు కృషి చేస్తున్నారు. దీని కోసం వివిధ వన్యప్రాణి సంరక్షణ సంస్థలతో కలిసి పని చేస్తున్నారు. 2019లో 'ఫోర్బ్స్ ప్రపంచ అత్యంత శక్తిమంతులైన 100 మంది మహిళలు' జాబితాలో స్థానం సంపాదించారు. 2022లో దేశంలోని అత్యంత సంపన్న మహిళగా నిలిచి మరో ఘనత సాధించారు. ఐఐఎఫ్ఎల్ వెల్త్ హురున్ విడుదల చేసిన జాబితా ప్రకారం... 2021లో ఆమె నికర సంపద 54 శాతం పెరిగి, 84,330 కోట్లకు చేరింది. కంపెనీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆమె సంచలనాలకు కేంద్ర బిందువు వయ్యారు.

నాన్న బాటలో పయనం...

రోష్నీకి భారతీయ కళలన్నా ఎంతో మక్కువ. చిన్నప్పుడు శాస్త్రీయ సంగీతాన్ని అభ్యసించారు. 2010లో శిఖర్ మల్హోత్రాను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.

'ఇద్దరికీ తెలిసిన స్నేహితుల ద్వారా ఢిల్లీలో తొలిసారి శిఖర్‌ను కలిశాను. ఎందుకు చూడగానే తనే నా ఆత్మీయ నేస్తం అనిపించింది. ఏడేళ్ల స్నేహంలో ఒకరినొకరం పూర్తిగా అర్థం చేసుకున్నాకే పెళ్లి చేసుకున్నాం. ప్రస్తుతం ఆయన మా సంస్థ వైస్‌చైర్మన్‌గా ఉన్నారు' అంటూ ఓ సందర్భంలో నాటి రోజులు గుర్తు చేసుకున్నారు రోష్నీ. వీరికి ఇద్దరు పిల్లలు.

ఎంత ఎదిగినా ఒదిగి ఉండే తత్వం ఆమెది. విందులు, వినోదాలకు దూరం. 'ధనవంతుల ఇంట పుట్టి ఒక సాధారణ అమ్మాయిలా ఎలా ఉంటావు' అని ఆమెను బంధువులు, స్నేహితులు అడుగుతుంటారు. 'నాన్న నుంచి నిరాడంబరత నేర్చుకున్నా. అందుకే నగలు, ఖరీదైన వాచీలు, దుస్తులు ధరించడం నాకు అస్సలు ఇష్టం ఉండదు. చిన్నప్పటి నుంచీ నేను ఇంతే. సాదాసీదాగా ఉంటాను. పరోపకార గుణమే గొప్ప ఆభరణమనేది నా నమ్మకం'... ఇదీ వారికి ఆమె ఇచ్చే సమాధానం. తండ్రి వ్యాపారాన్నే కాదు, ఆయన వ్యక్తిత్వాన్నీ పుణికిపుచ్చుకున్నారు రోష్నీ.

ఎంతో ప్రతిష్టాత్మకం...

ఒక ఇల్లాలిగా, తల్లిగా, ఐటీ కంపెనీ యజమానిగా... భిన్న పాత్రల్లో ఒదిగిపోయిన రోష్నీని ఎన్నో అవార్డులు వరించాయి. తాజాగా ఫ్రాన్స్ దేశ అత్యున్నత పౌర పురస్కారం అయిన 'నైట్ ఆఫ్ ది లెజియన్ ఆఫ్ హానర్'ను అందుకున్నారు. భారత్‌లోని ఫ్రాన్స్ రాయబారి నుంచి ఈ అవార్డును స్వీకరించారు. వ్యాపార, సామాజిక, పర్యావరణ పరంగా అందించిన సేవలు, ఇరు దేశాల ఆర్థిక సంబంధాలను ప్రోత్సహించేందుకు సాగించిన నిర్విరామ కృషికిగానూ ఆమెకు ఈ అవార్డును ప్రకటించారు.

'ఈ పురస్కారం దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను' అంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేసిన రోష్నీ... పేరుకు తగ్గట్టుగానే ఆమె ఎక్కడుంటే అక్కడ వెలుగు రేఖలు ప్రసరిస్తున్నాయి. •



ఆమె పాటల ప్రవాహం. పేరు వరలక్ష్మి నారాయణమ్. ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో కీర్తనలు, భక్తిగీతాలు ఆలపించే గాయని. ఇందిరా గాంధీ, ఎన్టీయార్.. లాంటి ప్రముఖుల సమక్షంలో పాటలు పాడారు. ఒక్కమాటలో చెప్పాలంటే... అరవై ఏళ్లుగా అలుపెరగని స్వరం ఆమెది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని 108 గుళ్లలో భక్తిగీతాలు పాడటానికి నడుం కట్టిన **వరలక్ష్మి నారాయణమ్**ను 'నవ్య' పలకరిస్తే.. తన ప్రయాణాన్ని చెప్పుకొచ్చారిలా..

పాట కోసమే ప్రయాణం

మేం ఇప్పుడు ముంబైలో ఉంటున్నాం. ఇక్కడ ప్రముఖ దేవాలయాల్లో భక్తిగీతాలు పాడుతున్నా. ముఖ్యంగా మహారాష్ట్రలోని గుళ్లలో హిందీ ఎక్కువగా అర్థం అవుతుంది కాబట్టి హిందీలోనే పాడుతున్నా. ఇక్కడి తెలుగువారిని ఓ బృందంగా చేసి.. వారికి పాటలు నేర్పించి.. కార్యక్రమాలు చేస్తున్నా. ఇలా చేయటమే నాకు పరమానందం!

పసి వయసులోనే పాటల ప్రేమలో..

మాది మంగళగిరి. మా నాన్నగారి పేరు శ్రీభాష్యం నరసింహమూర్తి. గుంటూరు- విజయవాడ మధ్యలో నంబూరు అనే ఊరి దగ్గర 'హేమలత టెక్స్‌టైల్స్'లో మా నాన్నగారు ఉద్యోగం చేసేవారు. అలా ఆ సంస్థ వార్షికోత్సవ సందర్భాన.. 'లవకుశ' చిత్రంలోని రెండు పాటల్ని పాడాను. నా తాళజ్ఞానం చూసి సభికులు అందరూ ఆశ్చర్యపడ్డారు. ఎంతో ప్రశంసించారు. ఎందుకంటే.. అప్పుడు నా వయసు కేవలం ఐదేళ్లు. వాస్తవానికి నేనక్కడా పాటలు నేర్చుకోలేదు. గురువే లేరు. మా ఇంట్లోని 'ఆకాశవాణి.. విజయవాడ కేంద్రం' అని పలికే మా రేడియోనే నా తొలి గురువని చెప్పొచ్చు. ఎందుకో తెలీదు.. పాటంటే మహా పిచ్చి. ఒకసారి వింటూనే బాణీతో సహా నేర్చుకునేదాన్ని. పుస్తకంలో రాసుకుని మరీ పలుమార్లు సాధన చేసేదాన్ని. పాడమని నన్నడగవలెనా.., నాదీ ఆడజన్మేనా.., నీ లీల పాడెద దేవా.. లాంటి ఎంతో మంచి పాటలు పాడేదాన్ని. ప్రతి పాటల పోటీలో.. దాదాపు మొదటి బహుమతి అందుకునేదాన్ని. ఇందుకోసం తెలివిగా చాలా కష్టమైన పాటలనే ఎంచుకునేదాన్ని.

అలా రేడియోతో అనుబంధం..

అందరిలా కాకుండా.. కాస్త విభిన్నంగా ఇంటర్‌లో 'మ్యూజిక్ గ్రూప్' తీసుకున్నా. అయితే.. కమర్షియల్ సినిమా పాటల జోలికి నేనేనాడూ పోలేదు. లలిత గీతాలు, ప్రార్థనా గీతాలు, లైట్ మ్యూజిక్ పాటలు పాడేందుకు కృషి చేశా. వందల్లో బహుమతులు గెలుచుకున్నా. ఇంట్లో వారి ప్రోత్సాహంతో పాటు ప్రశంసలూ.. పాట మీద మరింత మక్కువను పెంచాయి. 1970 లో అనుకుంటా.. విజయవాడ రేడియో స్టేషన్‌కు ఆడిషన్‌కు వెళ్లా. అక్కడ నుంచి కొన్నేళ్లపాటు విజయవాడ, తిరుపతి, హైదరాబాద్ రేడియో స్టేషన్లలో లైట్ మ్యూజిక్ పాటలతో పాటు ఈ మాసపు పాట.. పాడేదాన్ని. అప్పట్లో ఈ మాసపు పాట.. పాడటమంటేనే గొప్ప విషయం. అరుదైన అవకాశమది. మూన్నెళ్లకోసారి ఈ అవకాశం వచ్చేది. ఆ తర్వాత టేప్ రికార్డర్‌ను బాగా ఉపయోగించుకున్నా. నేను పాడిన పాటలు, మ్యూజిక్ చేసిన పాటల్ని క్యాసెట్స్‌లో రికార్డు చేశా. తిరుపతిలో.. అక్కడి వేదపాఠశాలలో గోవిందనామాలతో మొదలెట్టి తిరుప్పావై పాశురాలు పాడిన క్షణాలు గొప్పవి!

ఆయనే నా బలం..

బి.ఈడీ చేసినా.. టీచరు ఉద్యోగానికి పోలేదు. ఎందుకంటే గొంతు పోతుందని! మా మేనత్త కొడుకుతోనే పెళ్లయింది. ఆయన పేరు ఎస్.ఎ.ఐ.ఎస్. మూర్తి. కెమిస్ట్రీ లెక్చరర్‌గా ఉద్యోగం చేసేవారు మా. పెళ్లయ్యాక.. ఇంట్లో బంధువుల పిల్లలు ఉండేవారు. వారు చదువుకునేవారు. 'మనమే కాదు మన పిల్లలూ బాగుపడితేనే.. మనం బాగుపడినట్లు' అనేవారాయన. ఇకపోతే.. ఫంక్షన్లకు పాటలు పాడటానికి వెళ్లేదాన్ని. పిల్లలు పుట్టాక కూడా.. ఈ పాటలెందుకూ? అని ఏనాడూ అనలేదు. పైగా 'పాటంటే నీకు ఇష్టం. హాయిగా పాడుకో' అనేవారు. తన ఖాళీ సమయంలో నాతో పాటు వచ్చి.. కొన్ని కార్యక్రమాలకు స్వయంగా ఆయనే వ్యాఖ్యానం చేసేవారు. ఆ తర్వాత నేను ఆలపించేదాన్ని. కొన్నాళ్ల తర్వాత.. నేనే వ్యాఖ్యానం చేయటం అలవాటు చేసుకున్నా. ఒకసారి కొందరు మహిళలంతా కలసి 'ఘంటసాల జయంతి చేద్దా'మని అడిగారు. వాళ్లంతా కూనిరాగం తీసే వాళ్లే. కొన్ని రోజుల పాటు వారితో సాధన చేయించా. దాదాపు వంద మందికి పైగా వేదికను ఎక్కించి ఘంటసాల (జానపద, ప్రేమ, హుషారు, భక్తి గీతాలు) పాడించాను. ఆ రోజు.. వారి ఆనందానికి హద్దుల్లేవు. నాకు ఒక కూతురు, ఒక కొడుకు. దురదృష్టవశాత్తు చిన్న వయసులోనే బ్రెయిన్ స్ట్రోక్‌తో చనిపోయింది. ఆ విషాదాన్ని తట్టుకోలేకపోయా. గంటల పాటు ఏడ్చేదాన్ని. ఇలా అయితే ఇబ్బందని గ్రహించి.. మా ఆయన తోడుగా నిలిచారు. కావాలనే నిర్వాహకులతో మాట్లాడి.. పాటల కార్యక్రమాలకు నన్ను తీసుకెళ్లారు. అలా విషాదాన్ని మెల్లమెల్లగా మర్చిపోయా. ఆ సమయంలో చాలామంది బతకను అనుకున్నారు. అయితే నాకు పాటే ఊపిరి అయ్యింది.. పాటే బతుకయ్యింది.

నేనేనా అనిపిస్తుంది..

మా వారి ఉద్యోగ బదిలీ.. నా కొడుకు చదువుల నిమిత్తం కోసమై మచిలీపట్నం, విజయవాడ, తిరుపతికి మకాం మార్చాం. కొన్ని పదుల ఏళ్ల నుంచీ.. తిరుపతే మా ఇల్లుగా మారిపోయింది. ఆ రోజుల్లో.. ఆర్కెస్ట్రా తీసుకుని వెళ్లి.. తిరుపతిలోని గుళ్లన్నీ తిరిగి పాటలు పాడటం ఇబ్బందితో కూడుకున్నదే. పాటమీద గౌరవం, భక్తి కాబట్టే కష్టాన్నయినా ఇష్టంగా భరించా. వేల కిలోమీటర్లు తిరిగా. అన్నమాచార్య కీర్తనలు, వేంకటేశ్వర స్వామివారి పాటలు, మంగళహారతులు, ప్రార్థనా గీతాలను ఎక్కువగా పాడేదాన్ని. దేశంలోని 150 పుణ్యక్షేత్రాల్లో భక్తి గీతాలు పాడే గొప్ప అవకాశం నాకే లభించింది. 35 మంది పీఠాధిపతుల సమక్షంలో ఆలపించాను. భక్తిగీతాలు పాడటానికి సింగపూర్, మస్కట్, నేపాల్, దుబాయ్ దేశాలకూ వెళ్లాను. తరిగొండ వెంగమాంబ పాటల్ని సప్తగిరి టీవీ చానల్‌లో తొలిసారి పాడింది నేనే. రేడియో, టీవీల్లో పదుల సంవత్సరాలనుంచీ పాడుతున్నా విసుగేరాదా? అని కొందరు అడుగుతుంటారు. 'కొన ఊపిరి వరకూ పాడుతా' అంటుంటా వారితో. అప్పట్లో సినిమా ఫంక్షన్లలో.. కార్యక్రమానికి ముందు భక్తిగీతం నేను పాడితే అదో సెంటిమెంట్‌గా భావించేవారు. ఎన్టీయార్, ఏఎన్నార్, రాజబాబు, జమున, జయప్రద, దాసరి..లాంటి వారి ముందు నా గానం ఆలపించాను. ఇందిరా గాంధీ, సంజయ్ గాంధీ.. దగ్గర నుంచి రోశయ్యగారి దగ్గరి వరకూ ఎంతో మంది రాజకీయ నాయకుల కార్యక్రమాల్లో పాడాను. దాదాపు అందరూ నా గొంతును మెచ్చుకున్నవారే. అరవయ్యేళ్లు వెనక్కి తిరిగి చూస్తే నేనేనా ఈ పాటలు పాడింది అనిపిస్తుంది.

• రాళ్లపల్లి రాజావలి



అదే నా లక్ష్యం!

ప్రస్తుతం మా కొడుకుతో కలసి ముంబైలో ఉంటున్నాం. ఇక్కడ కూడా వివిధ రంగాల్లో పని చేసే మహిళలను.. ఒక్క తాటిపైకి తీసుకొచ్చి.. శిక్షణ ఇచ్చి.. తీర్చిదిద్ది.. దేవాలయాల దగ్గర భక్తి పాటలు పాడిస్తున్నా. ఇలా ఒక్క రూపాయి కూడా ఆశించకుండా ఈ పని చేయటం..నాకెంతో సంతృప్తినిస్తుంది. గుళ్ల దగ్గర భరతనాట్యం చేయాలని ఆసక్తి చూపే వారితో ప్రోగ్రామ్స్ చేయిస్తా. ఇలా మహిళల ప్రతిభను ప్రోత్సహిస్తుంటా. వేంకటేశ్వర స్వామి, రాఘవేంద్రస్వామి, షిరిడీ సాయి మీద సొంతంగా పాటలు చేశా. అన్నట్టు అరవై ఐదేళ్ల వయసులో ఇంత వేగంగా పని చేస్తున్నానంటే.. ఇప్పుడు ఆర్కెస్ట్రా సహకారం అవసరం లేదు. ఎందుకంటే.. నేను పాడే పాటలన్నింటికీ ట్రాక్ చేయించుకున్నా. ఒక్క స్మార్ట్ ఫోన్, స్పీకర్లతోనే కార్యక్రమాలను సులువుగా చేస్తున్నా. ఇకపోతే ఆంధ్రప్రదేశ్‌లో కూటమి గెలిస్తే 108 దేవాలయాల్లో పాటల కార్యక్రమాలు చేస్తానని మొక్కుకున్నా. తొలి అడుగు అన్నవరం దేవాలయం నుంచి ప్రారంభించా. ఇప్పటికే 15 దేవాలయాల్లో పాడాను. మొత్తం 108 దేవాలయాల్లో పాడాలన్నదే.. ప్రస్తుతం నా ముందున్న లక్ష్యం. ఇప్పటికైతే గొంతు బావుంది. బతికి ఉన్ననాళ్లు పాటతోనే సావాసం చేస్తా. పాటకోసమే ప్రయాణం చేస్తా. పాటే ప్రాణం. పాటే జీవితం'.

పిల్లలూ... మీ కథ మాకు చెప్పండి!

పిల్లలకు కథలు చెప్పే తీరిక పెద్దలకు కరువైన రోజుల్లో... పిల్లలు చెప్పే కథలు ఎవరు వింటారు? వారు రాసే కథలు ఎవరు ప్రచురిస్తారు? వారిలో సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించేవారెక్కడున్నారు? తనను వెంటాడిన ఈ ప్రశ్నలకు... తనే పరిష్కారం కనుగొన్నారు 51 ఏళ్ల **తన్మయి కాలేబర్**. పిల్లల్లో పఠనాసక్తిని, రచనాశక్తిని పెంపొందించడానికి ఆమె తీసుకున్న చొరవ వందలాది బాల రచయితల ప్రతిభను పాఠకలోకానికి పరిచయం చేస్తోంది.



"అది 2020 లాక్‌డౌన్ సమయం. నాకు కుటుంబ సభ్యులతో మరింత ఎక్కువ కాలం గడిపే అవకాశం వచ్చింది. ముఖ్యంగా పిల్లలతో కథలు, కబుర్లు.. అప్పుడే మా మేనల్లుడు ఒక నోట్‌బుక్‌లో తను రాసిన కథను నాకు చూపించాడు. వాడు ఆ కథను చెప్పిన తీరు నాకు బాగా నచ్చింది. అది ఎక్కడైనా ప్రచురితమైతే బాగుణ్ననిపించింది. పత్రికలు మొదలు ఆన్‌లైన్ వరకూ ఎన్నో మార్గాల్లో ప్రయత్నించాను. కానీ ఎలాంటి అవకాశం కనిపించలేదు. మా మేనల్లుడి లాంటి ఎందరో బాల రచయితలకు సరైన వేదిక లేకపోవడంతో... వారి సృజన మరుగున పడిపోతోందని అర్థమయింది. 'ఎక్కడెక్కడో వెతికేకన్నా... అలాంటి వేదికను నేనే ఎందుకు ఏర్పాటు చేయకూడదు?' అనుకున్నాను. బాల రచయితలకే ప్రత్యేకమైన 'స్టోరీస్ బై చిల్డ్రన్'ను 2020 నవంబర్‌లో ప్రారంభించాను.

అదే వ్యాపకమైపోయింది...

నా నేపథ్యం గురించి చెప్పాలంటే... కర్ణాటకలోని బెళగావ్ నా స్వస్థలం. అందరు పిల్లల్లాగానే గడిచిన బాల్యం నాది. ఎంబీఏ పూర్తయ్యాక... బెంగళూరులో ఒక ఫైనాన్స్ సర్వీసెస్ కంపెనీలో రెండేళ్ళపాటు ఉద్యోగం చేశాను. పెళ్ళయిన తరువాత... నేను, నా భర్త రాజీవ్ కలిసి ఒక స్టాక్ బ్రోకింగ్ కంపెనీనీ, ఫైనాన్స్ స్కూల్‌ను ప్రారంభించాం. కానీ కొన్నేళ్ళకు వాటిని మూసెయ్యాల్సి వచ్చింది. నా భర్త ఫైనాన్స్ టీచింగ్ వైపు మళ్ళారు. నేను కుటుంబ బాధ్యతలకు పరిమితమైపోయాను. 'స్టోరీస్ బై చిల్డ్రన్'ను ప్రారంభించాక అదే నాకు ప్రధానమైన వ్యాపకంగా మారిపోయింది. పిల్లల్లో పుస్తకాలు చదవడం, రచనలు చేయడం పట్ల ఆసక్తిని ప్రోత్సహించడం, ఏడు నుంచి పద్దెనిమిదేళ్ళ మధ్య వయసు వారి రచనలను ప్రచురించడం... ఇదీ దాన్ని ప్రారంభించడం వెనుక నా ప్రధానమైన ఉద్దేశం. సోషల్ మీడియా ద్వారా దీని గురించి ప్రకటించినప్పుడు... అనూహ్యమైన స్పందన వచ్చింది. మొదటి నెలలోనే ఎందరో పిల్లలు తమ కథల్ని పంపించారు. కథల పోటీలను, 11-18 మధ్య వయసువారికి వార్షిక నవలల పోటీలను నిర్వహించడానికి ఇది స్ఫూర్తినిచ్చింది. నేను, నా మిత్రులు ఒక బృందంగా ఏర్పడ్డాం. పోటీల్లో నెగ్గిన పుస్తకాల ప్రచురణ మొదలుపెట్టాం.

> పిల్లల్లో పుస్తకాలు చదవడం, రచనలు చేయడం పట్ల ఆసక్తిని ప్రోత్సహించడం, ఏడు నుంచి పద్దెనిమిదేళ్ళ మధ్య వయసు వారి రచనలను ప్రచురించడం... ఇదీ నా ప్రధానమైన ఉద్దేశం.

వీటన్నిటికోసం ఒక విధానాన్ని నిర్దేశించుకున్నాం. పిల్లలు తమ వివరాలను రిజిస్టర్ చేసుకున్న తరువాత... వారికి ప్రత్యేకంగా ఒక డ్యాష్‌బోర్డ్ కేటాయిస్తాం. వారు అందులో తమ కథలను పోస్ట్ చెయ్యడానికి, స్టేటస్ చెక్ చెయ్యడానికి, పోటీల్లో పాల్గొనడానికి ఆప్షన్స్ ఉంటాయి. అప్‌లోడ్ చేసిన కథలకు సమీక్ష ఉంటుంది. మాకు సుమారు 15 మంది రివ్యూవర్స్‌తో ఒక బోర్డ్ ఉంది. వారిలో ప్రిన్సిపాల్స్, టీచర్లు, సాహిత్యాభిమానులు, ఇంగ్లీష్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. ప్రతి కథనూ ఒక సమీక్షకుడు పరిశీలిస్తారు. కథావస్తువు, రాసిన విధానం లాంటివి విశ్లేషించడంతో పాటు... ఆ కథ ఆ బాల రచయిత సొంతమేననీ, ఎక్కడినుంచీ ఎలాంటి చౌర్యం చేయలేదనీ వివిధ మాధ్యమాల సాయంతో నిర్ధారించుకుంటారు. ఆ తరువాత... దాన్ని వీలైనన్ని తక్కువ మార్పులతో ప్రచురిస్తాం. ఎందుకంటే పిల్లల ఊహాశక్తిలోని సారాన్ని సజీవంగా ఉంచాలనేది మా కోరిక.

1,800 కథలు, 14 సంకలనాలు

50 కథలతో ప్రారంభమై... 1,800కు పైగా ఆంగ్ల కథల ప్రచురణ వరకూ మా కృషి విస్తరించింది. ప్రపంచవ్యాప్తంగా వెయ్యిమందికి పైగా విద్యార్థులు రిజిస్టర్ అయ్యారు. ప్రచురించిన సంకలనాలు పద్నాలుగు వరకూ ఉన్నాయి. క్రమం తప్పకుండా మా వెబ్‌సైట్ సందర్శించేవారు దాదాపు పదివేల మంది ఉన్నారు. ఈ ప్రయత్నానికి నా భర్త రాజీవ్ పూర్తి సహకారం అందిస్తున్నారు. ప్రారంభంలో మూడున్నర లక్షల పెట్టుబడి కూడా ఆయనే ఇచ్చారు. 2021లో... 'బ్రిటానియా మేరీ ఘెస్టార్టప్ కంటెస్ట్'లో పోటీ పడాల్సిందిగా ప్రోత్సహించారు. కాస్త తటపటాయించినా... అప్లై చేశాను. యాభై మంది ఫైనలిస్టులలో నిలిచాను. ఆ తరువాత... పోటీలో 'స్టోరీస్ బై చిల్డ్రన్' అయిదో స్థానం... పది లక్షల రూపాయల అవార్డ్ లభించాయి. ఇప్పుడు పాఠశాలల్లో స్టోరీ టెల్లింగ్ సెషన్స్, పోటీలకు స్పాన్సర్‌షిప్‌లు, పుస్తకాల్లో ప్రకటనలు తదితర మార్గాల్లో మాకు ఆదాయం వస్తోంది. కథలు, కథలు, కవితల ప్రచురణతో పాటు... బాల రచయితల కోసం ఒక క్లబ్ నడుపుతున్నాం. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల పిల్లలు నెలకు ఒకసారి ఆన్‌లైన్‌లో కలుసుకొని... పుస్తకాలు, సాహిత్యం గురించి చర్చిస్తారు. బాల రచయితల ఉత్సాహాన్ని చూసిన తరువాత... ప్రత్యేకంగా వారికోసమే ఒక లిటరరీ ఫెస్టివల్‌ను త్వరలో నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నాం. అంతర్జాతీయ స్థాయిలో బాల రచయితల కమ్యూనిటీ ఏర్పాటు చేయడం, బాల సాహిత్యంలో వారిని, మా సంస్థను మార్గదర్శకులుగా నిలపడం... ఇవీ మా ఆశయాలు." •

ఫ్యాషన్





ఫ్లోరల్ ఫ్రాక్స్

పువ్వులు స్త్రీత్వాన్నీ, సహజసిద్ధ సౌందర్యాన్నీ ప్రతిబింబిస్తాయి. ఆహ్లాదకరమైన అనుభూతిని కూడా అందిస్తాయి. కాబట్టే ఫ్లోరల్ ఫ్రాక్స్ నిరంతర ఆదరణ పొందుతూ ఉంటాయి. అన్ని కాలాలకూ సూటయ్యే ఫ్లోరల్ ఫ్రాక్స్ మీద ఓ లుక్కేద్దామా?

1960ల్లోనే గుచి కంపెనీ ఫ్లోరా ప్రింట్ పేరుతో సుప్రసిద్ధ ఫ్లోరల్ ప్యాటర్న్‌ను వెలుగులోకి తెచ్చింది. అప్పటి నుంచి పూల దుస్తులు సరికొత్త హంగులను అద్దుకుంటూ మహిళలను అలరించడం మొదలుపెట్టాయి. బుట్టబొమ్మల్లా బొద్దుగా కనిపించడం కోసం, నాజూకుగా మెరిసిపోవడం కోసం భిన్నమైన మెటీరియల్స్‌తో ఈ ఫ్లోరల్ ఫ్రాక్స్ తయారవుతూ ఉంటాయి. శాటిన్, ఆర్గంజా, సింథటిక్, జార్జెట్... ఇలా వెరైటీ మెటీరియల్స్‌తో తయారయ్యే వినూత్నమైన ఫ్లోరల్ ఫ్రాక్స్ అన్ని రకాల వయసులవారినీ అలరిస్తూ ఉంటాయి.

అన్ని సందర్భాల్లో...

ఫ్లోరల్ ఫ్రాక్, పార్టీ వేర్‌గా పనికిరాదనుకుంటే పొరపాటు. ఈవినింగ్ గౌన్‌గా, వేడుకల్లో ధరించే పార్టీ గౌన్‌గా, కంఫర్ట్ వేర్‌గా, రెగ్యులర్ వేర్‌గా సందర్భానికి తగిన మెటీరియల్‌తో వేర్వేరు ఫ్రాక్స్ ఇప్పుడు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. కాటన్‌తో తయారయ్యే ఫ్రాక్స్‌ను రెగ్యులర్ వేర్‌గా, శాటిన్, ఆర్గంజాతో తయారయ్యే వాటిని పార్టీ వేర్‌గా, జార్జెట్, సింథటిక్ ఫ్రాక్స్‌ను ఈవినింగ్ గౌన్స్‌గా వేసుకోవచ్చు.

తళుకులీనేలా...

సెక్విన్లు, మోటిఫ్‌లు, జరీ మెరుపులు, సెమీ ప్రెషియస్ స్టోన్స్... వీటితో తీర్చిదిద్దిన ఫ్లోరల్ ఫ్రాక్స్ భారీగా కనిపిస్తాయి. వీటిని పుట్టిన రోజు వేడుకలు, రిసెప్షన్ల కోసం ఎంచుకోవచ్చు. ఫ్రిల్స్, ఫ్లోయీ డిజైన్లు నాజూకుగా ఉన్నవాళ్లకు చక్కగా సూటవుతాయి. పెద్ద పెద్ద పూలు, లతలు, ముదురు రంగులు కూడా వీళ్లకు చాలా బాగా నప్పుతాయి. కాస్త బొద్దుగా ఉన్నవాళ్లు చిన్నపాటి పూల డిజైన్లను ఎంచుకోవాలి. నడుము పైభాగంలో ఫ్లవర్స్ ఉన్నా, కింది భాగం ప్లెయిన్‌గా ఉండేలా చూసుకోవాలి.

యాక్సెసరీస్

పెన్సిల్ హీల్స్, యాంకిల్ బూట్స్ ఈ రకం ఫ్రాక్స్‌కు చక్కగా నప్పుతాయి. వెల్వెట్‌తో తయారైన బూట్లు ఆకర్షణీయంగా కనిపించేలా చేస్తాయి. మెడలో డైమండ్ చోకర్, చేతికి అదే రకం బ్రేస్‌లెట్, చెవులకు జూకాలు బాగుంటాయి. భారీ స్టడ్స్ కూడా సూటవుతాయి. •

సీనియర్లూ శభాష్

ఇప్పుడున్న పరిస్థితుల్లో హీరోయిన్లుగా పదేళ్ల పాటు కొనసాగటమే గొప్ప. 20 ఏళ్ల వయసులో కథానాయికలుగా వెండితెరపై మెరిసిన ముద్దుగుమ్మల్లో చాలామంది 40వ పడికి చేరువలో మాత్రం హీరో అక్క వదిన, తల్లి లాంటి సైడ్ క్యారెక్టర్లకు మారుతున్నారు. కానీ బాలీవుడ్‌లో కొందరు కథానాయికలు మాత్రం దీనికి విఎనహాయింపుగా నిలుస్తున్నారు. 20 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నా ఇంకా హీరోయిన్ల వేషాలతోనే అభిమానులను అలరిస్తున్నారు. హీరోలతో రొమాన్స్ చేసే చిలిపి పాత్రలు లాంటివి చేయకపోయినా కథను ముందుకు నడిపించే దమ్మున్న పాత్రలు చేస్తూ శభాష్ సీనియర్స్ అనిపించుకుంటున్నారు.





వెండితెరకు తరగని అందం

1997లో తమిళ సినిమా 'ఇరువర్' (ఇద్దరు)తో హీరోయిన్‌గా వెండితెర ఎంట్రీ ఇచ్చారు విశ్వసుందరి ఐశ్వర్యారాయ్. హీరోయిన్‌గా 25 ఏళ్ల ప్రస్థానాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. వివాహమైనా, ఓ పాపకు జన్మనిచ్చినా ఆమె క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. పెళ్లి తర్వాత ఆమె నటించిన కొన్ని సినిమాలు అపజయం పాలైనా తన అభిరుచికి అద్దం పట్టే సినిమాలు చేస్తూ వచ్చారు. గతేడాది మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'పొన్నియిన్ సెల్వన్' సిరీస్‌లో నందిని పాత్రలో తన అందం, అభినయంతో ప్రత్యేకాకర్షణగా నిలిచారు.

రూ. 150 కోట్ల చిత్రంతో...

2000 సంవత్సరంలో వచ్చిన 'రెఫ్యూజీ' చిత్రంతో కథానాయికగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు కరీనాకపూర్ ఖాన్. ఆ తర్వాత బాలీవుడ్ అగ్రహీరోలందరితోనూ నటించి లెక్కకు మిక్కిలి హిట్ చిత్రాలను తన ఖాతాలో వేసుకున్నారు. కథానాయికగా ఆమె వయసు 24 ఏళ్లు అయినా ఇప్పటికీ తన చిత్రాలతో బాక్సాఫీసు దగ్గర సందడి చేస్తున్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఆమె లీడ్‌రోల్ పోషించిన 'క్రూ' చిత్రం ఏకంగా రూ. 150 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఓ వైపు బాలీవుడ్ అగ్రహీరోల చిత్రాలు బాక్సాఫీసు దగ్గర బోల్తా పడుతుంటే ఈ లో బడ్జెట్ చిత్రం మాత్రం ఆశ్చర్యపరుస్తూ మంచి వసూళ్లను రాబట్టింది. ప్రస్తుతం ఆమె 'సింగం ఎగైన్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఓ సంచలన అత్యాచార కేసు ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రంలోనూ కరీనా లీడ్ రోల్‌లో కనిపించనున్నారనే టాక్ వినిపిస్తోంది.

జోరు చూపుతున్న టబు

'క్రూ' చిత్రంలో కీలకపాత్ర పోషించిన మరో సీనియర్ హీరోయిన్ టబు సైతం తన జోరు చూపుతున్నారు. బాలనటిగా హిందీ చిత్రసీమలో అడుగుపెట్టిన ఆమె తెలుగు చిత్రం 'కూలీ నంబర్ 1' తో హీరోయిన్‌గా మారారు. ఈ చిత్రం విడుదలై దాదాపు 35 ఏళ్లు కావొస్తోంది. ఓ వైపు లీడ్‌రోల్స్ చేస్తూనే మధ్యమధ్యలో హీరోయిన్‌గానూ సత్తా చాటుతున్నారు. ప్రస్తుతం ఆమె అజయ్‌దేవ్‌గణ్ హీరోగా నటిస్తున్న 'ఆరోం మే కహా దమ్ థా'చిత్రంలో ఆయనకు జోడీగా నటిస్తున్నారు. వారిద్దరి కలయికలో వస్తున్న పదో చిత్రం ఇది.

వెండితెర రాణి

కభీ ఖుషీ కభీ ఘమ్, ప్యార్ దీవానా హోతా హై లాంటి ఎన్నో సూపర్‌హిట్ చిత్రాలతో హీరోయిన్‌గా మెప్పించారు రాణీ ముఖర్జీ. 1996లోనే ఓ బెంగాలీ చిత్రంతో కథానాయికగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన రాణీ ముఖర్జీ ఇప్పటికీ హీరోయిన్ ఓరియంటెడ్ సినిమాలతో సత్తా చాటుతున్నారు. 'మర్దానీ 2, బంటీ ఔర్ బబ్లీ 2, మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' లాంటి వరుస చిత్రాల్లో లీడ్‌రోల్స్ పోషించి మంచి విజయాలను అందుకున్నారు. తాజాగా ఆమె సోనాలీ బోస్ దర్శకత్వంలో మహిళా ప్రాధాన్య చిత్రం చేయబోతున్నారు.



మెరుపు కలల జోడీ మరోసారి

అరవింద్ స్వామి, ప్రభుదేవా హీరోలుగా వచ్చిన 'మెరుపు కలలు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు కాజోల్. 'బాజీఘర్, 'దిల్ వాలే దుల్హనియా లేజాయేంగే' చిత్రాలు బాలీవుడ్‌లోని ఆమె విజయ పరంపరలో కొన్ని. అజయ్ దేవ్‌గణ్‌తో పెళ్లయ్యాక కొన్నాళ్లు సినిమాలకు విరామం ఇచ్చారు. ప్రస్తుతం చరణ్‌తేజ్ ఉప్పలపాటి దర్శకత్వంలో ప్రభుదేవా, కాజోల్ జంటగా ఓ చిత్రం రాబోతోంది. 27 ఏళ్ల తర్వాత ఈ కాంబో సెట్టయింది. సంయుక్తా మీనన్ ఈ చిత్రంతో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు.

తగ్గని హవా

హిందీ చిత్రసీమలో 90వ దశకంలో హీరోయిన్‌గా అరంగేట్రం చేసి అగ్ర కథానాయికగా ఎదిగారు మాధురీ దీక్షిత్. 'ఖల్నాయక్, హమ్ ఆప్కే హై కౌన్, బేటా, రాజా' తదితర చిత్రాల్లో ఆమె నటన ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసింది. మంచి డాన్సర్‌గానూ తనదైన ముద్ర వేశారు. పెళ్లయ్యాక సినిమాలు చేయడం తగ్గించారు మాధురీ. ప్రస్తుతం ఆమె 'ధమాల్ 4లో' లీడ్‌రోల్‌లో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని బాలీవుడ్ టాక్. ఇంకా రవీనాటాండన్, జుహీచావ్లా, మనీషా కోయిరాలా, అమీషా పటేల్, విద్యాబాలన్ లాంటి సీనియర్ హీరోయిన్లు కథానాయిక ప్రాధాన్య చిత్రాలతో అభిమానులను ఎంటర్‌టైన్ చేస్తున్నారు.

వెబ్ సిరీస్‌లో త్రిష



హీరోయిన్ త్రిష తొలిసారిగా ఓ వెబ్ సిరీస్‌లో నటిస్తున్నారు. అనూహ్యమైన మలుపులతో, ఉత్కంఠభరితంగా సాగే ఆ సిరీస్ పేరు 'బృంద'. సోనీ లివ్‌లో ఆగస్టు 2న ఇది స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, మరాఠీ, బెంగాలీ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుండడం విశేషం. ఈ సిరసీ గురించి దర్శకుడు సూర్య మనోజ్ వంగాల మాట్లాడుతూ 'ఆద్యంతం సస్పెన్స్‌తో 'బృంద' సిరీస్ సాగుతుంది. శక్తిమంతమైన ఫిమేల్ లీడ్ నేరేటివ్ స్టోరీ ఇది. దీన్ని చూశాక ఇప్పటిదాకా నమ్ముతున్న నమ్మకాల మీద ఫోకస్ పెరుగుతుంది. ఈ జోనర్‌లో వచ్చే సినిమాలకు కొత్త నిర్వచనం చెప్పేలా ఉంటుంది' అన్నారు. సూర్య మనోజ్ వంగాల, పద్మావతి మల్లాది కలసి రూపొందించిన స్క్రీన్‌ప్లే సిరీస్‌కు హైలైట్ అవుతుందని అంటున్నారు. డ్రామా, క్రైమ్, మిస్టరీ అంశాలతో రూపొందిన ఈ సిరీస్‌కు శక్తికాంత్ కార్తిక్ సంగీతం అందించారు. దినేష్ కె బాబు ఛాయాగ్రాహకుడు. ఇంద్రజిత్ సుకుమారన్, జయప్రకాశ్, ఆమని, రవీంద్ర విజయ్, ఆనంద్ సామి, రాకేందు మౌళి తదితరులు నటించారుజ


నాగులాపురం నాగమ్మ



మంచు లక్ష్మీ ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడికల్ డ్రామా 'ఆది పర్వం'. శివకంఠంనేని, ఆదిత్య ఓం, ఎస్తర్ నోరోనా, శ్రీజిత ఘోష్, సుహాసిని కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో ఎమ్.ఎస్.కె.రచన నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా సాంగ్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా సంజీవ్ మేగోటి మాట్లాడుతూ "ఈ సినిమాలో మంచు లక్ష్మీ 'నాగులాపురం నాగమ్మ'గా నటిస్తున్నారు. ఆ పాత్రలో ఆమె నట విశ్వరూపం చూస్తారు. ఆమె చేసిన యాక్షన్ సీక్వెన్సులు సినిమాకే హైలైట్" అని చెప్పారు. "ఆదిపర్వం' మీ అందరికీ నచ్చేలా ఉంటుంది" అని మంచు లక్ష్మీ అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: పవన్ శేఖర్ పసుపులేటి, సినిమాటోగ్రఫీ: ఎస్.ఎన్.హరీశ్, సంగీతం: మాధవ్ సైబా, సంజీవ్ మేగోటి, బి.సుల్తాన్ వలి, ఓపెన్ బనానా, లుబెక్ లీ మార్విన్.

కేస్ నంబర్ 15 ఏమిటి?

అజయ్, రవిప్రకాశ్, హర్షిణి, మాండవియ సెజల్, చమ్మక్ చంద్ర, చిత్రం శ్రీను ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'కేస్ నం.15'. తడకల వంకర్‌రాజేశ్ స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'కేస్ నం.15' ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా తడకల వంకర్‌రాజేశ్ మాట్లాడుతూ "సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలోని సన్నివేశాలు



ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి. సినిమాను ఎక్కడా రాజీ పడకుండా తెరకెక్కించాం. ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ మంచి పేరు వస్తుంది" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఆర్.కె.స్వామి, సినిమాటోగ్రఫీ: అనమ్ వెంకట్, సంగీతం: జాన్.

భారతీయుడు-2 బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు





భారతీయుడు-2 సినిమా బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రజా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి మద్దతుగా నటుడు కమల్‌హాసన్‌తో పాటు చిత్ర బృందం శంకర్, సిద్ధార్థ, సముద్రఖని కలిసి డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా అవగాహన వీడియో రూపొందించడం హర్షించదగ్గ విషయమన్నారు. కాగా గత వారం కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు కొత్త వాహనాలు ప్రారంభించిన సమయంలో డ్రగ్స్ నిర్మూలనకు సినీ పరిశ్రమ తమ వంతు సహకారం అందించాలని సీఎం సూచించారు. ప్రతి సినిమా విడుదల సమయంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నటీనటులు కనీసం రెండు నిమిషాల నిడివితో వీడియో చిత్రీకరించి ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు సినీ ప్రముఖులు, క్రీడా కారులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేస్తున్నారు.

నా మాటల్ని అపార్థం చేసుకున్నారు

'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తను మాట్లాడిన మాటల్ని అపార్థం చేసుకున్నారని సిద్ధార్థ్ చెప్పారు. డ్రగ్స్ కట్టడికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తాను. సీఎం సార్.. మేం ఎప్పుడూ మీతోనే" అంటూ ప్రత్యేకంగా విడుదల చేసిన వీడియోలో ఆయన పేర్కొన్నారు.



గుండెపోటుతో ఉషా ఉతప్ భర్త కన్నుమూత

ప్రముఖ గాయని ఉషా ఉతప్ ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. ఆమె భర్త జానీ చాకో ఉతప్ సోమవారం రాత్రి కన్నుమూశారు. ఆయన వయసు 78 ఏళ్లు. కోల్‌కతాలోని వారి ఇంట్లో టీవీ చూస్తున్న సమయంలో ఆయనకు గుండె పోటు రావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆయన మరణించారని వైద్యులు తెలిపారు. ఈ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ఈ గ్యాప్ నాకు చాలా నేర్పింది

'నన్ను దోచుకుందువటే' చిత్రంతో ఆరంగేట్రం చేసి.. వరుస సినిమాల్లో నటించారు నభా నటేశ్. కానీ 2021లో వచ్చిన 'మాస్ట్రో' సినిమా తర్వాత తెరపై కనిపించలేదు. ఈ విరామానికి కారణాన్ని ఆమె లేటెస్ట్‌గా నటించిన 'డార్లింగ్' సినిమా ట్రైలర్ లాంచ్‌లో తెలిపారు. "2022లో నాకు యాక్సిడెంట్ అయ్యింది. ఆ సమయంలో నా చేతిలో మూడు ప్రాజెక్ట్స్ ఉన్నందున.. వాటిని పూర్తి చేసేందుకు సర్జరీ చేసుకుని తగినంత విరామం లేకుండా సెట్స్‌లో అడుగుపెట్టాను.. దాంతో ఆ గాయం తిరగబెట్టింది. అందుకే ఇన్నేళ్లు సినిమాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఇప్పటివరకూ నేను గ్లామరస్ పాత్రలే ఎక్కువ పోషించాను. ఈ గ్యాప్ నాకు చాలా నేర్పింది. ఇప్పటి నుంచి నటనా ప్రాధాన్యమున్న పాత్రల్లోనూ నటించాలనుకుంటున్నాను. అందుకే స్క్రిప్‌ల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాను" అని చెప్పారు. నభా నటించిన 'డార్లింగ్' చిత్రం ఈ నెల 19న విడుదల కానుండగా, ఆమె నటిస్తున్న 'స్వయంభు' చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.

వినోదాత్మకంగా పేకమేడలు



'నా పేరు శివ', 'అంధగారం' 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న వినోద్‌కిషన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'పేకమేడలు'. అనూష కృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో 'ఎవరికీ చెప్పొద్దు' సినిమా ఫేమ్ రాకేశ్ వర్రే సినిమాను నిర్మిస్తున్నారు. టీజర్, పాటలు లాంచ్ చేసి.. ఇప్పటికే పలు రకాల విభిన్న ప్రమోషన్ కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకుంది చిత్రబృందం. మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నీలగిరి మామిళ్ల మాట్లాడుతూ "సామాన్యుల జీవితాల్లో జరిగే సంఘటనల ఆధారంగా ఈ సినిమా కథను రాసుకున్నాను. వినోదంతో పాటు భావోద్వేగాలను మిళితం చేసిన సినిమా ఇది" అని అన్నారు. చిత్ర నిర్మాత రాకేశ్ వర్రే మాట్లాడుతూ "ఇది కేవలం ఒక వినోదాత్మక చిత్రమే కాదు.. ఒక భార్య తన భర్తకు అన్ని వేళలా ఎంతగా సపోర్ట్ చేస్తుందో చూపించే చిత్రం" అని చెప్పారు. "ఈ సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను" అని హీరో వినోద్‌కిషన్ అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: సృజన అడుసుమిల్లి, హంజా అలీ, డీఓపీ: హరిచరణ్.కె, సంగీతం: స్మరణ్‌సాయి.

దర్శకుడే హీరో!



కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ ఎక్కువగా లభిస్తున్న ప్రస్తుత తరుణంలో దర్శకనిర్మాతలు ఇప్పుడు విభిన్న కథాంశాలను ఎన్నుకుంటూ చిత్రాలు నిర్మిస్తున్నారు. ఆ కోవలో వస్తున్న మరో చిత్రం 'కళింగ'. ఇంతకుముందు 'కిరోసిన్' చిత్రంలో నటించిన ధ్రువ వాయు ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. దర్శకుడు కూడా ఆయనే. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సీనియర్ రైటర్ విజయేంద్రప్రసాద్ విడుదల చేశారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోస్టర్‌లో హీరో, అతని వెనుక ఉగ్ర రూపంలో ఉన్న లక్ష్మీ నరసింహస్వామి విగ్రహం, హీరో చేతిలో కాగడ... ఇవన్నీ సినిమా మీద ఆసక్తి పెంచుతున్నాయి. ప్రగ్యా నయన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో 'ఆడుకాలం' నరేన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. మురళీధర్ గౌడ్, లక్ష్మణ్, తనికెళ్ల భరణి, సమ్మెట గాంధీ, బలగం సుధాకర్, సంజయ్‌కృష్ణ, హరిశ్చంద్ర తదితరులు ఇతర ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్.

సా. 4.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..


శుభ్‌మన్ గిల్

ఆధిక్యం కోసం భారత్

ఓపెనర్‌గా జైస్వాల్!

నేడు జింబాబ్వేతో మూడో టీ20

హరారే: ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా భారత యువ జట్టు కీలక మ్యాచ్ ఆడనుంది. ప్రస్తుతం సిరీస్ 1-1తో సమంగా ఉండగా, నేడు జింబాబ్వేతో జరిగే మూడో మ్యాచ్‌లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగబోతోంది. తద్వారా ఆధిక్యం సాధించి ఆతిథ్య జట్టును ఒత్తిడిలోకి నెట్టవచ్చు. అయితే టీ20 వరల్డ్‌కప్ అనంతరం యశస్వీ జైస్వాల్, సంజూ శాంసన్, శివమ్ దూబే జట్టులో చేరడంతో తుది కూర్పు ఆసక్తికరంగా మారింది. ఓపెనర్‌గా అభిషేక్, జైస్వాల్‌లలో ఎవరివైపు మొగ్గు చూపుతారనేది వేచి చూడాల్సిందే. ఆ స్థానంలో ఇప్పటికే అభిషేక్ శర్మ దుమ్మురేపే ఆటతీరుతో శతకం బాదేశాడు. అయితే ఆడిన 17 టీ20ల్లో 161కి పైగా స్ట్రయిక్ రేట్‌తో ఉన్న జైస్వాల్‌పైనే కెప్టెన్ గిల్ ఆసక్తి చూపవచ్చు. అప్పుడు అభిషేక్ వన్‌డౌన్‌లో ఆడాల్సి ఉంటుంది. అదే జరిగితే రుతురాజ్ నాలుగో స్థానంలో, ఇక కీపర్‌గా శాంసన్ ఆ తర్వాత బరిలోకి దిగుతారు. మిడిలార్డర్‌లో ఆల్‌రౌండర్ దూబే, పరాగ్ ఇన్నింగ్స్‌ను కదం తొక్కించగలరు. అలాగే సాయి సుదర్శన్, జురెల్, పరాగ్ తమ స్థానాలను కోల్పోవాల్సి ఉంటుంది. మరోవైపు తొలి మ్యాచ్‌లో అద్భుత విజయం సాధించిన జింబాబ్వే ఆ తర్వాత అన్నింటా విఫలమై 100 పరుగుల తేడాతో చిత్తయింది. ముఖ్యంగా భారత స్పిన్నర్లను ఎదుర్కోవడంలో ఈ జట్టు బ్యాటర్లు పూర్తిగా తేలిపోతున్నారు. ఈ కీలక మ్యాచ్‌లోనైనా బ్యాటింగ్ విభాగం రాణిస్తే భారత్‌కు పోటీ ఇవ్వగలుగుతుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), జైస్వాల్, అభిషేక్, రుతురాజ్, శాంసన్, దూబే, రింకూ, సుందర్, బిష్ణోయ్, అవేశ్, ముకేశ్.

జింబాబ్వే: మధెవెరె, ఇన్నోసెంట్, బెన్నెట్, సికందర్ రజా (కెప్టెన్), మైర్స్ క్యాంప్‌బెల్, మదండె, మసకద్జ, జోంగ్వే, ముజరబాని, చటార.

ఇక గంభీర్ శకం



టీమిండియా కోచ్‌గా నియామకం

- ప్రకటించిన బీసీసీఐ
- శ్రీలంక టూర్‌తో ఇన్నింగ్స్ షురూ

న్యూఢిల్లీ: భారత జట్టు ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ నియామకాన్ని భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం బోర్డు కార్యదర్శి జై షా ట్వీట్ చేశాడు. టీ20 వరల్డ్‌కప్‌తో ద్రవిడ్ కాంట్రాక్ట్ ముగిసింది. శ్రీలంకతో ఈ నెల 27నుంచి జరిగే సిరీస్ నుంచి కోచ్‌గా ప్రయాణం ఆరంభించనున్న గంభీర్ రెండేళ్లపాటు పదవిలో ఉంటాడు. ఈ సిరీస్‌లో భారత జట్టు మూడేసి వన్డేలు, టీ20లు ఆడనుంది. 42 ఏళ్ల గౌతీకి కోచ్‌గా పనిచేసిన అనుభవం లేకపోయినా పలు ఐపీఎల్ జట్లకు మెంటార్‌గా సేవలందించాడు. ఈ ఏడాది కోల్‌కతా నైట్‌రైడర్స్ టైటిల్ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. 'భారత దేశమే నా గుర్తింపు. దేశానికి సేవ చేయడం ఈ జన్మకు దక్కిన గొప్ప గౌరవం. కొత్త పాత్రలో టీమిండియాతో మమేకవుతున్నా. కానీ, నా లక్ష్యం మాత్రం ఒక్కటే.. భారత్‌ను గర్వించేలా చేయడం. ప్రజల కలలను నెరవేర్చడానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తాన'ని గంభీర్ ఎక్స్‌లో పోస్టు చేశాడు. కాగా ద్రవిడ్ పదవీకాలం ఇటీవలి వరల్డ్‌కప్‌తోనే ముగిసిన విషయం తెలిసిందే. గంభీర్ ఎంపిక ఆలస్యమైనందున జింబాబ్వేలో పర్యటిస్తున్న భారత జట్టు తాత్కాలిక కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్‌ను నియమించారు. గంభీర్ తన కెరీర్‌లో 2007 టీ20 వరల్డ్‌కప్, తర్వాత 2011 వన్డే ప్రపంచకప్ గెల్చుకున్న భారత జట్టులో సభ్యుడు. ఇక ఐపీఎల్‌లో కెప్టెన్‌గా కోల్‌కతా జట్టును రెండుసార్లు (2012, 2014) విజేతగా నిలిపాడు. గంభీర్ వేతనం ఎంతనేది బోర్డు వెల్లడించనప్పటికీ ఏడాదికి సుమారు 10 నుంచి 12 కోట్లు ఉండవచ్చని భావిస్తున్నారు.

సవాళ్లపై సవారీ

టీమిండియా సంధి దశలో ఉన్న కీలక సమయంలో గంభీర్ జట్టు కోచింగ్ బాధ్యతలు అందుకొంటున్నాడు. రోహిత్, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా లాంటి స్టార్లు టీ20 ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పడంతో.. వారి లోటును భర్తీ చేయడం గంభీర్‌కు ఇప్పుడు పెనుసవాల్‌గా మారనుంది.

సిరాజ్‌కు సీఎం సన్మానం

నజరానాగా ఇంటి స్థలం, ఉద్యోగం

హైదరాబాద్: టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన భారత జట్టులో సభ్యుడైన మహ్మద్ సిరాజ్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకొన్నాడు. ఈ సందర్భంగా సిరాజ్‌ను సన్మానించిన సీఎం.. ఆటగాడిగా దేశానికి, రాష్ట్రానికి గొప్ప పేరుప్రఖ్యాతులు తీసుకువచ్చావని ప్రశంసించారు. సిరాజ్‌కు ఇంటి స్థలంతోపాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని రేవంత్ నిర్ణయించారు. నగర పరిసరాల్లో అనువైన స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. స్థాయికి తగిన ఉద్యోగాన్ని కల్పించే ప్రక్రియను ఆరంభించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, టీమిండియా మాజీ కెప్టెన్ అజరుద్దీన్ కూడా హాజరయ్యారు.



సిన్నర్‌కు షాక్


మెద్వెదెవ్
సిన్నర్

- సెమీస్‌లో అల్కారజ్, మెద్వెదెవ్
- పాలిని, వికిక్ కూడా ● వింబుల్డన్

లండన్: వింబుల్డన్‌లో వరల్డ్ నెం:1 జానిక్ సిన్నర్‌కు షాక్ తగలగా.. స్పెయిన్ ఆటగాడు కార్లోస్ అల్కారజ్, డానిల్ మెద్వెదెవ్, ఫ్రెంచ్ ఓపెన్ ఫైనలిస్ట్ జాస్మిన్ పాలిని, అన్‌సీడెడ్ డోన్నా వికిక్ సెమీస్‌కు దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన థ్రిల్లింగ్ క్వార్టర్స్ మ్యాచ్‌లో టాప్ సీడ్ సిన్నర్ (ఇటలీ) 7-6(7), 4-6, 6-7(4), 6-2, 3-6తో మెద్వెదెవ్ (రష్యా) చేతిలో పరాజయం పాలయ్యాడు. ఐదు సెట్లపాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో మూడో సెట్‌లో సిన్నర్ చికిత్స తీసుకోవడానికి లాకర్ రూమ్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చిన అనంతరం దీటుగానే పోరాడుతూ నాలుగో సెట్ నెగ్గినా.. ఆఖరి సెట్‌లో మాత్రం చేతులెత్తేశాడు. మరో మ్యాచ్‌లో మూడో సీడ్ అల్కారజ్ 5-7, 6-4, 6-2, 6-2తో టామీ పాల్ (అమెరికా)పై విజయం సాధించాడు.

డోన్నా తొలిసారి..: అన్‌సీడెడ్ ప్లేయర్ డోన్నా వికిక్ కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్‌లోకి అడుగుపెట్టింది. మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో వికిక్ (క్రొయేషియా) 5-7, 6-4, 6-1తో లులు సున్ (న్యూజిలాండ్)పై పోరాడి నెగ్గింది. 7వ సీడ్ పాలిని (ఇటలీ) 6-2, 6-1తో నవారో (అమెరికా)ను చిత్తు చేసి ఫైనల్-4కు చేరుకొంది.

జొకోకు కోపమొచ్చింది: నొవాక్ జొకోవిచ్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. రౌండ్-16లో జొకోవిచ్ 6-3, 6-4, 6-2తో హోల్గర్ (నార్వే)పై నెగ్గాడు. అయితే, మ్యాచ్ ముగిసిన తర్వాత తనను గేలిచేసే ప్రయత్నం చేసిన ఫ్యాన్స్‌కు స్ట్రాంగ్‌గా కౌంటర్ ఇచ్చాడు. అలాంటి వారికి 'గూ...డ్ నైట్.. వెరీ గూ....డ్ నైట్' అంటూ అసహనం వ్యక్తం చేశాడు.



లెక్క సరిచేశారు..

- చెలరేగిన భారత్
- సిరీస్ 1-1తో సమం
- దక్షిణాఫ్రికా చిత్తు

చెన్నై: సిరీస్ నిర్ణాయక మ్యాచ్‌లో భారత మహిళల జట్టు అటు బంతితో.. ఇటు బ్యాటుతో కదం తొక్కింది. తద్వారా ఇప్పటికే వన్డే, టెస్టు సిరీస్‌లను దక్కించుకున్న హర్మన్ సేన మూడు టీ20ల సిరీస్‌ను సైతం 1-1తో సమం చేయగలిగింది. బలహీనంగా కనిపించిన బౌలింగ్ దళం మూడో టీ20లో జూలు విదిల్చింది. పేసర్ పూజా వస్త్రాకర్ (4/13) తన అద్భుత ఫామ్‌ను కొనసాగించగా.. స్పిన్నర్ రాధా యాదవ్ (3-1-6-3) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో వణికించింది. దీంతో సఫారీలు కనీసం వంద పరుగులు కూడా చేయలేక చతికిలపడ్డారు. అటు స్వల్ప ఛేదనలో భారత్ పది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. రెండో మ్యాచ్ వర్షంతో రద్దయిన విషయం తెలిసిందే. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 17.1 ఓవర్లలో 84 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ బ్రిట్స్ (20), బోష్ (17) మాత్రమే ఆకట్టుకున్నారు. పూజా, రాధా మిడిలార్డర్, టెయిలెండర్ల పనిబట్టడంతో 23 పరుగుల వ్యవధిలోనే ప్రత్యర్థి చివరి ఏడు వికెట్లు నేలకూలడం గమనార్హం.

ఓపెనర్లే..: స్వల్ప ఛేదనను భారత్ కేవలం 10.5 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 88 పరుగులతో ముగించింది. ఓపెనర్లు మంధాన (54 నాటౌట్), షఫాలీ (27 నాటౌట్) స్వేచ్ఛగా బ్యాట్లు ఝుళిపించారు. మంధాన ఈ మ్యాచ్‌లో అంతర్జాతీయ క్రికెట్ (అన్ని ఫార్మాట్లు)లో 7500 పరుగులు పూర్తిచేసింది. ఇక ఈ గెలుపుతో భారత జట్టు టీ20ల్లో 100 విజయాలను నమోదు చేసుకుంది. టీమిండియా మొత్తం 187 మ్యాచ్‌లాడింది.

దక్షిణాఫ్రికా: 17.1 ఓవర్లలో 84 ఆలౌట్. (బ్రిట్స్ 20, బోష్ 17; రాధా యాదవ్ 3/6, వస్త్రాకర్ 4/13)
భారత్: 10.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 88 (మంధాన 54 నాటౌట్, షఫాలీ 27 నాటౌట్)

నెదర్లాండ్స్ X ఇంగ్లండ్

నేడు 'యూరో' రెండో సెమీస్
రాత్రి 12.30 నుంచి సోనీలో..

డార్ట్‌మండ్ (జర్మనీ): యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో మరో రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. వరుసగా రెండోసారి ఫైనల్ చేరాలన్న పట్టుదలతో ఉన్న ఇంగ్లండ్.. బుధవారం అర్ధరాత్రి జరిగే రెండో సెమీస్‌లో పటిష్ఠ నెదర్లాండ్స్‌తో తలపడనుంది. కెప్టెన్ హ్యారీ కేన్ ఫిట్‌నెస్ అభిమానులను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఫేవరెట్‌గా కనిపిస్తున్నా.. ఏ సమయంలోనైనా మ్యాచ్‌ను మలుపు తిప్పగల సత్తా ఉన్న ప్లేయర్లు నెదర్లాండ్స్ జట్టులో ఉన్నారు.

కోహ్లీ పబ్‌పై కేసు!

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీకి చెందిన వన్ 8 కమ్యూన్ పబ్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. ఇక్కడి చిన్నస్వామి స్టేడియం సమీపంలో ఉండే ఈ పబ్‌ను అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా పెద్దపెద్ద సౌండ్లు పెడుతూ నిర్వహిస్తున్నారని స్థానికుల నుంచి, పోలీసుల నుంచి ఫిర్యాదులు రావడంతో పబ్ మేనేజర్‌పై కేసు నమోదైనట్టు బెంగళూరు సెంట్రల్ డీసీపీ శేఖర్ హెచ్‌టీ తెలిపారు.

ఫేవరెట్ అర్జెంటీనా

కెనడాతో 'కోపా' సెమీస్ నేడు
ఉదయం 5.30 నుంచి

న్యూయార్క్: డిఫెండింగ్ చాంప్ అర్జెంటీనా మరోసారి కోపా అమెరికా కప్ ఫైనల్‌పై గురిపెట్టింది. కెనడాతో జరిగే తొలి సెమీస్‌లో మెస్సీ సేన ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. గాయంతో బాధపడుతున్న మెస్సీ ఈ మ్యాచ్‌లో ఆడతాడని కోచ్ ప్రకటించడం అభిమానులకు ఊరటనిచ్చేదే. మరోవైపు కెనడా తొలిసారి సెమీస్‌లోకి అడుగుపెట్టింది. లీగ్ దశలో అర్జెంటీనా చేతిలో చిత్తయిన కెనడా.. ఈసారి గట్టిపోటీ ఇవ్వాలనే పట్టుదలతో ఉంది.

బిజినెస్

సూక్ష్మ రుణాలు రూ.2 లక్షలు మించొద్దు

కోల్‌కతా: సూక్ష్మ రుణ (మైక్రో ఫైనాన్స్) సంస్థలు మంజూరు చేసే రుణాలకూ పరిమితులు ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ సంస్థల నుంచి ఒక్కో రుణ గ్రహీతకు ఇచ్చే రుణాలను రూ.2 లక్షలకు పరిమితం చేయాలని ఈ సంస్థలకు ప్రాతినిధ్యం వహించే మైక్రో ఫైనాన్స్ ఇండస్ట్రీ నెట్‌వర్క్ (ఎంఎఫ్ఐఎన్) కోరింది. అలాగే వీరికి రుణాలు ఇచ్చే సూక్ష్మ రుణ సంస్థలనూ నాలుగుకు పరిమితం చేయాలని సూచించింది. కుటుంబ ఆదాయం, తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించే స్థోమత ఆధారంగానే వీరికి రుణాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. సూక్ష్మ రుణ సంస్థల నుంచి ఎడాపెడా అప్పులు తీసుకుని.. తిరిగి చెల్లించేటప్పుడు అనేక మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎంఎఫ్ఐఎన్ ఈ సూచనలు చేయడం విశేషం.

విజయ డయాగ్నోస్టిక్‌లో ఏఐ మెహ్వార్ వాటా విక్రయం

ముంబై: విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఏఐ మెహ్వార్ కమర్షియల్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎల్ఎల్‌సీ 2.2 శాతం వాటాలను రూ.176.17 కోట్లకు విక్రయించింది. మంగళవారం ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఈ వాటాను విక్రయించినట్లు ఎన్ఎస్ఈ బల్క్ డేటా గణాంకాలు వెల్లడించాయి. 2.2 శాతం వాటాలకు సమానమైన 22.50 లక్షల షేర్లను ఏఐ మెహ్వార్ విక్రయించింది. సగటున ఒక్కో షేరును రూ.738 ధరకు విక్రయించింది. విజయ డయాగ్నోస్టిక్‌లో ఏఐ మెహ్వార్‌కు 2.99 శాతం వాటా ఉంది. కాగా విజయ డయాగ్నోస్టిక్‌లో 18 లక్షల షేర్లను కోటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్ కొనుగోలు చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,200 ▼	67,100 ▼	99,000 ▼
ముంబై	72,346 ▼	66,269 ▼	91,847 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	555
వరంగల్	532	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	113
వరంగల్	105	గుంటూరు	113
కరీంనగర్	105	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	129
కర్నూలు	105	నెల్లూరు	129
విశాఖపట్నం	105	అనంతపురం	113
గోదావరి	113		

ఈక్విటీ మదుపరుల సంపద

రూ.451 లక్షల కోట్లు

● సరికొత్త రికార్డు గరిష్ఠాలకు సూచీలు ● మరో 391 పాయింట్ల లాభంతో 80,351 వద్ద ముగిసిన సెన్సెక్స్

24,400 ఎగువ స్థాయికి చేరిన నిఫ్టీ
వాహన, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు జిగేల్



ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ ఒక దశలో 436.79 పాయింట్ల వృద్ధితో 80,397.17 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును తాకి.. చివరికి 391.26 పాయింట్ల లాభంతో 80,351.64 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. నిఫ్టీ సైతం ఒక దశలో 123.05 పాయింట్లు ఎగబాకి 24,443.60 వద్ద ఇంట్రాడే రికార్డును, చివరికి 112.65 పాయింట్ల లాభంతో 24,433.20 వద్ద కొత్త గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

దీంతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ మరో రూ.1.56 లక్షల కోట్లు పెరిగి రూ.451.27 లక్షల కోట్లకు (5.41 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. దేశీయ, అంతర్జాతీయ సానుకూలతల నేపథ్యంలో ఈక్విటీ మదుపరులు వాహన, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరపడం ఇందుకు తోడ్పడింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత పెంచాయి.

- సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 21 లాభపడ్డాయి. మారుతి సుజుకీ షేరు 6.60 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎం అండ్ ఎం 2.68 శాతం, టాటా మోటార్స్ 1.24 శాతం పెరిగాయి. పర్యావరణహిత వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు హైబ్రిడ్ కార్లపై రిజిస్ట్రేషన్ పన్నును మాఫీ చేస్తున్నట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించడంతో వాహన షేర్లకు డిమాండ్ పెరిగింది.
- బ్లూచిప్‌లతో పాటు చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలోనూ కొనుగోళ్లు జరగడంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.36 శాతం, స్మాల్‌క్యాప్ 0.22 శాతం పెరిగాయి.
- రంగాలవారీ సూచీల్లో ఆటో అత్యధికంగా 2.17 శాతం పుంజుకుంది. కన్స్యూమర్ డ్యూరబుల్స్ సైతం 2 శాతం రాణించింది. రియల్టీ, కన్స్యూమర్ డిస్‌క్రెషనరీ, హెల్త్‌కేర్ సూచీలు ఒక శాతానికి పైగా పెరిగాయి.

పేటీఎంకు కీలక అనుమతి!

కష్టాల్లో ఉన్న డిజిటల్ చెల్లింపుల కంపెనీ పేటీఎంకు కొంత ఊరట లభించినట్లు తెలిసింది.. తన కీలక అనుబంధ విభాగమైన పేటీఎం పేమెంట్ సర్వీసెస్ వ్యాపారంలో రూ.50 కోట్లు ఇన్వెస్ట్‌మెంట్‌కు చైనా పెట్టుబడులను పర్యవేక్షించే ప్రభుత్వ కమిటీ అనుమతి తెలిపినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ పెట్టుబడులకు ఆర్థిక శాఖ కూడా అనుమతివ్వాల్సి ఉన్నప్పటికీ, కమిటీ నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించడంతో కంపెనీకి ప్రధాన అవరోధం తొలిగినట్లయింది. ఈ క్లియరెన్స్ కోసం పేటీఎం రెండేళ్లుగా వేచిచూస్తోంది. మరికొంత కాలంపాటు అనుమతి లభించకపోయి ఉంటే, పేటీఎం తన పేమెంట్స్ సేవల వ్యాపారాన్ని మూసివేయాల్సిన పరిస్థితి. చైనాకు చెందిన యాంట్ గ్రూప్ పేటీఎంలో పది శాతం వరకు వాటా కలిగి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ కమిటీ గతంలో ఈ పెట్టుబడి ప్రతిపాదనను పక్కన పెట్టింది.

ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి రికార్డు నిధులు

గత నెలలో రూ.40,608 కోట్లు రాక
అందులో రూ.21,000 కోట్లు సిప్

ఈ ఏడాది జూన్‌లో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్)లో ఇన్వెస్టర్లు రికార్డు స్థాయిలో రూ.40,608 కోట్ల పెట్టుబడులు పెట్టారు. మే నెలలో వచ్చిన పెట్టుబడుల కంటే ఇది 17 శాతం అధికమని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) తెలిపింది. కాగా, గత నెల క్రమానుగత పెట్టుబడి పథకాల్లోకి (సిప్) సైతం రికార్డు స్థాయిలో రూ.21,262 కోట్ల పెట్టుబడులు వచ్చాయని యాంఫీ వెల్లడించింది. మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ నిర్వహణలో ఉన్న నికర ఆస్తుల (ఏయూఎం) విలువ రూ.27.62 లక్షల కోట్లకు చేరుకుందని, అందులో సిప్‌ల ఏయూఎం రూ.12.43 లక్షల కోట్లుగా ఉందని అసోసియేషన్ పేర్కొంది. గత నెలలో 55 లక్షల కొత్త సిప్‌లు రిజిస్టర్ అయ్యాయని, దాంతో మొత్తం సిప్‌ల సంఖ్య 8.98 కోట్లకు చేరుకుందని యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని తెలిపారు.

కిమ్స్ చేతికి విశాఖ క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్

డీల్ విలువ రూ.75 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లిమిటెడ్ (కిమ్స్ హాస్పిటల్స్).. ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నంలోని క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్ (క్యూఎన్ఆర్ఐ)ను కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. క్యూఎన్ఆర్ఐ హాస్పిటల్ యజమానులైన చలసాని హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వంద శాతం వాటాలను కొనుగోలు చేయటం ద్వారా దీన్ని చేజిక్కించుకున్నట్లు వెల్లడించింది. ఈ కొనుగోలు కోసం రూ.75 కోట్ల వరకు వెచ్చించనున్నట్లు పేర్కొంది. నెల రోజుల్లో డీల్ పూర్తవుతుందని భావిస్తున్నట్లు తెలిపింది. 1995లో విశాఖలోని కీలకమైన రెసిడెన్షియల్ ప్రాంతంలో కార్యకలాపాలు ప్రారంభించిన క్వీన్స్ ఎన్ఆర్ఐ 200 పడకల సామర్థ్యంతో హాస్పిటల్‌ను నిర్వహిస్తోంది. విశాఖపట్నం లో కార్డియాలజీ, అంకాలజీ విభాగాల్లో సేవలందిస్తున్న హాస్పిటల్స్‌లో క్యూఎన్ఆర్ఐ కీలకంగా ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో క్యూఎన్ఆర్ఐ టర్నోవర్ రూ.62.60 కోట్లుగా ఉంది.

విశాఖలో రెండో హాస్పిటల్

కాగా కిమ్స్ హాస్పిటల్స్ ఇప్పటికే విశాఖలో మల్టీ-స్పెషాలిటీ హాస్పిటల్, గ్యాస్ట్రో యూనిట్‌ను నిర్వహిస్తోంది. విశాఖలో తమకు ఇది రెండో హాస్పిటల్ అని, ఈ ప్రాంతంలో శరవేగంగా వృద్ధి చెందేందుకు ఈ కొనుగోలు ఎంతగానో దోహదపడుతుందని కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ బీ భాస్కర్ రావు తెలిపారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్‌లో తమ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునేందుకు అవసరమైన అన్ని అవకాశాలను పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు. క్యూఎన్ఆర్ఐ కొనుగోలుతో విశాఖలో కిమ్స్ హాస్పిటల్స్ మొత్తం పడకల సంఖ్య 630కి చేరిందని భాస్కర్ రావు వెల్లడించారు. 2018లో ఐకాన్ హాస్పిటల్స్‌ను కొనుగోలు చేయటం ద్వారా కిమ్స్ హాస్పిటల్స్ విశాఖపట్నంలోకి అడుగుపెట్టింది.

ఓఎన్‌జీసీ రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా 2038 నాటికి తన చమురు, గ్యాస్ ఉత్పత్తి యూనిట్లలో కర్బన ఉద్గారాల విడుదలను జీరోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం దాదాపు రూ.2 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్యాస్‌ను వృథాగా మండించడానికి పూర్తిగా ఫుల్‌స్టాప్ పెట్టాలని భావిస్తోంది. దీనికి తోడు 2030 నాటికి రూ.97,000 కోట్ల పెట్టుబడితో 5,000 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు ఏర్పాటుచేయనుంది. 2035 నాటికి హరిత హైడ్రోజన్ లేదా అమ్మోనియా ప్లాంట్ల ఏర్పాటు కోసం మరో రూ.65,000 కోట్లు ఖర్చు చేయనుంది. మిగతా రూ.38,000 కోట్లు 2038 నాటికి 1,000 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉండే తీర ప్రాంత పవన విద్యుత్ కేంద్రాల ఏర్పాటు కోసం వినియోగించబోతున్నట్టు ఓఎన్‌జీసీ తెలిపింది.

రేపు ఆర్థికవేత్తలతో ప్రధాని భేటీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ గురువారం దేశంలోని ప్రముఖ ఆర్థికవేత్తలతో సమావేశం కానున్నారు. రాబోయే బడ్జెట్‌పై వారి సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 23వ తేదీన 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రతిపాదించనున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధాని నిర్వహిస్తున్న ఈ సమావేశానికి నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ, ఇతర సభ్యులు కూడా హాజరు కానున్నారు.

2023-24లో 4.7 కోట్ల ఉద్యోగాల కల్పన: ఆర్‌బీఐ

ముంబై: దేశంలోని 27 ప్రధాన రంగాల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 4.7 కోట్ల మందికి కొత్తగా ఉద్యోగాలు వచ్చాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజా నివేదికలో తెలిపింది. 2023 మార్చినాటికి దేశంలో ఉద్యోగాల్లో ఉన్న వారి సంఖ్య 59.67 కోట్లు కాగా 2024 మార్చి చివరి నాటికి వారి సంఖ్య 64.33 కోట్లకు చేరినట్టు పేర్కొంది. టార్న్‌క్విస్ట్ అగ్రిగేషన్ ఫార్ములా ప్రకారం ముందు ఏడాదితో పోల్చితే 2023-24లో ఉపాధి వృద్ధి రేటు 3.2 శాతం నుంచి 6 శాతానికి పెరిగినట్టు ఆర్‌బీఐ పేర్కొంది. పారిశ్రామిక సంస్థల స్థాయిలో ఉత్పాదకతను మదింపు చేసేందుకు ఉపయోగించే ఇండియా క్లెమ్స్ అంటే మూలధనం (కె), కార్మిక శక్తి (ఎల్), ఇంధనం (ఇ), మెటీరియల్ (ఎం), సేవల (ఎస్) డేటాబేస్ ఆధారంగా ఆర్‌బీఐ ఈ నివేదిక విడుదల చేసింది. వ్యవసాయం, వేట, అడవులు, మత్స్య రంగాలు 25.3 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నట్టు తెలిపింది. అలాగే అధిక సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్న వాటిలో అగ్రస్థానంలో నిలిచిన రంగాల్లో నిర్మాణ, వాణిజ్య, రవాణా, స్టోరేజ్ రంగాలున్నట్టు పేర్కొంది.

నియామకాల జోరు

హైదరాబాద్, విశాఖల్లో పెరగనున్న హైరింగ్

టీమ్‌లీజ్ నివేదిక వెల్లడి

ముంబై: కొలువుల మార్కెట్ కోలుకుంటోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)తో పోలిస్తే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలల్లో నియామకాలు ఆరు శాతానికిపైగా పెరగనున్నాయి. మంగళవారం విడుదలైన 'టీమ్‌లీజ్ ఎంప్లాయ్‌మెంట్ ఔట్‌లుక్ రిపోర్ట్' ఈ విషయం తెలిపింది. హైదరాబాద్‌తో సహా దేశంలోని 20 ప్రధాన నగరాల్లో 23 పరిశ్రమలకు చెందిన 1,417 కంపెనీల ప్రధాన అధికారులను ఇంటర్వ్యూ చేసి టీమ్‌లీజ్ ఈ నివేదిక రూపొందించింది. ఇంటర్వ్యూలో పాల్గొన్న కంపెనీల ప్రధాన అధికారుల్లో 56 శాతం మంది వచ్చే కొద్ది నెలల్లో మరిన్ని నియామకాలు చేపట్టబోతున్నట్టు చెప్పారు. 23 శాతం మంది ఎలాంటి నియామకాలు ఉండవని చెబితే, 21 శాతం మంది మాత్రమే ఉన్న ఉద్యోగాల్లో కోతపెట్టబోతున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లో ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో నియామకాలు, గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే 47.57 శాతం పెరుగుతాయని టీమ్‌లీజ్ అంచనా. ఇదే సమయంలో ఢిల్లీలో 53.21 శాతం, బెంగళూరులో 50.46 శాతం పెరగనున్నాయి. విశాఖలోనూ ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో నియామకాలు 15.88 శాతం పెరుగుతాయని టీమ్‌లీజ్ అంచనా. స్టార్టప్‌లు, చిన్న, మధ్య తరహా కంపెనీల్లో నియామకాలు జోరుగా పెరుగుతున్నట్టు నివేదిక తెలిపింది.

ఫిరాయింపులతో నష్టం లేదు

- వలస నేతలను ప్రజలు విశ్వసించడం లేదు
- మా పార్టీలో 12 మంది చేరితే.. 10 మంది ఓడారు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతామని మేం అనలేదు
- వారికి రెండేళ్ల సమయం ఇస్తాం.. ఆపై ఉద్యమిస్తాం
- పార్లమెంట్ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలకు ఓటెయ్యలేదు
- మీడియాతో చిట్‌చాట్‌లో హరీశ్‌రావు వ్యాఖ్యలు
- పరీక్షల వాయిదాపై సీఎంవి పరిణతిలేని వ్యాఖ్యలు: హరీశ్



న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి ఫిరాయించడం వల్ల తమకు జరిగే నష్టమేమీ లేదని ఆ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. పార్టీ మారినవారిని ప్రజలు విశ్వసించడం లేదని, గతంలో కాంగ్రెస్ నుంచి 12 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరితే.. ఇటీవలి ఎన్నికల్లో వారిలో 10 మంది ఓటమి పాలయ్యారని తెలిపారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు. "ఫిరాయింపులకు మొదట తలుపులు తెరిచింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బలవంతంగా కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. అయినా.. ఎమ్మెల్యేలు ఫిరాయించడం ద్వారా మాకు పెద్ద నష్టమేమీ ఉండదు. వలసలను ప్రజలు అంగీకరించడం లేదు. చిన్న ఆధారం ఉన్నా ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేసిన సందర్భాలున్నాయి. అలాంటిది.. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తికి కాంగ్రెస్ బీ ఫామ్ ఇచ్చి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయించడమేంటి? ఇటువంటి వాటిని సీరియస్‌గా తీసుకోవాలనుకున్నాం. అందుకే జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించాం" అని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణలో టీడీపీ బలపడితే అది బీఆర్ఎస్‌కే లాభమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది లేకపోయినా ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఆ పార్టీకి ఎంఐఎం మద్దతు కూడా ఉందన్నారు. పైగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలనే ఉద్దేశమే తమకు లేదని, కేసీఆర్ ఎప్పుడూ అలా అనలేదని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

మోదీ వర్సెస్ నాన్ మోదీ ప్రాతిపదికనే ఎన్నికలు...

పార్లమెంట్ ఎన్నికలు కేవలం మోదీ వర్సెస్ మోదీయేతరుల ప్రాతిపదికనే జరిగాయని హరీశ్‌రావు అన్నారు. ఎన్డీఏ, ఇండియా కూటముల్లో ఏదో ఒకదానిలో లేని పార్టీలకు ప్రజలు ఓట్లు వేయలేదని చెప్పారు. బీజేపీకి బీఆర్ఎస్ సహకరించిందనే కాంగ్రెస్ ఆరోపణ ముమ్మాటికీ అబద్ధమన్నారు. "మేం క్షేత్రస్థాయిలో పని చేసుకుంటూ వెళుతున్నాం. అన్ని వర్గాల ప్రజల్లోనూ కేసీఆర్ ఉంటేనే బాగుండుననే ఆలోచన మొదలైంది. అది రోజురోజుకూ ఎక్కువవుతుంది. తెలంగాణలో బీజేపీకి అవకాశమే లేదు. మళ్లీ మాకే ప్రజలు అవకాశం ఇస్తారు" అని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చడం వల్లే ఓటమి పాలయ్యారా? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు హరీశ్‌రావు నిరాకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండు సంవత్సరాలు సమయం ఇస్తామని, అప్పటికీ పనితీరు సరిగా లేకపోతే నిలదీస్తామని అన్నారు. 'బీఆర్ఎస్ పగ్గాలు హరీశ్‌రావుకు అప్పగిస్తారనే ప్రచారం జరుగుతుంది కదా?' అనే ప్రశ్నకు బదులిస్తూ, 'అవన్నీ కుటుంబంలో చిచ్చుపెట్టే ప్రచారమే తప్ప.. వాస్తవం లేదు' అని స్పష్టం చేశారు. కాగా, పరీక్షల వాయిదాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిణతి లేకుండా మాట్లాడుతున్నారని హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. రేవంత్‌ను చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందన్నారు. "నాడు గ్రూప్-2, టెట్ పరీక్షలు వాయిదా వేయాలని అభ్యర్థులు అడిగితే ప్రతిపక్షంలో ఉన్న మీరు మద్దతు తెలపలేదా? అప్పుడు సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మీరు.. ఇప్పుడెందుకు సానుకూలంగా ఆలోచించడం లేదు?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

మా హయాంలో ఫిరాయింపులు కాదు.. విలీనం చేసుకున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ.. తమ హయాంలో బీఆర్ఎస్ పార్టీలో శాసనసభాపక్షాలను విలీనం చేసుకున్నామే తప్ప.. ఒక్కో ఎమ్మెల్యేను చేర్చుకుంటూ ఫిరాయింపులకు పాల్పడలేదన్నారు. కాంగ్రెస్, టీడీపీ, బీఎస్పీ శాసనసభాపక్షాలను బీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేసుకున్నామని తెలిపారు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి తమ ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని మండిపడ్డారు. ఓవైపు రాజ్యాంగం గొప్పతనం గురించి మాట్లాడుతూ.. మరోవైపు అదే రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని అన్నారు. కర్ణాటక, గోవాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల కొనుగోలుపై బీజేపీని తప్పుబడుతూ, మరోవైపు తెలంగాణలో మాత్రం ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి పార్టీ ఫిరాయింపులకు శ్రీకారం చుట్టిందే కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు.

కాంగ్రెస్‌ను ఎండగట్టడానికే వచ్చాం..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానం అనుమతి తీసుకుని ఫిరాయింపులకు పాల్పడుతున్నారని, పాత్రధారి తెలంగాణలో ఉంటే, సూత్రధారులు ఢిల్లీలో ఉన్నారని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కాంగ్రెస్ పార్టీని జాతీయ స్థాయిలో ఎండగట్టడానికే ఢిల్లీకి వచ్చామని, మూడు, నాలుగు రోజులుగా న్యాయ, రాజ్యాంగ నిపుణులతో చర్చించామని తెలిపారు. "బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించారు. ఇంతకంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం ఇంకేం ఉంటుంది? కర్ణాటకలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రూ.50 కోట్లు ఇచ్చి బీజేపీ కొనుగోలు చేస్తోందంటూ సీఎం సిద్దరామయ్య అంటున్నారు. తెలంగాణలో మా ఎమ్మెల్యేలకు రూ.50 కోట్లు ఇస్తున్నారో? ఇంకా ఎక్కువే ఇస్తున్నారో తెలియదు. రాజ్యాంగ రక్షకుడిగా రాహుల్‌గాంధీ ఆస్కార్ అవార్డు స్థాయిలో నటిస్తున్నారు. దానం నాగేందర్‌తోపాటు విగిలిన ఐదుగురు ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేస్తారని ఆశిస్తున్నాం" అని కేటీఆర్ పేర్కొన్నారు. స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే న్యాయపోరాటం చేస్తామని, హైకోర్టులో తప్పకుండా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన చోట త్వరలోనే ఉప ఎన్నికలు రావడం ఖాయమని అన్నారు.

కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా మాట్లాడొద్దు

మీడియా సమావేశంలో 'ఆంధ్రజ్యోతి' విలేకరిపై కేటీఆర్ రుసరుసలాడారు. ఫిరాయింపుల అంశంపై మాట్లాడుతుండగా.. బీఆర్ఎస్ హయాంలో కూడా ఫిరాయింపులను ప్రోత్సహించారు కదా? అప్పుడు రాజ్యాంగం గుర్తు రాలేదా? అని 'ఆంధ్రజ్యోతి' విలేకరి ప్రశ్నించగా, 'మీరు కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా మాట్లాడుతున్నారు' అంటూ కేటీఆర్ మండిపడ్డారు.



తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఎలా చేర్చుకున్నారనే ప్రశ్నను మధ్యలోనే అడ్డుకుని 'నాతో వాగ్వాదానికి దిగొద్దు' అని కేటీఆర్ హెచ్చరించారు.

14 సీట్లలో స్వల్ప తేడాతో ఓడిపోయాం..

తెలంగాణలో అన్ని పార్టీల్లోకెల్లా అతిపెద్ద నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ తెలిపారు. అలాంటిది బీఆర్ఎస్‌లో ఆయనను కాదని పోటీ ఎందుకుంటుందని ప్రశ్నించారు. "అసెంబ్లీ ఎన్నికల్లో 14 సీట్లలో స్వల్ప తేడాతోనే ఓడిపోయాం. 1000 నుంచి 5వేల ఓట్లతోనే ఓటమి పాలయ్యాం. కానీ, ఒక్క ఓటుతో ఓడిపోయినా ఓటమే కదా? బీజేపీ అయోధ్యలో ఓడిపోయింది. ప్రశాంత్ కిషోర్ సొంతంగానే పార్టీని నడపలేకపోయారు. ఇక ఆయన పార్టీలను ఎలా గెలిపిస్తారు? తెలంగాణలో బీజేపీ ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ పార్టీయే కదా? అయినా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా ఏదో ఒక కూటమికే ప్రజలు ఓట్లు వేశారు. ఈ రెండు కూటములతో లేని పార్టీలను ప్రజలు ఆదరించలేదు. ఇప్పుడు కింద పడ్డాం.. మళ్లీ లేవాలి." అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కేంద్రంలో చంద్రబాబునాయుడు కీలక స్థానంలో ఉన్నారని, ఆయన ద్వారా తెలుగు రాష్ట్రాలకు మంచి జరిగితే స్వాగతిస్తామని అన్నారు. "రేవంత్‌రెడ్డి, చంద్రబాబు సమావేశాన్ని ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశంగానే చూడాలి. మేము ప్రతిపక్షంలో ఉన్నంతమాత్రాన రాష్ట్రం బాగుపడొద్దని మేమేందుకు అనుకుంటాం? నిధులు రావాలి.. పరిశ్రమలు రావాలి.. అభివృద్ధి జరగాలి. అయినా.. నాలుగేళ్ల తర్వాత ఏం జరుగుతుందో తెలియదు. అభివృద్ధి, సంక్షేమం వల్లే ఓట్లు వేయరని తేలిపోయింది కదా? అందుకే.. ఈ నాలుగేళ్లు మంచి జరగాలని ఆశిస్తాం" అని కేటీఆర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ఫలితాలను ఊహించలేదన్నారు. జగన్ సంక్షేమం చేసినందున గెలుస్తారని భావించాం తప్ప.. ఎవరి మీదా ప్రత్యేకంగా ప్రేమ లేదని అన్నారు. "జగన్ వ్యతిరేక ఓట్లన్నీ ఏకమయ్యాయి. అయినా.. ఆయన పార్టీకి 40 శాతం ఓట్లు వచ్చాయి. జగన్‌ను ఓడించేందుకు షర్మిలను ఒక వస్తువులా ఉపయోగించారు. అంతకువించి షర్మిలతో అయ్యేదేమీ లేదు. జగన్ హీరో.. షర్మిల జీరో" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

అహంకారం కాదు.. ఆత్మవిశ్వాసం...

కేసీఆర్‌కు, తనకు అహంకారం ఉందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. అయితే.. అది అహంకారం కాదని, ఆత్మవిశ్వాసమని చెప్పారు. తెలంగాణ అంటే పదనోళ్లు చేసే అసత్య ప్రచారన్నారు. "2014లో తెలంగాణ ఏర్పడితే ఎప్పుడైనా అహంకారం చూపించామా? ఎంతోమంది యూట్యూబ్ వేదికగా బండబూతులు తిట్టారు. ఎవరినైనా ఏమైనా అంటున్నామా? కానీ, రేవంత్ రెడ్డి చిన్న వార్త వస్తేనే తట్టుకోలేకపోతున్నారు. కేసులు పెడుతున్నారు. ఏపీలో బీఆర్ఎస్ పార్టీని పెట్టినప్పుడు తెలంగాణలో టీడీపీని నడిపితే తప్పేంటి? ప్రజాస్వామ్యంలో ఎవరు ఏ పార్టీ అయినా పెట్టొచ్చు. మేం కూడా ఏపీలో బీఆర్ఎస్ పెట్టాం. అయినా.. తెలంగాణలో టీడీపీ బలపడితే అది మాకే లాభం. హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రజలకు ఇబ్బంది కలిగిందనే ధర్నా చౌక్ తీసేశాం. తర్వాత మళ్లీ మేమే పెట్టాం. ముళ్ల కంచెలు వేసింది కిరణ్‌కుమార్ రెడ్డి. తీసింది రేవంత్‌రెడ్డి. ఇద్దరూ కాంగ్రెస్ వాళ్లే. రేవంత్‌రెడ్డి 420 హామీలు ఇచ్చారు. హనీమూన్ పీరియడ్ అయిపోయింది. ఏపీలో చంద్రబాబు అధికారంలోకి రాగానే పింఛన్ పెంచి ఇచ్చారు. మీరెందుకు ఇవ్వలేదని ప్రజలు అడుగుతారు కదా? హామీలిచ్చే ముందు ఆర్థిక పరిస్థితేంటో ఆలోచించుకోవాలి. కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలనే కవితను జైల్లో పెట్టారు. ఫాక్స్‌కాన్ త్వరలోనే పూర్తవుతుంది. ఆగస్టులో రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు" అని కేటీఆర్ తెలిపారు.

చిన్న చిన్న పొరపాట్ల వల్లే ఓటమి..

చిన్న చిన్న పొరపాట్ల వల్లే ఎన్నికల్లో తమ పార్టీ ఓటమి పాలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజా సంబంధాల విషయంలో తాము విఫలమయ్యామన్నారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. ఎమ్మెల్యేల ఫిరాయింపులు, కవిత బెయిల్ విషయంపై న్యాయ నిపుణులను కలిసినట్లు తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నామని, ఒక్కసారి ఓటమి పాలైనంత మాత్రాన బీఆర్ఎస్ పనైపోయిందనడం సరికాదని అన్నారు. ఐదేళ్ల క్రితం చంద్రబాబు పనైపోయిందన్నారని, కానీ ఇప్పుడు ఢిల్లీ అంతటా చంద్రబాబు ఫ్లెక్సీలే కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఎప్పుడేం జరుగుతుందో చెప్పలేమన్నారు. బీజేపీ 302 సీట్ల నుంచి 240 సీట్లకు పడిపోయిందని గుర్తు చేశారు. "దాచుకోవడానికేం లేదు. కొన్ని విషయాల్లో చిన్న చిన్న పొరపాట్లు చేశాం. మాకు ఓట్లు వేయకపోవడం ప్రజల తప్పు కాదు. కొన్ని విషయాల్లో మేం చేసింది ప్రజలకు చెప్పుకోలేకపోయాం. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చడం వల్ల పెద్దగా ప్రభావం పడలేదనుకుంటున్నాం" అని కేటీఆర్ తెలిపారు.

ఫిరాయింపులపై మాట్లాడే అర్హత కేటీఆర్‌కు ఉందా?

- త్వరలో సీఎల్పీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విలీనం: మధుయాష్కీ

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఫిరాయింపులపై మాట్లాడే అర్హత కేటీఆర్‌కు ఉందా అంటూ టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ప్రశ్నిచారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ఆయన నీతి ఏమైందని ప్రశ్నించారు. మంగళవారం తన నివాసంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారం చేతిలో ఉందన్న అహంకారంతో ప్రతిపక్ష పార్టీలను చీల్చి, రాజకీయాల్లో విలువలను దిగజార్చిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది రోజులు గడవక ముందే ప్రభుత్వం కూలిపోతుందంటూ కేసీఆర్, కేటీఆర్ బెదిరింపు మాటల కారణంగానే తమ పార్టీలో చేరేందుకు వస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఆహ్వానించాల్సి వస్తోందన్నారు. త్వరలోనే సీఎల్పీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విలీనం ఖాయమని ఆయన చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు యువరాజుగా ఉన్న కేటీఆర్.. అధికారం పోయాక తికమకగా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. అసలు పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించింది బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలేనని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబంపై విరక్తి చెందే స్వేచ్ఛ కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరుతున్నారని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షను లక్షలాది మంది రాస్తున్నారని, 5 వేల మంది కోసం ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చడం కుదరదు కదా అని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులకు ఏం చేశారో చర్చకు సిద్ధమా అంటూ కేటీఆర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్ విసిరారు. బీఆర్ ఎస్ హయాంలో 5089 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తే.. తమ ప్రభుత్వం ఆ పోస్టులను 11062కి పెంచి మెగా డీఎస్సీ ప్రకటించిందని పేర్కొన్నారు. నిరుద్యోగుల ముసుగులో కేటీఆర్ చేస్తున్న చిల్లర రాజకీయాలను ఆపాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు.

ప్రజాపాలనలో భాగమయ్యేందుకే కాంగ్రెస్‌లోకి వలసలు: అయిలయ్య



హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): "పార్టీ ఫిరాయింపులను మొదలు పెట్టిందే బీఆర్ఎస్. కేటీఆర్ ఏ మొహం పెట్టుకుని ఢిల్లీలో ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడుతున్నడు? కాంగ్రెస్ ప్రజాపాలన, సంక్షేమ కార్యక్రమాలు చూసి.. వాటి లో భాగస్వాములయ్యేందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరుతున్నరు. అభివృద్ధిని కాంక్షిస్తూ వస్తున్నారే తప్ప.. గతంలో బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేల్లాగా డబ్బులకు కక్కుర్తి పడి చేరట్లేదు" అని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య వ్యాఖ్యానించారు. అసెంబ్లీ మీడియా హాల్లో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంలో దందాలు, కాంట్రాక్టుల కోసం ఇతర పార్టీల ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరితే.. నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజాపాలన, సంక్షేమ పథకాలు చూసి కాంగ్రెస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ గ్రామాల్లో తిరిగే మొహం లేకనే కేటీఆర్, హరీశ్‌రావు ఢిల్లీ బాట పట్టారన్నారు.

ఏడు నెలలైనా హామీల అమలేది?

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. మహిళలను వంచించిన కాంగ్రెస్ సర్కారుపై 'నారీ భేరీ' పేరుతో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. డిసెంబరు 9 తర్వాత సోనియమ్మ రాజ్యం వస్తుందని, రైతుల అప్పులన్నీ మాఫీ చేస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పారన్నారు. కానీ, అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఆ హామీలు అమలు చేయకపోవడంతో అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ మాదిరిగానే పాలిస్తోందన్నారు. కాంగ్రెస్ నేతలు తెలంగాణ ప్రజల్ని దోచుకుంటున్నారని, ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని, రేవంత్‌రెడ్డి వచ్చాక డబ్బుల కోసం ఒత్తిడి చేస్తున్నారని, బెదిరింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు ప్రతినెలా 2500 ఆర్థిక సహాయం, యువతులకు స్కూటీలు, రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అంటూ ఇచ్చిన హామీలు కలగానే మిగిలిపోయాయని, ఇప్పటి వరకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి మహిళకు రూ.20 వేలు బాకీ పడ్డారని తెలిపారు. కల్యాణలక్ష్మి లేదని.. తులం బంగారం ఇవ్వలేదని, పింఛన్లపై అతీగతీ లేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి అన్ని ప్రభుత్వ, లిటిగేషన్ భూములు అమ్మే పనిలో పడ్డారన్నారు. కేసీఆర్ పదేళ్లపాటు రేషన్‌కార్డులు ఇవ్వలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ కూడా ఇవ్వడంలేదని చెప్పారు. మాదకద్రవ్యాలను నిర్మూలిస్తామని చెబుతున్న రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో బెల్టు షాపులను ఎత్తివేస్తామన్న హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేంతవరకు వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. తెలంగాణ బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 200 రోజులు పూర్తయినా, వంద రోజుల్లో ఇస్తామన్న హామీలే అమలు కాలేదని చెప్పారు. హామీల అమలు కోసం భవిష్యత్తులో తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమ మాట్లాడుతూ.. 1200 మంది మహిళల కడుపు కోతతో తెలంగాణ వచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణలో మహిళలపై అఘాయిత్యాలు గతంలో కంటే 12 శాతం పెరిగిపోయాయని, ఇప్పటివరకు మహిళా కమిషన్ లేకపోవడం దారుణమని ఆమె పేర్కొన్నారు.



మహిళామోర్చా నేతలు, కార్పొరేటర్లతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాంగ్రెస్ వైఫల్యాలపై పోరుబాట

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పోరాటాలు ఉధృతం చేయాలని బీజేపీ నిర్ణయించింది. ఇందుకోసం ఉద్యమ కమిటీలు ఏర్పాటు చేయనుంది. కాంగ్రెస్ పార్టీ రైతులు, యువత, మహిళా డిక్లరేషన్‌లు ప్రకటించిన కేంద్రాల్లో భారీ నిరసన సభలు నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలుత రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్‌లో పెద్దఎత్తున సభ నిర్వహించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, ధరణిలో జరిగిన అక్రమాలకు సంబంధించిన కేసులతో పాటు ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని పార్టీ నిర్ణయించింది. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన పదాధికారుల సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. కాగా, రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ల వద్ద బుధవారం రైతు సత్యాగ్రహం నిర్వహించాలని నిర్ణయించినట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు.

డీఎస్సీ, గ్రూప్-2 పరీక్షల మధ్య వ్యవధి ఉండేలా చూడండి

- అప్పుడే అభ్యర్థులకు న్యాయం
- టీజీపీఎస్సీ కమిషనర్‌ను కోరిన కోదండరాం, హరగోపాల్



హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ గ్రూప్-2 పరీక్షల మధ్య వ్యవధి ఉండేలా చూడాలని టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డిని టీజేఎస్ అధినేత కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్ కోరారు. అప్పుడే అభ్యర్థులకు న్యాయం జరుగుతుందన్నారు. డీఎస్సీ వాయిదా కోసం ఆందోళనల నేపథ్యంలో మంగళవారం కోదండరాం, హరగోపాల్ మహేందర్‌రెడ్డిని కలిశారు. ఆ వివరాలను కోదండరాం ఓ ప్రకటనలో వెల్లడించారు. పోటీ పరీక్షల అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తాను, హరగోపాల్.. కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పోస్టులు మళ్లీ వస్తాయో రావోనని వారిలో నెలకొన్న భయాన్ని, ఇప్పుడున్న పరిస్థితుల్లో పరీక్ష రాయడానికి ఉన్న ఇబ్బందులను చెప్పినట్లు తెలిపారు. గ్రూప్-1 పరీక్షలో నిష్పత్తిని 1:100కు పెంచాలని అభ్యర్థులు అడిగిన విషయాన్నీ చైర్మన్ దృష్టికి తెచ్చారని, పెంచడానికి గల అవకాశాలు పరిశీలించాలని గట్టిగా కోరారని వెల్లడించారు. హరగోపాల్‌తో పాటు తానూ ఈ విషయాలపై మాట్లాడానన్నారు. దీనిపై కూలంకుషంగా చర్చించి.. ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని చైర్మన్ తమకు చెప్పారన్నారు. విద్యార్థి, నిరుద్యోగుల సమస్యలపై తాము క్రియాశీలకంగానే స్పందిస్తున్నామని, సమస్యల స్వభావం... తీవ్రతనుబట్టి ఎప్పటికప్పుడు స్పందిస్తూనే ఉన్నామని చెప్పారు.

విలువల గురించి బావాబామ్మర్దులు మాట్లాడటమా?

తలసానికి మంత్రి పదవి ఎలా ఇచ్చారు?: రఘునందన్‌రావు

గజ్వేల్, జూలై 9: రాజకీయాల్లో విలువల గూర్చి బావా బామ్మర్దులు (హరీశ్, కేటీఆర్) మాట్లాడడం విడ్డూరంగా ఉందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఓటరు కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర రాజకీయాల్ని భ్రష్టు పట్టించిన బావాబామ్మర్దులు.. ఇప్పుడు ఫిరాయింపులపై సన్నాయి నొక్కులు నొక్కడం సిగ్గుచేటన్నారు. కేటీఆర్.. భారత రాజ్యాంగాన్ని చదువుకోవాలని కాంగ్రెస్ నాయకులకు చెబుతున్నారని, టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మంత్రి పదవి ఇచ్చిన విషయం మరచిపోయారా అని ప్రశ్నించారు.

ఎంపీ ఈటల ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్

హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ఈటల రాజేందర్‌కు చెందిన ఫేస్‌బుక్ ఖాతాను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. అగంతకులు వారు అడిగినంత డబ్బివ్వకపోతే అందులోని సమాచారాన్ని దుర్వినియోగం చేస్తామని బెదిరిస్తున్నారని ఈటల అనుచరులు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వందల యూఎస్ డాలర్లు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. ఈటల ఫేస్‌బుక్ ఖాతాకు సంబంధించి పూర్తి సాంకేతిక వివరాలు సేకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెమలి కూర తక్కువ వేశారని గుస్సా

- తోటి సెక్యూరిటీ గార్డులతో వ్యక్తి గొడవ

రామచంద్రాపురం, జూలై 9: నెమలి కూరతో చేసుకున్న విందులో.. ముక్కలు తక్కువ రావడంతో ఓ వ్యక్తి గుస్సా అయ్యాడు. కలత చెందిన అతడు.. తన బాధను పలువురు గ్రామస్థులకు చెప్పుకున్నాడు. ఇంకేముంది.. ఆ నోటా ఈ నోటా ఊరంతా పాక్కి.. నెమళ్లను చంపి భోంచేసిన విషయం బట్టబయలైంది. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం కొల్లూరులోని సాగు భూములను కొందరు రియల్టర్లు కొనుగోలు చేసి అక్కడ ప్రహరి ఏర్పాటు చేశారు. గదులు నిర్మించి సెక్యూరిటీ సిబ్బందిని నియమించారు. అక్కడ కావలి కాస్తున్న సెక్యూరిటీ గార్డులు ఆ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో తిరుగుతున్న నెమళ్లపై కన్నేశారు. జూన్ 30న రెండు నెమళ్లను చంపి, వండుకుని తిన్నారు. అయితే, ఆ విందులో చిన్న గొడవ జరిగింది. తనకు ముక్కలు తక్కువ వేశారని ఓ సెక్యూరిటీగార్డు సాటివారితో గొడవ పడ్డాడు. అదే రోజు అతడు పనిమానేసి వెళ్లిపోయాడు. విషయం గ్రామస్థులకు తెలియడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. దీనిపై కొల్లూరు సీఐ రవీందర్‌ను సంప్రదించగా.. నెమళ్లను చంపిన విషయమై ఎవరూ ఫిర్యాదు చేయలేదని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రేటర్‌లో జోరందుకున్న 'రియల్' రంగం

- ఏడు నెలల్లో రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.4670.52 కోట్లు

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రియల్ ఎస్టేట్ రంగం జోరందుకుంది. గత ఏడు నెలల వ్యవధిలో భవనాలు, లేఅవుట్ల అనుమతులు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లలో వృద్ధి కనిపిస్తోంది. ఎన్నికల కోడ్ వల్ల సుమారు మూడు నెలల పాటు ఆర్థిక లావాదేవీలు మందకొడిగా సాగినా.. గతంతో పోలిస్తే స్థిరాస్థి రంగం కొంత ఊపందుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత హెచ్ఎండీఏ పరిధిలో రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం పెరిగిందని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. 2023 డిసెంబరు నుంచి 2024 జూన్ వరకు గ్రేటర్ పరిధిలో స్థిరాస్థి ద్వారా ప్రభుత్వానికి రూ.4670.52 కోట్లు ఆదాయం వచ్చింది. ఏడు నెలల వ్యవధిలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో గతంలో కంటే రూ.241.29 కోట్ల ఆదాయం పెరిగింది. 2023 మే నుంచి డిసెంబరు వరకు వచ్చిన ఆదాయం పరిశీలిస్తే రూ.4429.23 కోట్లు ఉంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టు, మెట్రో రైలు విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ ప్రతిపాదనలు రియల్ ఎస్టేట్ పురోగతికి కారణమని మార్కెట్ విశ్లేషకులు, స్థిరాస్థి వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందు జూన్ నుంచి ఏడు నెలల వ్యవధిలో 1,93,962 రిజిస్ట్రేషన్లు జరగ్గా, గత ఏడు నెలల వ్యవధిలో.. డిసెంబరు నుంచి ఈ ఏడాది జూన్ వరకు మొత్తం 2,18,160 రిజిస్ట్రేషన్లు జరిగాయి. గతేడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల వృద్ధి రేటు సుమారు 12.5% ఉంది.

డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలి

- ఓయూలో అర్ధరాత్రి పెద్ద ఎత్తున అభ్యర్థుల ఆందోళన
- మూడు నెలల సమయమివ్వాలని డిమాండ్
- లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిక

తార్నాక, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18న నిర్వహించనున్న డీఎస్సీ పరీక్షను 3 నెలల పాటు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ డీఎస్సీ అభ్యర్థులు సోమవారం అర్ధరాత్రి ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. అంతకుముందు సిటీ కళాశాల నుంచి ర్యాలీగా చేరుకున్న అభ్యర్థులు ఆర్ట్స్ కాలేజీ ముందు బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎస్సీ అభ్యర్థులు మాట్లాడుతూ.. టెట్ పరీక్షను నిర్వహించి నెల రోజులు కాకముందే డీఎస్సీ పరీక్షను నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సిలబస్ ఎక్కువగా ఉండటం వల్ల డీఎస్సీ పరీక్షకు సిద్ధం కావడానికి కనీసం 90 రోజుల సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 లక్షల మంది డీఎస్సీ అభ్యర్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని కోరారు. ఇటీవలే వరుసగా గ్రూప్ 1 ప్రిలిమ్స్, డీఏఓ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ తదితర పరీక్షలకు హాజరయి తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్న తాము, మరో పది రోజుల్లో డీఎస్సీ పరీక్ష ఉండటం వల్ల మరింత మానసిక ఒత్తిడికి గురికావల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని, లేదని మొండి వైఖరితో వ్యవహరిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.



డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ అర్ధరాత్రి ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా వాయిదా వేయాలి

విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ పరీక్షను 3 నెలల పాటు వాయిదా వేయాలి. డీఎస్సీ సిలబస్ ఎక్కువగా ఉండటం వల్ల పరీక్షకు సిద్ధం కావడానికి అభ్యర్థులకు కనీసం 90 రోజుల గడువు కావాలి. ఇటీవలే వరుసగా గ్రూప్ 1 ప్రిలిమ్స్, డీఏఓ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, టెట్ పరీక్షలకు హాజరయి తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నాం. ఇదే విషయాన్ని మంత్రుల ద్వారా, సంబంధిత అధికారుల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడానికి యత్నించాం. అయినప్పటికీ ముఖ్యమంత్రి మాకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు. తప్పని పరిస్థితుల్లో తాము ఆందోళన బాట పట్టవలసి వచ్చింది.

-ఎర్రబెల్లి మనోహర్ రావు, డీఎస్సీ అభ్యర్థి

టెట్‌ను నిర్వహించి నెలరోజులు కాకముందే డీఎస్సీ పరీక్షా..

టెట్ పరీక్షను నిర్వహించి నెల రోజులు కాకముందే డీఎస్సీ పరీక్షను నిర్వహించడం దారుణం. డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని ఆందోళన చేస్తున్న మాపై ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవరించి దురుసుగా ప్రవరిస్తున్నది. డీఎస్సీ అభ్యర్థుల న్యాయబద్ధమైన డిమాండ్‌ను నెరవేర్చేదిశగా ప్రభుత్వం కృషి చేయాలి. అలాకాకుండా విద్యార్థుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తే భవిష్యత్‌లో విద్యార్థులంతా కలిసి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతాం.

- కేశవ్, డీఎస్సీ అభ్యర్థి

అవసరమైనన్ని ఎరువులు ఇస్తాం: నడ్డా

» మంత్రి తుమ్మల లేఖకు కేంద్ర మంత్రి స్పందన



హైదరాబాద్, జులై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా డీఏపీ, యూరియా, ఇతరత్రా ఎరువుల కేటాయింపులు చేస్తామని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా స్పష్టం చేశారు. రాష్ట్రానికి ఎరువుల కోటా కేటాయింపులు పెంచాలని ఇటీవల వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి లేఖ రాసిన విషయం విదితమే. ఆ లేఖపై కేంద్ర మంత్రి నడ్డా స్పందించారు. ఏప్రిల్, మే నెలల్లో డీఏపీ అవసరం 1.12 లక్షల మెట్రిక్ టన్నులుండగా... 43 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్రానికి వచ్చిందని, అందుకనే జూలైలో 80 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ సరఫరా చేయాలని తుమ్మల కోరారు. కేంద్ర మంత్రి నడ్డా బదులిస్తూ... ఎప్పటికప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఎరువుల నిల్వలపై నివేదికలు తెప్పించుకుంటున్నామని, రైతుల అవసరాలకు అనుగుణంగా పంపిణీ చేస్తామని, నిరంతరం సమీక్ష చేస్తున్నట్లు పేర్కొన్నారని మంత్రి తుమ్మల నేడొక ప్రకటనలో తెలిపారు.

హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

» త్వరలో మారియట్ ఇంటర్నేషనల్ గ్రూప్‌తో ఒప్పందం

» 300 కోట్ల పెట్టుబడి.. వెయ్యి ఉద్యోగాలు: శ్రీధర్‌బాబు



హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో మారియట్ ఇంటర్నేషనల్ గ్రూప్.. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ప్రారంభించనుంది. దీనికోసం త్వరలోనే తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోనుంది. దీని ద్వారా రూ. 300 కోట్ల నుంచి రూ. 400 కోట్ల మేరకు పెట్టుబడి రాష్ట్రానికి రానుందని, వెయ్యిమంది వరకు ఉద్యోగ అవకాశాలు పొందుతారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వివిధ సంస్థలతో రూ. 50 వేల కోట్ల మేరకు పెట్టుబడి ఒప్పందాలు జరిగాయని, ఈ ఒప్పందాలతో రానున్న రెండేళ్లలో 20 నుంచి 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయని వెల్లడించారు.

రిజిస్ట్రేషన్లకు అనుమతించండి

» ప్రభుత్వానికి తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ వినతి

గత ప్రభుత్వం సర్క్యులర్ 257 ద్వారా గ్రామ పంచాయతీ లే అవుట్లలో కొత్త రిజిస్ట్రేషన్లు నిలిపివేసిందని, దీని వల్ల రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇబ్బంది పడుతున్నారని, రిజిస్ట్రేషన్లకు అనుమతించాలని ఆయన తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ తరఫున రిజిస్ట్రేషన్‌శాఖ ఐజీకి వినతి పత్రం అందజేశారు. 257 సర్క్యులర్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వోగా శ్రీధర్



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారిగా ఎ.శ్రీధర్ సికింద్రాబాద్ రైల్‌నిలయం కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్(ఐ.ఆర్.టి.ఎస్)2011 బ్యాచ్‌కి చెందిన శ్రీధర్ సీపీఆర్‌వోగా నియామకానికి ముందు దక్షిణ మధ్య రైల్వేలో డిప్యూటీ జనరల్ మేనేజర్(జనరల్)గా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు ముఖ్య ప్రజా సంబంధాల అధికారిగా పనిచేసిన సీహెచ్. రాకేష్ దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్(ట్రాఫిక్-ఆర్‌పీఎ)గా బదిలీ అయ్యారు. సీపీఆర్‌వో ఎ. శ్రీధర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ పూర్తిచేశారు. గతంలో సికింద్రాబాద్ డివిజన్‌లో భద్రాచలం, రామగుండం ఏరియా ఆఫీసర్‌గా, హైదరాబాద్, సికింద్రాబాద్, నాందేడ్ డివిజన్లలో కమర్షియల్, ఆపరేషన్స్ మేనేజర్‌గా పలు బాధ్యతలు నిర్వహించారు.

ఎస్ఆర్ 2023 బ్యాచ్ డాక్టర్లకు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల్లో అవకాశం

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిజేస్తున్న సీనియర్ రెసిడెంట్(ఎస్ఆర్) 2023 బ్యాచ్ డాక్టర్లుకు కొత్తగా ఇచ్చే రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తూ ప్రభుత్వ జీవో జారీ చేసింది. ఈమేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 630 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 8 కొత్త మెడికల్ కాలేజీల్లోనే 200 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల ఖాళీలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేయనుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటే నోటిఫికేషన్ వెలువడే నాటికి అభ్యర్థులు ఎస్ఆర్‌షిప్ పూర్తి చేసి ఉండాలి. ఇప్పటికే ఎస్ఆర్‌గా పనిచేస్తున్న ఎస్ఆర్ 2023 బ్యాచ్‌కు త్వరలో చేపట్టబోయే రిక్రూట్‌మెంట్‌లో అవకాశం కల్పించాలని, ఆగస్టు చివరి నాటికి ఈ బ్యాచ్ ఎస్ఆర్‌షిప్ పూర్తవుతుందని సర్కారును తెలంగాణ సీనియర్ డాక్టర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. దానిపై ప్రభుత్వం ఓ కమిటీ వేసి, దాని నివేదిక ఆధారంగా తాజా జీవో చేసింది.

3 ఇంజనీరింగ్ కాలేజీలకు ఆఫ్ క్యాంపస్‌లు

» ఏఐసీటీఈ అనుమతులు జారీ

హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మూడు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు హైదరాబాద్ నగరంలో ఆఫ్ క్యాంపస్‌లు ఏర్పాటు చేసుకునేందుకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) అనుమతి ఇచ్చింది. కళాశాల ప్రాంగణంలో కాకుండా బయట మరో ప్రాంతంలో కళాశాల ఏర్పాటు చేసి తరగతులు నిర్వహించడాన్ని ఆఫ్ క్యాంపస్ అంటారు. దీనికోసం రాష్ట్రం నుంచి ఆరు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు మార్చిలో దరఖాస్తు చేసుకున్నాయి. వీటిలో మూడు కళాశాలలకు అనుమతి లభించింది. మహబూబ్‌నగర్‌లోని జయప్రకాశ్ నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ బాచుపల్లిలో, శంషాబాద్‌లోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీ కోకాపేట్‌లో, ఘట్‌కేసర్‌లోని విజ్ఞానభారతి ఇంజనీరింగ్ కాలేజీ హిమాయత్‌నగర్‌లో ఆఫ్ క్యాంపస్‌ల ప్రారంభానికి సిద్ధమయ్యాయి. అయితే, ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల పెంపు అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ అనుమతి లభిస్తే ఈ విద్యా సంవత్సరం నుంచి ఆయా కళాశాలల ఆఫ్ క్యాంపస్‌ల్లో ప్రవేశాలు ప్రారంభమవుతాయని జేఎన్‌టీయూ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

ఫీజు కట్టాలని 1.30 లక్షలిస్తే బెట్టింగ్‌లో పోగొట్టుకొని విద్యార్థి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఘట్‌కేసర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాలేజీ ఫీజు కట్టేందుకు తల్లి ఇచ్చిన డబ్బును బెట్టింగ్‌లో పెట్టి.. అంతా పోగొట్టుకున్నాక ఇంట్లోవారు మందలిస్తారేమోనన్న ఆందోళనతో బీటెక్ విద్యార్థి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. నల్లగొండ జిల్లా రవీంద్రనగర్‌కు చెందిన కొండూరు శ్రీనివాస్ కుమారుడు నితిన్(21) భువనగిరిలో అద్దెకు ఉంటూ ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీలో ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజు చెల్లించేందుకు తల్లి రూ.1.30 లక్షలు నితిన్‌కు ఇచ్చింది. ఈ డబ్బంతా అతడు బెట్టింగ్‌లో పెట్టి కొద్ది గంటల్లోనే పోగొట్టుకున్నాడు. అటు కాలేజీకి వెళ్లకుండా.. ఇటు పోగొట్టుకున్న డబ్బు గురించి తల్లిదండ్రులకు చెప్పలేక మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్సు రైలు కింద పడ్డాడు. ఈ ఘటనలో నితిన్ శరీరం పూర్తిగా ఛిద్రమైపోయింది. మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదైంది.

జాతీయ రహదారులకు అడ్డంకులు రానీయం

» భూసేకరణ, ఇతరత్రా సమస్యల పరిష్కారం

» ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి సహకరించండి

» ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సీఎం రేవంత్

హైదరాబాద్, జులై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ సహకారం పూర్తిగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. రోడ్ల పనులకు ఏవైనా ఆటంకాలు ఏర్పడితే వాటిని తొలగిస్తామని స్పష్టంచేశారు. మంగళవారం తనను కలిసిన ఎన్‌హెచ్ఏఐ (భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ) ఉన్నతాధికారులకు ఆయన ఈ హామీలు ఇచ్చారు. సీఎం నివాసంలో జరిగిన ఈ భేటీలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు సభ్యులు అనిల్ చౌదరి, ఆర్అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, సీఎంవో కార్యదర్శి షానవాజ్ ఖాసీం పాల్గొన్నారు. ఎన్‌హెచ్ఏఐ చేపడుతున్న రహదారుల నిర్మాణంలో తలెత్తుతున్న భూ సేకరణ, ఇతర సమస్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఇబ్బందులను పరిష్కరించటానికి బుధవారం సెక్రటేరియట్‌లో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమస్యలపై అక్కడికక్కడే చర్చించి పరిష్కరించుకుందామని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్, మన్నెగూడ రహదారి పనులను వెంటనే మొదలుపెట్టాలని ముఖ్యమంత్రి ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సూచించారు. కాంట్రాక్టు సంస్థతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు మొదలుపెట్టాలని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న రీజినల్ రింగు రోడ్డు నిర్మాణానికి సహకరించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను కోరారు. ఔటర్ రింగురోడ్డు, రీజినల్ రింగురోడ్డు మధ్యలో 12 రేడియల్ రోడ్లు వస్తాయని సీఎం తెలిపారు. తెలంగాణకు తీరప్రాంతం లేనందున డ్రైపోర్టును ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకోసం బందరు పోర్టును అనుసంధానం చేసేలా హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపట్టాలని సూచించారు. హైదరాబాద్- కల్వకుర్తి జాతీయ రహదారి పనులు మొదలుపెట్టాలన్నారు. రాష్ట్రంలో రహదారుల నిర్మాణ పురోగతిపై ప్రతివారం నివేదిక ఇవ్వాలని సీఎంవో కార్యదర్శి షానావాజ్‌ను రేవంత్ ఆదేశించారు.

ఎన్‌హెచ్ఏఐ లేవనెత్తిన అంశాలు

1. మంచిర్యాల- వరంగల్- ఖమ్మం- విజయవాడ (ఎన్‌హెచ్- 163 జీ) కారిడార్ నిర్మాణానికి భూములను అప్పగించాలి.
2. ఆర్మూర్- జగిత్యాల-మంచిర్యాల (ఎన్‌హెచ్- 63) భూసేకరణకు ప్రజాభిప్రాయం సేకరించాలి.
3. వరంగల్- కరీంనగర్ (ఎన్‌హెచ్- 563) రహదారి నిర్మాణానికి మట్టి, ఫ్లై యాష్ సేకరించాలి.
4. ఎన్‌హెచ్- 44లో కాళ్లకల్- గుండ్లపోచంపల్లి రహదారి ఆరు వరుసల విస్తరణకు భూసేకరణ చేపట్టాలి.
5. జాతీయ రహదారుల నిర్మాణంలో విద్యుత్ సంస్థలతో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలి.
6. ఖమ్మం- దేవరపల్లి, ఖమ్మం- కోదాడ రహదారుల నిర్మాణంలో పోలీస్ భద్రత కల్పించాలి.

ఏడాదిన్నరలో 'పాలమూరు' పూర్తి

గ్రీన్ చానల్ ద్వారా నిధులు.. పనులపై ప్రతి నెలసమీక్ష.. 14 లేదా 15న నీటిపారుదల మంత్రితో మళ్లీ సమావేశం

» బడుల పరిశుభ్రత బాధ్యత అమ్మ ఆదర్శ కమిటీలకు..

» అధికారులతో సీఎం రేవంత్



మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో మొక్కను నాటుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూలై 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను 18 నెలల్లోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి విఎనహా.. 2025 చివరికల్లా కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన పనులన్నీ ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భూ సేకరణ, పరిహారం, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సూచించారు. కొత్త ప్రతిపాదనలను న్యాయపరమైన వివాదాలకు తావులేకుండా రూపొందించాలని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం పర్యటించిన సీఎం రేవంత్.. కలెక్టరేట్ వద్ద వన మహోత్సవంలో భాగంగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి కలెక్టరేట్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించి స్టాళ్లను సందర్శించారు. మహబూబ్‌నగర్, దేవరకద్ర, పరిగి నియోజకవర్గాల్లో చేపట్టనున్న రూ.396 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. 3,680 మహిళా సంఘాలకు రూ.334.02 కోట్ల చెక్కును అందజేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఎత్తిపోతల పథకాలపై క్షేత్ర పర్యటన చేసి.. కార్యాచరణ రూపొందించి 14 లేదా 15వ తేదీన నీటి పారుదల మంత్రితో నిర్వహించే సమావేశం నాటికి అందజేయాలని కోరారు. నిధుల మంజూరు, సాంకేతిక అంశాలపై తుది అనుమతి ఇస్తామని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన పనుల పూర్తికి గ్రీన్ చానల్ ద్వారా నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రతి నెల ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తానని, అధికారులు కూడా సమీక్షించి సూక్ష్మస్థాయి నివేదికను తయారు చేసుకోవాలన్నారు. మండలం, గ్రామాల వారీగా ఆయకట్టు వివరాలను రూపొందించాలని సూచించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదాకు ప్రయత్నిస్తానని చెప్పారు. "పార్లమెంటు స్థానం యూనిట్‌గా నైపుణాభివృద్ధి కేంద్రం, మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయా లేదా? అనే వివరాలు సమర్పించండి. జిల్లా, మండల విద్యాధికారులు రోజుకు అరపూట తనిఖీలకు వెళ్లాలి. కలెక్టర్ వారానికి ఒకసారి ఆస్పత్రులు, పాఠశాలలను తనిఖీ చేయాలి. ఏ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోయినా చర్యలు తీసుకోవాలి. సచివాలయం నుంచి పంచాయతీ వరకు ముఖ గుర్తింపుతో హాజరు శాతం పరిశీలిస్తాం. నేను కూడా ఆకస్మిక తనిఖీలు చేస్తా" అని రేవంత్ తెలిపారు.

పైరవీలు లేకుండా ఉద్యోగుల బదిలీలు

పైరవీలు లేకుండా పదోన్నతులు, బదిలీలు చేపట్టామని, ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని సీఎం రేవంత్ కోరారు. పాఠశాలల్లో పరిశుభ్రత బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పాలమూరులో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టి, సత్ఫలితాలు వస్తే రాష్ట్రవ్యాప్తం చేస్తామన్నారు. గ్రామల్లో పిల్లలను బడికి తీసుకొచ్చే బాధ్యతను మహిళా సంఘాలు తీసుకోవాలని కోరారు. అన్ని పంచాయతీల్లో ప్రభుత్వ పాఠశాలలు, మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలలు, నియోజకవర్గాల్లో కనీసం డిగ్రీ కళాశాలలు ఉండాలని, లేకపోతే పరిశీలించి నివేదిక ఇస్తే ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదన్నారు. గ్రామీణ వైద్యులకు ప్రోత్సాహకాలు అందజేసే విషయమై ఆలోచనలు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. అన్ని మండల కేంద్రాల్లో పీహెచ్‌సీలు, నియోజకవర్గంలో ఏరియా ఆస్పత్రులు ఉండాలని, లేకుంటే పరిశీలించి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆస్పత్రులు, నర్సింగ్ కళాశాలలపై వివరాలు సమర్పించాలని సూచించారు. ఆస్పత్రులు, వైద్య కళాశాలలు ఒకేచోట ఉండకూడదని అన్నారు. అత్యంత వెనుకబడిన మహబూబ్‌నగర్ జిల్లాలో వైద్యారోగ్య శాఖలోని సమస్యలపై అధ్యయనం చేయాలని, వాటి పరిష్కారాన్ని ఇక్కడినుంచే పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని పేర్కొన్నారు.

రైతు భరోసాపై ఉమ్మడి జిల్లాల వారీగా

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

» మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా అమలు కోసం, విధివిధానాల రూపకల్పనకు ప్రభుత్వం నిర్ణయం

» 23వ తేదీ వరకు జిల్లాల్లో పర్యటించనున్న భట్టి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, జులై 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు విధివిధానాలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం బుధవారం నుంచి ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోనుంది. భట్టితో పాటు మంత్రివర్గ ఉపసంఘంలోని సభ్యులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు ఈ నెల 23వ తేదీ వరకు పాత ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ప్రజాభిప్రాయ సదస్సు(వర్క్‌షాప్)ల్లో పాల్గొననున్నారు. వర్క్‌షాప్‌ల నిర్వహణపై భట్టి విక్రమార్క మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రైతుభరోసా పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అన్ని జిల్లాల్లో అన్నివర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకునేందుకు వర్క్‌షాప్‌లు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలను క్రోడీకరించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక ఇస్తామన్నారు. తొలి వర్క్‌షాప్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రంలో మంగళవారం జరగనుంది. ఆ తర్వాత ఆదిలాబాద్(11వ తేదీ), మహబూబ్‌నగర్(12న), వరంగల్(15న), సంగారెడ్డి-మెదక్(16న), నిజామాబాద్(18న), కరీంనగర్(19న), నల్లగొండ(22న) చివరగా రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 23న వర్క్‌షాప్‌లను నిర్వహించనున్నారు.

డెంగీ వైద్యం వికటించి

బాలుడి మృతి

» చేవెళ్లలో పట్నం మహేందర్ రెడ్డి ఆస్పత్రి వద్ద బాలుడి బంధువుల ఆందోళన

» చెట్టుపల్లితండాలో ఇద్దరు చిన్నారులకు డెంగీ



మనీశ్వర్ (ఫైల్)

చేవెళ్ల/బొంరాస్‌పేట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో డెంగీ జ్వరం బారినపడిన 11 సంవత్సరాల బాలుడు... పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు చనిపోయాడని తల్లిదండ్రులు, వారి బంధువులు ఆస్పత్రిలో ఆందోళనకు దిగారు. చేవెళ్ల మండలం చన్వెల్లి గ్రామానికి చెందిన కుర్వ శ్రీనివాస్‌కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మనీశ్వర్ (11) చేవెళ్లలోని ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి, చిన్నకుమారుడు వర్షిత్ నాలుగో తరగతి చదువుతున్నారు. వీరిద్దరికీ నాలుగు రోజుల క్రితం డెంగీ జ్వరం రావడంతో తల్లిదండ్రులు పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం ఉదయం మనీశ్వర్ మృతిచెందాడు. వర్షిత్ ఆరోగ్యంగానే ఉన్నాడు. మనీశ్వర్‌కు సరైన వైద్యం చేయలేదని, వైద్యం వికటించడం వల్లే మృతిచెందాడని ఆరోపిస్తూ కుటుంబీకులు ధర్నా చేశారు. పిల్లల ప్రాణాలతో చెలగాటమాడిన వైద్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులకు, ఆస్పత్రి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు చేరుకుని మనీశ్వర్ కుటుంబీకులను సముదాయించారు. ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులు, బాలుడి కుటుంబీకులు, స్థానిక నాయకులు పోలీసుల సమక్షంలో చర్చలు జరిపారు. వైద్యం చేస్తుండగానే బాలుడికి వాంతులు, ఫిట్స్ వచ్చి చనిపోయాడని వైద్యులు వివరించారు. ఓ సమయంలో బాలుడి కుటుంబీకులు, ప్రజాప్రతినిధుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిహారం ఇచ్చేవరకు మృతదేహాన్ని తీసుకెళ్లేది లేదనడంతో యాజమాన్యం అందుకు అంగీకరించినట్టు తెలుస్తోంది. కాగా, వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట్ మండలం చెట్టుపల్లి తండాలో రక్షిత్, అక్షిత్ అనే ఇద్దరు చిన్నారులకు డెంగీ సోకింది.

డెంగీతో వైద్యుడి మృతి



డాక్టర్ దిలీప్ (ఫైల్)

మణుగూరు: హైదరాబాద్‌లో ఓ వైద్యుడు డెంగీతో మృతిచెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన డాక్టర్ నాగరపు దిలీప్ (37) కొంతకాలంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఆయనకు జ్వరం రావడంతో ముందు సాధారణ జ్వరంగా భావించి చికిత్స పొందినా తగ్గలేదు. పరీక్షలు నిర్వహించడంతో డెంగీ జ్వరమని నిర్ధారణయ్యే సరికే ఆయన పరిస్థితి విషమించింది. హైదరాబాద్ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. దిలీప్ సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఏఐటీయూసీ నాయకుడిగా, కొండాపురం మైనింగ్ సర్దార్‌గా పనిచేసిన అంజయ్య కుమారుడు. దిలీప్ విద్యాభ్యాసం మణుగూరులోనే సాగింది.

సన్నాయి నొక్కులెందుకు?

(మొటిపేజీ తరువాయి)



మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు ఉత్తమ్ దామోదర, జూపల్లి

"హుజూరాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు 3 వేల ఓట్లు వచ్చినప్పుడు పార్టీ, రేవంత్‌రెడ్డి పని అయిపోయిందని శునకానందం పొందారు. కానీ, 1.50 శాతం ఓట్ల నుంచి 40 శాతం ఓట్లతో అధికారంలోకి వచ్చాం. కాంగ్రెస్ కార్యకర్తలతో పెట్టుకుంటే పుట్టగతులు ఉండవని ఆ రోజే చెప్పాం. వారి ఉసురు తగిలి మట్టికొట్టుకుపోయారు. ఇక బీఆర్ఎస్‌కు మనుగడ ఉండదు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌ది అన్యాయం అంటున్నారు. పదేళ్ల కాంగ్రెస్ కార్యకర్తలను కొట్టి, చంపి జైల్లో పెట్టినప్పుడు కేసీఆర్ రాజనీతి ఎక్కడికి పోయింది? మేం అక్రమ కేసులు పెట్టడం లేదు. కేసీఆర్‌కు ముందుంది ముసళ్ల పండగ" అని రేవంత్ అన్నారు. రైతు రుణమాఫీ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని భరోసా ఇచ్చారు. త్వరలోనే కొత్త పీసీసీ ఏర్పాటవుతుందని, అనంతరం అన్ని జిల్లాలకు అధ్యక్షులను నియమిస్తామని తెలిపారు. కార్యకర్తల కష్టంతోనే ఎమ్మెల్యేలు గెలిచారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తల గెలుపు కోసం ఎమ్మెల్యేలు వారి కంటే ఎక్కువ కష్టపడాలని రేవంత్ సూచించారు. తనకు సీఎం పదవి నాయకుల వల్ల రాలేదని, కార్యకర్తల కష్టంతో వచ్చిందన్నారు. 35 మందికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చామని, నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారానికి సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, ఇన్‌చార్జి మంత్రులతో కలిసి పనులు చేసుకోవాలని సూచించారు.

శవాల మీద రాజకీయం కేసీఆర్‌కు అలవాటే

బీఆర్ఎస్ బలహీనపడినప్పుడల్లా అమాయక పిల్లలను రెచ్చగొట్టి ఉద్యమాలు చేయించి వారిని బలిచేస్తున్నారని సీఎం రేవంత్ ధ్వజమెత్తారు. శవాల మీద రాజకీయం చేసి పబ్బం గడుపుకోవడం కేసీఆర్‌కు అలవాటని మండిపడ్డారు. తమను కాపాడమని కేటీఆర్, హరీశ్‌లు ఢిల్లీలో మోదీ చుట్టూ తిరుగుతున్నారని, అయినా చేసిన తప్పులకు లెక్కలు చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. "డీఎస్సీ వాయిదా వేయాలంటూ దళిత, గిరిజన విద్యార్థులతో దీక్షలు చేయించడం కాదు. బావ బామ్మర్దులు హరీశ్, కేటీఆర్ ఓయూ ఆర్ట్స్ కళాశాల దగ్గర ఆమరణ దీక్షకు కూర్చోవాలి. డీఎస్సీ వాయిదా పడడమో, వారి ప్రాణాలు పోవడమో జరగాలి. డీఎస్సీ వాయిదా ఉద్యమం.. రూ.వందల కోట్లు సంపాదనకు కోచింగ్ సెంటర్లు, బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న కృత్రిమ ఉద్యమం. కోచింగ్ సెంటర్ల మాఫియా కోసం పరీక్షను రద్దు చేయడం కుదరదు" అని తేల్చిచెప్పారు. పదేపదే పరీక్షల రద్దు కోసం ప్రతిపక్షం కుట్ర చేస్తోందని.. వాయిదాల డిమాండ్ వెనుక కోచింగ్ సెంటర్ల కుట్ర కూడా ఉందని ఆరోపించారు. వాయిదాతో తనకు వచ్చే నష్టం ఏమీ లేదని లక్షలమంది నిరుద్యోగులు నష్టపోతారని అన్నారు. డీఎస్సీ ద్వారా 11,500 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తే ప్రతి తల మాసినోడు వచ్చి వాయిదా వేయాలంటున్నారని విమర్శించారు.

ఉద్యోగాలపై దొంగలంతా కలిసి గూడుపుఠాణీ


జాబ్ క్యాలెండర్ ప్రకారం గ్రూప్ 1, 2, 3, 4 పరీక్షలు నిర్వహిస్తామని, ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. డిసెంబర్ 31 వరకు ఫలితాలు వెల్లడించి.. వెయ్యి మంది గ్రూప్-1 అధికారులను నియమిద్దామంటే దొంగలంతా కలిసి గూడుపుఠాణీ చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలన పదేళ్లలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని, 1:50 ప్రాతిపదికన గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపిక చేస్తే 1:100 నిష్పత్తి ప్రకారం పిలవాలని డిమాండ్ చేస్తున్నారని, దీనివెనుక ప్రతిపక్షాల కుట్ర ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు చెప్పినట్లు చేస్తే కోర్టుకు వెళ్తారని.. నోటిఫికేషన్‌లో లేకుండా ఎలా పిలుస్తారని పరీక్షను రద్దు చేసే ప్రమాదం ఉందన్నారు. 19 వేలమంది ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చి రాజకీయ ప్రమేయం లేకుండా బదిలీ చేశామని చెప్పుకొచ్చారు.

రాష్ట్రంపై డెంగీ పంజా

జనవరి నుంచి 964 కేసుల నమోదు.. గ్రేటర్ హైదరాబాద్‌లోనే 327

» మూడు జిల్లాల్లో అత్యధిక కేసులు

» ఎన్‌సీవీబీడీసీ నివేదిక వెల్లడి



హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంపై డెంగీ పంజా విసురుతోంది. రోజురోజుకు కేసులు పెరుగుతున్నాయి. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో 11 ఏళ్ల బాలుడు, హైదరాబాద్‌లో ఓ వైద్యుడు డెంగీ బారినపడి మృతిచెందారు. రాష్ట్రంలో ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 964 డెంగీ కేసులు నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్-బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ) తాజాగా వెల్లడించింది. గత ఏడాది ఇదే సమయంలో కేవలం 706 కేసులు నమోదైనట్లు పేర్కొంది. ఈ ఏడాది కేసుల తీవ్రత పెరుగుతున్నట్లు హెచ్చరించింది. మూడు నాలుగు జిల్లాల్లో డెంగీ తీవ్రత ప్రమాదకరస్థాయిలో ఉన్నట్లు పేర్కొంది. 61 శాతం కేసులు హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, ఖమ్మం జిల్లాల్లోనే నమోదైనట్లు తెలిపింది. రాష్ట్ర రాజధానిలో 327, ఖమ్మం జిల్లాలో 161, మేడ్చల్‌లో 103 కేసులు నమోదయ్యాయని పేర్కొంది. గత ఏడాది తొలి ఆరు మాసాల్లో ఈ మూడు జిల్లాల్లో కేవలం 282 కేసులే నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీన్ని బట్టి ఈ ఏడాది డెంగీ తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. డెంగీతో పాటు మలేరియా, చికున్‌గున్యా కేసులు కూడా పెరుగుతున్నాయి. జూన్ చివరి నాటికి రాష్ట్రంలో 71 మలేరియా, 33 చికున్ గున్యా కేసులు నమోదైనట్లు పేర్కొంది.

ప్రజారోగ్య విభాగం వైఫల్యం

సీజనల్ వ్యాధుల కట్టడిలో రాష్ట్ర ప్రజారోగ్య విభాగానిదే కీలక పాత్ర. కానీ దాని వైఫల్యం కొట్టచ్చినట్లు కనిపిస్తోంది. ఇందుకు ప్రధాన కారణం.. ముందస్తు ప్రణాళిక లేకపోవడమేనని తెలుస్తోంది. పైగా ఎప్పుడూ క్షేత్రస్థాయిలో పనిచేయని వారిని విభాగాధిపతిగా నియవింంచడం, అనుభవరాహిత్యం వంటి కారణాలు కూడా తోడవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేసవిలోనే కార్యాచరణ ప్రణాళిక తయారుచేసుకోవాల్సి ఉండగా అలాంటిదేమీ చేయలేదని సమాచారం. డెంగీ బెడద ఉన్న జిల్లాలను ముందుగానే గుర్తించి అక్కడ పెద్దయెత్తున ఫాగింగ్, ప్రజలకు అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలు చేపట్టాలి. డీఎంహెచ్‌వోలతో సమీక్షలు నిర్వహించి అప్రమత్తం చేయాలి. ముఖ్యంగా చాలా జిల్లాల్లో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోలే ఉండటంతో పాటు రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులుగా కూడా ఇన్‌చార్జినే నియమించడంతో వారిలో సీరియెస్‌నెస్ కనిపించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇప్పటికే డబ్ల్యూహెచ్‌వో హెచ్చరిక

ఈ సీజన్‌లో తెలంగాణకు డెంగీ ప్రమాదం ఉందని ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) కూడా హెచ్చరించింది. దేశంలో డెంగీ ఎక్కువగా ఉన్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ కూడా ఉందని పేర్కొంది. ఇటీవల ప్రపంచవ్యాప్తంగా డెంగీ తీవ్రత గురించి విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. డెంగీలోని నాలుగు ప్రధాన వేరియంట్లు రాష్ట్రంలో కనిపిస్తున్నాయని పేర్కొంది.

దక్షిణాదిలోనే కేసులు ఎక్కువ

దేశంలో కేరళలో అత్యధిక కేసులు నమోదయ్యాయి. కేరళలో జూన్ చివరి నాటికి 8,004 కేసులు నమోదు కాగా, 22 మంది మరణించినట్లు ఆ రాష్ట్ర వైద్య శాఖ వెల్లడించింది. ఎన్‌సీవీబీడీసీ గణాంకాల ప్రకారం.. కేరళ తర్వాత వరుస స్థానాల్లో తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ ఉన్నాయి. తెలంగాణ ఏడో స్థానంలో నిలిచింది.

మొయినాబాద్‌లో ముజ్రా పార్టీ

» పది మంది అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

మొయినాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ఫాంహౌస్‌లో జోరుగా పార్టీ జరుగుతోంది. డీజే మోతతో దావత్ దద్దరిల్లిపోతోంది. అమ్మాయిల అశ్లీల, అర్ధనగ్న నృత్యాలతో హోరెత్తిపోతోంది. కట్ చేస్తే సీన్‌లోకి పోలీసులు రంగ ప్రవేశం చేశారు. పార్టీ చేసుకుంటున్న ఆరుగురు యువకులు, నలుగురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం సురంగల్ గ్రామ పరిధిలోని ఓ ఫాంహౌస్‌లో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ పార్టీపై ఎస్‌వోటీ పోలీసులు దాడి చేశారు. కేసు వివరాలను ఇన్‌స్పెక్టర్ పవన్ వెల్లడించారు. టోలీచౌకికి చెందిన రెహాన్‌సిద్ధ చౌహాన్ ఆటో డ్రైవర్. అతడి భార్య ఆర్కెస్ట్రా సింగర్‌గా పని చేస్తోంది. రెహాన్ సిద్ధ టోలీచౌకిలో ఉండే మరో ఐదుగురు యువకులతో కలిసి పార్టీ చేసుకునేందుకు సురంగల్ పరిధిలో ఉన్న ఆర్ఎస్ ఫాంహౌస్‌ను అద్దెకు తీసుకున్నాడు. తన భార్యకు పరిచయం ఉన్న ఆర్కెస్ట్రా డ్యాన్సర్లుగా పని చేసే ఢిల్లీకి చెందిన ఇద్దరు యువతులు, హైదరాబాద్‌కు చెందిన మరో ఇద్దరు అమ్మాయిలను తీసుకుని సోమవారం రాత్రి ఫాంహౌస్‌కు వెళ్లాడు. అంతా కలిసి అర్ధరాత్రి డీజే సౌండ్ పెట్టి అర్ధనగ్న నృత్యాలు చేస్తూ ముజ్రా పార్టీ చేసుకున్నారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఫాంహౌస్‌పై దాడి చేశారు. నృత్యాలు చేస్తున్న నలుగురు యువతులను, ఆరుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రెండు కార్లు, మ్యూజిక్ సిస్టమ్, సెల్‌ఫోన్లు రూ.18,160 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారందరినీ మొయినాబాద్ స్టేషన్‌కుతరలించారు. వారికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా నెగెటివ్ వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

కోళ్ల ఫారం మాటున గుట్కా తయారీ

» వికారాబాద్ జిల్లాలో 5 క్వింటాళ్ల ముడిసరుకులు పట్టివేత

బంట్వారం (కోట్‌పల్లి), జూలై 9 (ఆంధ్రజ్యోతి): కోళ్లఫారంలో రహస్యంగా గుట్కాలు తయారు చేస్తున్న ఓ ముఠా గుట్టును పోలీసులు బహిర్గతం చేశారు. ఐదు క్వింటాళ్ల ముడి సరుకులను గుర్తించి సీజ్ చేశారు. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం ఓగ్లపూర్ గ్రామ సమీపంలోని ఓ కోళ్లఫారం షెడ్డులో కొద్ది నెలలుగా గుట్కా తయారీ జరుగుతోంది. దీనిపై సమాచారం అందుకున్న కోట్‌పల్లి పోలీసులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేశారు. అక్కడి ఓ షెడ్డులో గుట్కా తయారీకి వినియోగించే ముడిసరుకులు భారీగా నిల్వ చేసి ఉండడాన్ని గుర్తించారు. సుమారు ఐదు క్వింటాళ్ల ముడి సరుకులను సీజ్ చేశారు. నిర్వాహకులు ముందుగానే పరారయ్యారు.

'అగ్నివీర్‌వాయు' కోసం దరఖాస్తుల ఆహ్వానం

అల్వాల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): 'ఇంటేక్-2-2025 అగ్నిపథ్' పథకంలో భాగంగా అగ్నివీర్‌వాయు పోస్టుల భర్తీకి భారత వాయుసేనా పెళ్లి కాని యువతి, యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోందని రక్షణశాఖ పౌరసంబంధాల అధికారి శివహరినాయక్ వెల్లడించారు. అర్హత కలిగిన అభ్యర్థులు 28 జూలై 2024 రాత్రి 11 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. నోటిఫికేషన్ https://agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది. ఇతర వివరాలు, సందేహాల నివృత్తి కోసం 12 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ సికింద్రాబాద్‌ను సంప్రదించవచ్చు.

ప్రభుత్వాన్ని కూలగొట్టం అనేదాకా చేరికలు!

కేసీఆర్ అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నా.. త్వరలోనే ధరణిలో మార్పుల ప్రక్రియ పూర్తి చేస్తాం

» 2, 3 రోజుల్లో రుణమాఫీ మార్గదర్శకాలు
» నిర్దేశిత సమయంలోపే ప్రక్రియ పూర్తి
» ఇప్పటికే వ్యవసాయశాఖకు 8-9వేల కోట్లు
» ఆషాఢం తర్వాత మంత్రివర్గ విస్తరణ
» జర్నలిస్టుల స్థలాల సమస్యను పరిష్కరిస్తాం
» మీడియాతో మంత్రి పొంగులేటి ఇష్టాగోష్ఠి

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు ప్రజాస్వామ్యబద్ధంగానే ఉంటాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తమకు 64 సీట్లు ఇస్తే.. కాంగ్రెస్ సర్కారును కూల్చేస్తామని కేసీఆర్ వ్యాఖ్యానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 'కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతాం' అనే మాటలకు ముగింపు పలికితే.. చేరికలు ఆపేస్తామని తెలిపారు. బీజేపీతో చీకటి ఒప్పందాలు చేసుకొని, రాజకీయాలు చేస్తూ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని చెప్పడం ఆయన మూర్ఖత్వానికి పరాకాష్ట అన్నారు. మంగళవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఆషాఢం తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్నారు. అలాగే రాష్ట్రంలో మిగిలిన నామినేటెడ్ పోస్టులనూ త్వరలోనే భర్తీ చేస్తామని తెలిపారు. రైతుల రుణమాఫీ అంచనా కొంతమేర పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతానికి రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవుతాయని అంచనా వేశామని, ఇందులో భాగంగా ఇప్పటికే వ్యవసాయ శాఖకు రూ.8-9 వేల కోట్లను అందించామని, మిగతా నిధులను సమీకరిస్తున్నామని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో రుణమాఫీ మార్గదర్శకాలను విడుదల చేస్తామన్నారు. రుణమాఫీపై ప్రభుత్వం కచ్చితమైన లక్ష్యంతో ఉందని, అనుకున్న సమయానికి ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు.

కేసీఆర్ అసెంబ్లీకి రావాలి..

కేసీఆర్ అసెంబ్లీకి రావాలని వ్యక్తిగతంగా కోరుకుంటున్నానని, ఆయన్ని అసెంబ్లీలో చూడాలని ఉందని పొంగులేటి అన్నారు. కేసీఆర్ అంటే తనకు ప్రేమ అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ ప్రతిపక్ష హోదాలో హాజరవుతారా? అని విలేకరులు అడగ్గా.. "తాతకు పెట్టిన బొచ్చె తలాపునే ఉంటుందన్న" నానుడిని గుర్తుచేశారు. కేసీఆర్ చేసిన వ్యవహారాలు ఇప్పుడు ఆయనకే అగ్నిపరీక్ష పెడుతున్నాయన్నారు. గతంలో ఆయనకు ప్రజలు 88 సీట్లు ఇచ్చినా తృప్తి పడకుండా.. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ 19 సీట్లు గెలిస్తే 13 మందిని లాగేసుకున్నారని గుర్తుచేశారు. అప్పుడు ఆ ఘట్టాలన్నీ చూసిన వారే ఇప్పుడు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి వస్తున్నారని చెప్పారు. 'ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నవారంతా మీ సారథ్యంలోనే వస్తున్నారు?' అని విలేకరులు ప్రస్తావించగా.. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని, పార్టీలోకి ఎవరు ఎక్కడినుంచైనా రావొచ్చని పొంగులేటి పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో అందరూ సీఎంలే.. అందరూ ఎమ్మెల్యేలేనని వ్యాఖ్యానించారు. మంత్రివర్గ విస్తరణలో ఎవరెవరు ఉంటారని అడగ్గా.. తాను అంతపెద్దవాడిని కాదని సమాధానం ఇచ్చారు. కేశవరావు రాజీనామా చేసిన రాజ్యసభ స్థానంలో ఎవరికి అవకాశం ఇస్తారని ఓ విలేకరి అడగ్గా.. ఆయనే పోటీ చేయొచ్చని చెప్పారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, కచ్చితంగా అర్హులకు లబ్ధి చేకూరుస్తామని తెలిపారు.



పింఛన్ల పెంపుపైనా సమాలోచనలు

పింఛన్ల పెంపుపైనా సమాలోచనలు చేస్తున్నామని, పింఛన్లను పెంచి ఇచ్చినా ప్రభుత్వంపై పెద్దగా భారం పడదని పొంగులేటి అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో తెల్ల రేషన్ కార్డు, పింఛన్ల కోసం కూడా దరఖాస్తులు అందాయని తెలిపారు. రేషన్‌కు ఒక కార్డు, వైద్యం కోసం ఒక ప్రత్యేక కార్డును అందించే అంశంపై చర్చిస్తున్నామని చెప్పారు. దీనిపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులతో చర్చిస్తున్నారన్నారు. ఇక ఇందిరమ్మ ఇల్లు పథకంపై ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో అధ్యయనం పూర్తయిందని, అధికారులు మరో మూడు రాష్ట్రాల్లో అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న మేర ఇళ్లను అందిస్తామన్నారు. రాజీవ్ స్వగృహకు సంబంధించి కూడా వేలం వేసేందుకు కమిటీని నియమించామని, దీనిపై త్వరలోనే ఒక నిర్ణయం తీసుకోనున్నామని వెల్లడించారు.

సామాన్యులకు ఇబ్బంది లేకుండా..

రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న రెవెన్యూ చట్టంలో సామాన్యులకు ఇబ్బందులు లేకుండా మార్పులు చేస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఇప్పటికే ధరణిలో చాలా మార్పులు చేశామని, మరికొన్ని మార్పులు చేయబోతున్నామని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్ల విలువల సవరణలను కూడా త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన సవరణ అశాస్త్రీయంగా ఉందన్నారు. ఈ అంశంపై క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తాము భూముల రిజిస్ట్రేషన్ల విలువలను సవరిస్తామని చెప్పారు. అవసరమైతే తగ్గించాల్సిన చోట రిజిస్ట్రేషన్ విలువను తగ్గిస్తామని కూడా తెలిపారు. జీవో 59 కింద చేసుకున్న దరఖాస్తు తిరస్కరణకు గురైన వారికి సంబంధించి దాదాపు రూ.32-33 కోట్ల నగదును త్వరలోనే వెనక్కి ఇస్తామన్నారు. స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో సంస్కరణలు తీసుకొస్తామన్నారు. రాష్ట్రంలో ఎక్కువగా రిజిస్ట్రేషన్లు చేయించే కంపెనీలను గుర్తించి, వాటి సీఎస్ఆర్ నిధులతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు కొత్త భవనాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక అధికారి ఉండాలనే యోచనలో ఉన్నామన్నారు. తద్వారా గ్రామంలోని ప్రభుత్వ భూములు, ఇతర పథకాలపై క్షేత్రస్థాయి వివరాలన్నీ ప్రభుత్వానికి అందుతాయనే అభిప్రాయం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేసిన రూ.6 లక్షల కోట్ల అప్పులకు వడ్డీతో కలిపి చెల్లిస్తున్నామని తెలిపారు.

మహిళలను కోటీశ్వరులను చేయండి

» ఎస్‌హెచ్‌జీలకు సాయం చేయాలన్న.. సీఎం ఆలోచనను అమలు చేయండి
» వన మహోత్సవంపై దృష్టి పెట్టండి
» కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 25 వేల స్వయం సహాయక బృందాల(ఎస్‌హెచ్‌జీ)కు రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యాచరణ ప్రణాళికను సమర్థంగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. ఈ పథకం ద్వారా రానున్న ఐదేళ్లలో స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన అని తెలిపారు. వన మహోత్సవం, మహిళా శక్తి, ప్రజాపాలన సహాయక కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, వ్యవసాయ సంబంధిత అంశాలు, ధరణి, ఉద్యోగుల బదిలీలు, గృహ నిర్మాణం తదితర అంశాలపై మంగళవారం సచివాలయం నుంచి కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వయం సహాయక బృందాలలో ఇప్పటికీ చేరని మహిళలందరినీ చేర్పించాలని చెప్పారు. ఈ పథకానికి సంబంధించి త్వరలోనే ఒక విధాన నిర్ణయ పత్రాన్ని విడుదల చేయనున్నామని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు రెండో సెట్ యూనిఫామ్‌ల అందజేత పనులను త్వరలోనే పూర్తిచేయాలన్నారు. అన్ని జిల్లాల్లో ఇందిరా క్యాంటీన్లను ప్రారంభించేలా చూడాలన్నారు. వన మహోత్సవం కింద ప్రస్తుత సీజన్‌లో 20.02 కోట్ల మొక్కలను నాటాలన్నది లక్ష్యమని తెలిపారు. జిల్లాల వారీగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు మొక్కలను నాటేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని మండలాల్లో సరిపడా యూరియా, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, వాటి పంపిణీని కలెక్టర్లు రోజూ పర్యవేక్షించాలని చెప్పారు.

20లోగా బదిలీలు పూర్తి చేయాలి..

ఉద్యోగుల బదిలీల ప్రక్రియను 20లోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 49 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినందున, ఒక్కో పాఠశాల ఏర్పాటుకు కనీసం 20 ఎకరాల చొప్పున ప్రభుత్వ భూమిని వెంటనే సేకరించాలని కలెక్టర్లను ఆదేశించారు.

ఎల్లమ్మ ఆలయం వద్ద తోపులాట!

» పొన్నంకు తగిలిన క్యూలైన్ రాడ్.. తూలిపడబోయిన విజయలక్ష్మి
» వెనక్కి వచ్చేసి రోడ్డు డివైడర్‌పై కూర్చున్న మంత్రి, మేయర్
» పొన్నం అలిగినట్లుగా సోషల్ మీడియాలో కొందరి పోస్టులు
» ట్రోలింగ్‌పై పొన్నం ఫైర్.. పోస్టులు పెట్టిన వారిపై చర్యలకు ఆదేశం


ఎల్లమ్మ ఆలయం బయట రోడ్డు డివైడర్‌పై కూర్చున మంత్రి పొన్నం, మేయర్ విజయలక్ష్మి

అమీర్‌పేట, హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బల్కంపేటలో మంగళవారం జరిగిన రేణుకా ఎల్లమ్మ కల్యాణానికి ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించేందుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి వచ్చిన సమయంలో ఆలయం వద్ద తోపులాట జరిగింది. ఉదయం 10 గంటలకు పొన్నం, విజయలక్ష్మి ఆలయ ప్రవేశ ద్వారం వద్దకు రాగా అప్పటికే అక్కడ 300-400 మంది భక్తులు దర్శనం కోసం వేచి ఉన్నారు. ఈ క్రమంలో మంత్రి, మేయర్ లోపలికి వెళుతుండగా భక్తులు కూడా లోపలికి వెళ్లేందుకు ముందుకు కదలడంతో తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో పొన్నం, విజయలక్ష్మి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కిక్కిరిసిన జనం మధ్య పొన్నంకు క్యూలైన్ రాడ్ తగిలింది. మేయర్ విజయలక్ష్మి కింద పడినంత పనైంది. లోపలికి వెళ్లే వీలులేకపోవడంతో పొన్నం, విజయలక్ష్మి ఆలయం బయటకొచ్చి రోడ్డు డివైడర్ మీద కూర్చున్నారు. ప్రొటోకాల్ పాటించడం కూడా చేతకాదా? అంటూ దేవాలయ నిర్వాహకులపై ఆగ్రహం పొన్నం వ్యక్తం చేశారు. ప్రధాన ద్వారం వద్ద పోలీసులు కూడా సరిగ్గా లేకపోవడంతో ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫోన్ చేయగా వారు సరిగ్గా స్పందించలేదు. దీంతో నగర కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ అనుదీప్‌పై అసహనం వ్యక్తం చేశారు. ఓ మంత్రికి రక్షణ కల్పించలేనప్పుడు మిగతా భక్తులకు భద్రత ఎక్కడ ఉంటుందంటూ కలెక్టర్‌ను ప్రశ్నించారు. అధికారులు నచ్చజెప్పడంతో మంత్రి, మేయర్ ఆలయంలోకి వెళ్లి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అంతకుముందు తోపులాట ఘటన తర్వాత ఆలయం బయటకొచ్చి డివైడర్‌పై అలిసిపోయి కూర్చున్న పొన్నంపై సోషల్ మీడియాలో కొందరు ట్రోల్స్ చేశారు.

శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకే

బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ప్రవేశద్వారం వద్ద జరిగిన తోపులాట ఘటన వెనుక కుట్ర కోణం ఉందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ఆలయానికి వచ్చిన సమయంలో అక్కడ కొందరు రాజకీయ ప్రేరేపిత అల్లరిమూకలు ఉద్దేశపూర్వకంగా తోపులాటకు దిగి శాంతిభద్రతల సమస్యను తలెత్తేందుకు కుట్ర పన్నారని మండిపడ్డారు. తోపులాట ఘటనలో పోలీసులు వ్యవహరించిన తీరునూ ఆమె తప్పుబట్టారు. ఈ ఘటనలో పోలీసు శాఖ నిర్లక్ష్యం బయటపడిందని పేర్కొన్నారు. ఆలయం వద్ద తోపులాట ఘటన నేపథ్యంలో మంత్రులు కొండా, పొన్నం మంగళవారం సాయంత్రం ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడారు. ఉత్సవాలకు వేల సంఖ్యలో వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించేందుకుగాను సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు వరుస సమావేశాలు నిర్వహించామని పేర్కొన్నారు. అన్నిరకాలుగా ముందస్తు చర్యలు తీసుకున్నా... ఈ తరహా ఘటన జరగడం సరైంది కాదని పేర్కొన్నారు. పోలీసు శాఖ అత్యుత్సాహం కారణంగా భక్తులకు కలిగిన ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయన్నారు. ప్రభుత్వ ప్రతిష్ఠను మసకబర్చేందుకు ఎవరు ప్రయత్నించినా సహించేది లేదని స్పష్టం చేశారు. తొక్కిసలాట చోటుచేసుకున్నప్పుడు అక్కడ విధుల్లో ఉన్న పోలీసుల సమాచారాన్ని మంత్రులు అడిగి తెలుసుకున్నారు. జరిగిన లోటుపాట్లపై సమీక్ష చేపట్టాలని, ఘటనపై 24 గంటల్లో నివేదిక అందజేయాలని పోలీసు ఉన్నతాధికారులను సురేఖ ఆదేశించారు. తొక్కిసలాట సమయంలో ఓ మహిళా జర్నలిస్టును డ్యూటీలో ఉన్న ఎస్సై దుర్భాషలాడినట్లుగా తన దృష్టికి వచ్చిందని, విచారణ చేపట్టి సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

దురుద్దేశంతో ట్రోలింగ్: మంత్రి పొన్నం

ఎల్లమ్మ ఆలయ ప్రవేశద్వారం వద్ద తోపులాట ఘటన తర్వాత ఆలయం నుంచి బయటకొచ్చిన తాను సేదతీరేందుకు ఓ గద్దెపై కూర్చున్నానని, అయితే మంత్రి అలిగి దేవాలయం బయట కూర్చున్నారంటూ సోషల్ మీడియాలో కొందరు దురుద్దేశంతో కూడిన పోస్టులు పెట్టారని పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తొక్కిసలాట అనంతరం ఆలయం వద్ద, సచివాలయంలో సమీక్ష సందర్భంగా పొన్నం మాట్లాడారు. తోపులాట సందర్భంగా ఒకదశలో మేయర్ కిందపడబోయారని మంత్రి పేర్కొన్నారు. మహిళలు ఇబ్బందులు పడటం చూసే అధికారులపై తాను సీరియస్ అయ్యానన్నారు. తోపులాటను నివారించేందుకు తాను కొద్దిసేపు ఆగానని చెప్పారు. ఆలయం వద్ద ఓ మహిళా రిపోర్టర్‌కు ఎదురైన చేదు అనుభవానికి తాను క్షమాపణ చెబుతున్నానన్నారు.

అసభ్యకర వీడియోలపై సీసీఎస్‌లో మేయర్ ఫిర్యాదు

సామాజిక మాధ్యమాల్లో తనపై అసభ్యకరమైన, ఫేక్ వీడియోలు పోస్ట్ చేశారంటూ జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి మంగళవారం సైబర్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్)లో ఫిర్యాదు చేశారు. వ్యక్తిత్వ హననం, వ్యక్తిగత ప్రతిష్ఠ దిగజార్చేలా వీడియోలున్నాయన్నారు. ఎక్స్ ఫేస్‌బుక్‌లో వీడియోలు పోస్ట్ చేసిన వారి ఐడీలను ఫిర్యాదులో పేర్కొన్నారు.

10,000 కోట్లు సిద్ధం?

(మొదటిపేజీ తరువాయి)

రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది ప్రాథమికంగా అంచనా వేసిన మొత్తం. పథకాన్ని పూర్తిగా అమలు చేసేనాటికి నిధుల మొత్తం తగ్గవచ్చన్న అభిప్రాయాలున్నాయి. ఏదేమైనా రుణమాఫీ పథకానికి నిధుల కోసం ప్రభుత్వం అనేక మార్గాల్లో కసరత్తు చేస్తోంది. ఆగస్టు 15లోగా రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తామని సీఎం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిధుల సేకరణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ముఖ్యంగా ప్రతి నెలా తీసుకుంటున్న రుణాలను జాగ్రత్తగా ఖర్చు చేస్తూ, పాత అప్పుల కిస్తీలు కడుతూ ఎంతో కొంత నిధులను ఆదా చేస్తూ వచ్చింది. రాష్ట్ర ఖజానాకు వివిధ మార్గాల ద్వారా వస్తున్న ఆదాయంలోనూ కొంత నిల్వ చేస్తోంది. ఇలా పలు రకాలుగా ఆదా చేస్తూ.. ప్రస్తుతం ఖజానాలో రూ.10 వేల కోట్ల వరకు నిల్వ చేసి పెట్టినట్లు తెలిసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఏప్రిల్‌లో రూ.4000 కోట్లు, మేలో 4000 కోట్లు, జూన్‌లో 5000 కోట్ల చొప్పున మార్కెట్ రుణాలను సేకరించింది.

రుణ మాఫీకి జూలై, ఆగస్టు రుణాలు

జూలై, ఆగస్టు నెలల్లో తీసుకునే మార్కెట్ రుణాల్లో కొన్ని నిధులను రుణమాఫీ పథకానికి మళ్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూలైలో రూ.6,500 కోట్లు, ఆగస్టులో రూ.5000 కోట్ల మేర రుణం తీసుకోవాలని ముందస్తు ప్రణాళికను నిర్దేశించుకుంది. ఆ 11,500 కోట్లలో ప్రభుత్వ వ్యయాలు, పాత అప్పుల కిస్తీలు పోను ఎంతో కొంత ఆదా చేయనుంది. ఈ రెండు నెలల రుణాల్లో ఇప్పటికే రూ.2000 కోట్లు తీసుకున్నందున మిగతా రూ.9,500 కోట్లలో ఒకేసారి ఎక్కువ మొత్తాన్ని తీసుకోవడానికి అనుమతివ్వాలంటూ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. కేంద్రం అనుమతించి, ఒకేసారి పెద్ద మొత్తంలో రుణం తీసుకుంటే ఎక్కువ భాగాన్ని రుణమాఫీ పథకానికి మళ్లించాలని సర్కారు యోచిస్తోంది.



మూడు దశలుగా రుణమాఫీ..

రుణమాఫీని 3 దశలుగా అమలు చేయాలని యోచిస్తోంది. ముందుగా రూ.లక్ష లోపు రుణాలను, తర్వాత రూ.లక్షన్నర లోపు, అనంతరం రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేయాలని భావిస్తోంది. ఇదంతా కొన్ని రోజుల తేడాతో సాగే ప్రక్రియ అయినందున.. ఒకేసారి రుణమాఫీ పథకాన్ని వర్తింపజేశామని చెప్పనుంది.

ఇతర మార్గాలపైనా దృష్టి

రుణమాఫీ పథకంతో పాటు ఇతర వ్యయాల కోసం ప్రభుత్వం పలు రకాలుగా నిధుల సేకరణ ప్రయత్నాలు చేస్తోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములను ప్రైవేటు బ్యాంకుల వద్ద హామీగా పెట్టి రుణాలు తీసుకోవడంపై కసరత్తు చేస్తోంది. కానీ, ఇలాంటి రుణాలపై కొన్ని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రుణాలను కూడా ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోనే లెక్కిస్తామంటూ కేంద్ర ప్రభుత్వం భీష్మిస్తే ఇబ్బంది తప్పదన్న అభిప్రాయాలున్నాయి. బడ్జెట్ వెలుపల తీసుకునే ఎలాంటి రాష్ట్ర ప్రభుత్వ రుణాలనైనా ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి తీసుకుంటామని కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. ఇలాంటి రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి తీసుకోవద్దంటూ సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రధాని, ఆర్థిక మంత్రిని కోరారు. దీనికి కేంద్రం ఆమోదం తెలపాల్సి ఉంది. మరోవైపు పరిశ్రమలకు కేటాయించిన భూములను వాణిజ్య, నివాస అవసరాల కోసం మార్పిడి చేయాలన్న ఆలోచన కూడా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో చాలా భూములను పారిశ్రామిక యూనిట్లకు కేటాయించారు. కానీ, కొన్నింటిలో ఎలాంటి యూనిట్లు ఏర్పాటు కాలేదని, ఆర్థిక, పారిశ్రామిక ఉత్పత్తి కార్యకలాపాలను ప్రారంభించలేదని ప్రభుత్వం గుర్తించింది. అలాంటి భూములను నివాసయోగ్య స్థలాలుగా మార్చి, విక్రయించే ఆలోచన చేస్తోంది. ఇలా వచ్చే నిధులను రుణమాఫీ పథకానికి మళ్లించడంతో పాటు రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలకు వినియోగించాలన్న ఆలోచనలో ఉంది.

మాకూ్కడా ఫైళ్లు ఇస్తలేరు

» ఘోష్ కమిషన్‌కు నిపుణుల కమిటీ నివేదిక
» ఏం కావాలో చెబితే ఇప్పిస్తామన్న కమిషన్

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన కీలక పత్రాలను నీటిపారుదల శాఖ తమకు ఇవ్వడం లేదని నిపుణుల కమిటీ జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు నివేదిక సమర్పించింది. ఈ పరిస్థితుల్లో బ్యారేజీల వైఫల్యానికి కారణాలపై తమ అభిప్రాయం తెలిపే అవకాశం లేదని కవిటీ చేతులెత్తేసింది. ఆయా బ్యారేజీలపై విచారణ జరుపుతున్న కమిషన్‌కు సహాయం చేయడానికి మాజీ ప్రొఫెసర్ సీబీ కామేశ్వర్‌రావు నేతృత్వంలో నిపుణుల కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. కమిషన్ ఆదేశాలతో కమిటీ పలువురు అధికారులను పిలిచి ప్రశ్నించింది. అయితే బ్యారేజీల డిజైన్లు, డ్రాయింగ్‌లు, టెక్నికల్ అనుమతులు, ఇతర అంశాలకు సంబంధించిన ఫైళ్లను పరిశీలిస్తామని అడగ్గా నీటి పారుదల శాఖ అనుమతించలేదని కమిటీ నివేదించింది. ఏ ఫైళ్లను పరిశీలించాలనుకుంటున్నారో.. ఆ వివరాలిస్తే నీటి పారుదల శాఖకు లేఖ రాస్తామని కమిషన్ తెలిపినట్లు సమాచారం. ఆ ఫైళ్లు అందిన తర్వాతే బ్యారేజీల వైఫల్యంపై నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు తెలిసింది. కాగా, కీలక అధికారులు కోటరీగా ఏర్పడి కమిషన్‌తో పాటు జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ఏ), విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు సమాచారం ఇవ్వరాదని నిర్ణయించడంపై జస్టిస్ పీసీ ఘోష్ మండిపడిన సంగతి తెలిసిందే. రెండు వారాల్లోగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో ముడిపడిన సమాచారం/ఫైళ్లన్నీ అందించాలని నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను ఆదేశించగా.. మరుసటి రోజే నిపుణుల కమిటీ కూడా పత్రాలు ఇవ్వడం లేదని కమిషన్‌కు తెలపడం గమనార్హం. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలు, పంప్‌హౌస్‌ల నిర్మాణంలో ఏం జరిగింది? ఏం చేస్తే బాగుంటుందని వాటి నిర్మాణంలో భాగస్వాములైన 20 మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల(డీఈఈ)లను జస్టిస్ పినాకి చంద్రఘోష్ ప్రశ్నించారు. మరోవైపు, కాళేశ్వరంపై విచారణలో భాగంగా నదుల అనుసంధానం టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ వెదిరే శ్రీరామ్‌తో పాటు విద్యుత్ రంగ నిపుణుడు కంచర్ల రఘు నుంచి సమాచారం సేకరించాలని జస్టిస్ ఘోష్ కమిషన్ నిర్ణయించింది. వెదిరే శ్రీరామ్‌కు కబురు పంపిన కమిషన్, వచ్చే శుక్రవారం లేదా సోమవారం వచ్చి సమాచారం అందించాలని కోరింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఉంటే గ్రావిటీతో 71 కిలోమీటర్ల మేర నీరు వచ్చేదని, అలాకాకుండా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతో నష్టం జరిగిందని ఇటీవలే శ్రీరామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అంతేకాక ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి'లో ఆయన రాసిన వ్యాసాలనూ సేకరించిన కమిషన్.. తగిన పత్రాలు అందించాలని కోరింది. కంచర్ల రఘు నుంచి సైతం సాక్ష్యాధారాలు సేకరించాలని కమిషన్ నిర్ణయించింది. 22న హాజరై వివరాలు అందించాలని ఆయనకు కమిషన్ లేఖ రాసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో లోపాలను తప్పుబడుతూ ఉద్యోగం మానేసిన ఓ నిర్మాణ సంస్థకు చెందిన మాజీ ఉద్యోగి త్వరలో కమిషన్‌కు తన వద్ద ఉన్న సమాచారాన్ని సమర్పించనున్నట్లు తెలిసింది.

త్వరలో సీడబ్ల్యూసీ అధికారులకు కబురు

కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌ను రూపొందించిన వ్యాప్కోస్ సంస్థ అధికారులతో పాటు హైడ్రాలజీ, ప్రాజెక్టుకు ఇతర అనుమతులు జారీ చేసిన సీడబ్ల్యూసీలోని వివిధ డైరెక్టరేట్ల అధికారులను కమిషన్ విచారించనుంది. కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్) వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల అధికారులను సైతం విచారణకు పిలిపించాలని కమిషన్ నిర్ణయించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్ణయాలు తీసుకున్న సమయంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య/ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరించిన రిటైర్డ్ ఐఏఎస్‌లు ఎస్‌కే జోషి, రజత్ కుమార్‌ను త్వరలో కమిషన్ పిలిపించి విచారించనుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

- దరఖాస్తు ఫీజు: రూ.2,000
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 28
- వెబ్‌సైట్: isb.edu

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● బుధవారం 10 జూలై 2024

ఐఎస్‌బీలో మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లు



పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు

పీజీపీ ఇన్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనిని ఎంబీఏ డిగ్రీకి సమానంగా పరిగణిస్తారు. ఇందులో భాగంగా ఇంటర్నేషనల్ ఎక్స్‌ఛేంజ్ ప్రోగ్రామ్ కూడా ఉంటుంది.
అర్హత: ఏదేని డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. జీమ్యాట్/జీఆర్‌ఈ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.
ఎంపిక: అకడమిక్ ప్రతిభ, జాతీయ పరీక్ష స్కోర్, నాయకత్వ లక్షణాలు పరిశీలించి అభ్యర్థుల షార్ట్ లిస్ట్ రూపొందిస్తారు. వీరికి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15

పీజీపీఎంఏఎక్స్: ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. దీనిని సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు, బిజినెస్ ఓనర్స్‌కు ఉద్దేశించారు. ఇది ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ డిగ్రీకి సమానం. ప్రోగ్రామ్ మొత్తానికి 24 క్రెడిట్లు నిర్దేశించారు.
అర్హత: ఏదేని డిగ్రీ/సీఏ/ఐసీడబ్ల్యూఏఐ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి.
ఎంపిక: అకడమిక్ ప్రతిభ, అనుభవం, అచీవ్‌మెంట్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.
దరఖాస్తు ఫీజు: రూ.10,000
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 1

పీజీపీప్రొ: ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. ముంబై, బెంగళూరు క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఇది వీకెండ్ ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు సమానం. ఫైనాన్స్, మార్కెటింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.
అర్హత: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 18

పీజీపీఎంఎఫ్‌ఏబీ: ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. ఇది మాడ్యులర్ ప్రోగ్రామ్. దీనిని కుటుంబపరంగా సొంత బిజినెస్‌లు నిర్వహిస్తున్నవారికి ఉద్దేశించారు. ఇందులో బిజినెస్ ఆపరేషన్స్, మేనేజ్‌మెంట్ మెథడాలజీ, టూల్స్ అండ్ టెక్నిక్స్, లీడర్‌షిప్ టెక్నిక్స్ నేర్పిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా రెండు ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.
అర్హత: ఏదేని డిగ్రీ/సీఏ ఉత్తీర్ణులై ఉండాలి. అనుభవం తప్పనిసరి కానప్పటికీ కనీసం రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
ఎంపిక: ఫ్యామిలీ బిజినెస్‌పై అవగాహన, బిజినెస్ లీడర్‌షిప్ సామర్థ్యం, అకడమిక్ ప్రతిభ, బీఏటీ(బిజినెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్)స్కోర్, ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

బీఏటీ వివరాలు: దీనిని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో కమ్యూనికేషన్ అనాలిసిస్, క్రిటికల్ థింకింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలిసిస్ అంశాల నుంచి ఒక్కో దానిలో 15 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మోడల్ పేపర్ల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
దరఖాస్తు ఫీజు: రూ.15,000
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మొదటి రౌండ్‌కు నవంబరు 10; రెండో రౌండ్‌కు 2025 మార్చి 9

అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ బిజినెస్ అనలిటిక్స్(ఏఎంపీబీఏ)

ప్రోగ్రామ్ వ్యవధి 15 నెలలు. ఇది హైబ్రిడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్. ప్రోగ్రామ్‌లో భాగంగా డేటా మేనేజ్‌మెంట్, ప్రోగ్రామింగ్, స్టాటిస్టిక్స్, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బిజినెస్ అప్లికేషన్స్ అంశాలకు సంబంధించి థియరీ సెషన్స్, ప్రాక్టికల్ ట్రెయినింగ్ ఉంటాయి. ఫౌండేషనల్ ప్రాజెక్ట్‌లు, క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులు పూర్తి చేయాల్సి ఉంటుంది. సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.
అర్హత: ఇంజనీరింగ్, టెక్నాలజీ, స్టాటిస్టిక్స్, మేథమెటిక్స్, సైన్స్ విభాగాల్లో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్, ప్రోగ్రామింగ్ అంశాల్లో పూర్తి పరిజ్ఞానం ఉండాలి. అడ్మిషన్ నాటికి కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. జీమ్యాట్/జీఆర్‌ఈ/క్యాట్/ఎన్‌మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు అడ్మిషన్ టెస్ట్ రాయనవసరం లేదు.

కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, కోయంబత్తూరులో నిర్వహిస్తున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ టెక్స్‌టైల్స్ అండ్ మేనేజ్‌మెంట్(ఎస్‌వీపీఐటీఎం)- డిగ్రీ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్(ఎస్‌వీపీఈటీ)/సీయూఈటీ స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు ఇతర మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్‌లను కూడా అనుమతిస్తారు. చేనేత కార్మికుల పిల్లలకు ఎడ్యుకేషనల్ స్కాలర్‌షిప్; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ ఇస్తారు. డిగ్రీ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లు పూర్తిచేసిన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం ఇంటర్న్‌షిప్స్, ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు. సంస్థ షార్ట్ టర్మ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లను కూడా నిర్వహిస్తోంది.

'సర్దార్ పటేల్' టెక్స్‌టైల్ స్కూల్లో డిగ్రీ, ఎంబీఏ

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: మూడేళ్ల వ్యవధి గల బీఎస్సీ (టెక్స్‌టైల్స్/టెక్నికల్ టెక్స్‌టైల్స్), బీబీఏ టెక్స్‌టైల్ బిజినెస్ అనలిటిక్స్; నాలుగేళ్ల వ్యవధి గల బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్)(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఇవి ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లు. బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్)(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లో మూడేళ్ల కోర్సు పూర్తిచేసిన తరవాత బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్) డిగ్రీతో ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది.
అర్హత: బీఎస్సీ ప్రోగ్రామ్‌లకు గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు; టెక్స్‌టైల్ సబ్జెక్టులతో ఒకేషనల్ స్ట్రీమ్ కోర్సు పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. బీఎస్సీ(టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ డిజైన్)(ఆనర్స్/రీసెర్చ్), బీబీఏ ప్రోగ్రామ్‌లకు ఏ గ్రూప్‌తోనైనా ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులు అర్హులు. ఇంటర్ స్థాయిలో జనరల్ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు కనీసం 45 శాతం మార్కులు ఉండాలి.
ఎంబీఏ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో టెక్స్‌టైల్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ మేనేజ్‌మెంట్, రిటైల్ మేనేజ్‌మెంట్, టెక్నికల్ టెక్స్‌టైల్స్ మేనేజ్‌మెంట్, టెక్స్‌టైల్ బిజినెస్ అనలిటిక్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.
అర్హత: యూజీసీ/ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ వరకు జనరల్ కేటగిరీకి కనీసం ద్వితీయ శ్రేణి మార్కులు; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు కనీసం 45 శాతం మార్కులు; ఇతర రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు కనీసం 40 శాతం మార్కులు ఉండాలి.
ఎస్‌వీపీ ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 50 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంట.
- **డిగ్రీ ఎంట్రెన్స్ టెస్ట్ సిలబస్:** ఇంగ్లీష్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్/డేటా ఇంటర్‌ప్రిటేషన్, అనలిటికల్ స్కిల్స్, రీజనింగ్, జనరల్ ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్
- **ఎంబీఏ ఎంట్రెన్స్ టెస్ట్ సిలబస్:** ఇంగ్లీష్/వెర్బల్ ఎబిలిటీ, మేథ్స్/క్వాంటిటేటివ్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్

షార్ట్ టర్మ్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు: మెడికల్ టెక్స్‌టైల్ మేనేజ్‌మెంట్, నాన్ వోవెన్ టెక్స్‌టైల్స్ మేనేజ్‌మెంట్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అప్లికేషన్స్ ఇన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. మొదటి రెండు ప్రోగ్రామ్‌ల వ్యవధి 30 గంటలు. చివరి ప్రోగ్రామ్ వ్యవధి 15 గంటలు. వీటిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు.
అర్హత: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. టెక్స్‌టైల్స్ సంబంధిత విభాగాల్లో అనుభవం ఉన్న స్టూడెంట్స్, ఆంత్రప్రెన్యూర్స్, ఉద్యోగులకు ప్రాధాన్యం ఉంటుంది.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.svpitm.ac.in

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో యూజీ ప్రవేశాలు




తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం(ఎన్ఎస్‌కేటీయూ-సెంట్రల్ యూనివర్సిటీ)- అండర్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నాన్ సీయూఈటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. శాస్త్రీ, బీఏ ఆనర్స్, బీఎస్సీ(కంప్యూటర్స్/యోగా) ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఇవి ఫుల్ టైమ్/రెగ్యులర్ ప్రోగ్రామ్‌లు. బీఏ ఆనర్స్ మినహా ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఏ ఆనర్స్ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. అభ్యర్థి వయసు 2024 ఆగస్టు 15 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. ట్రెడిషనల్ సబ్జెక్టులను సంస్కృత మాధ్యమంలో, మోడరన్ సబ్జెక్టులను ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తారు.
శాస్త్రీ విభాగాలు: వేదభాష్యం, వ్యాకరణం, ఫలిత జ్యోతిషం, వాస్తు, ధర్మశాస్త్రం, న్యాయం, సంఖ్యా యోగ, మీమాంస, అద్వైత వేదాంతం, విశిష్టాద్వైత వేదాంతం, ద్వైత వేదాంతం, ఆగమం, సాహిత్యం, పురాణేతిహాసాలు
అర్హత వివరాలు: సంస్కృతం ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్ ఉత్తీర్ణులు; సంస్కృతంలో డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సులు చేసినవారు; ప్రాక్ శాస్త్రీ ప్రోగ్రామ్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. శాస్త్రీ ప్రోగ్రామ్‌నకు ఉత్తర మాధ్యమ, మాధ్యమ, ఉప సంహిత, వేద విభూషణ కోర్సుల్లో ఒకటి పూర్తిచేసినవారు; బీఎస్సీ(యోగా) ప్రోగ్రామ్‌నకు డిప్లొమా(యోగా)ఉత్తీర్ణులు కూడా అర్హులే. బీఎస్సీ కంప్యూటర్స్ ప్రోగ్రామ్‌నకు ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.
- సీయూఈటీ స్కోర్ ద్వారా అడ్మిషన్స్ పూర్తిచేసిన తరవాత మిగిలిన సీట్లను మాత్రమే నాన్ సీయూఈటీ అభ్యర్థులకు అలాట్ చేస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 21
- **వెబ్‌సైట్:** www.nsktu.ac.in

SCHOLARSHIP ALERT

Aadhar Kaushal Scholarship Program for Youth with Disabilities



Description: An initiative of Aadhar Housing Finance Limited(AHFL) to ensure equal educational opportunities for all physically disabled students, irrespective of their geographical location, gender, or socio-economic condition.
Eligibility: Students with physical disabilities pursuing general or professional undergraduate courses across India. Pan-India students can apply. Students must have achieved a minimum of 60% marks in the preceding academic year. Applicants with a gross annual family income of up to INR 2.5-3 lakh are eligible to apply.
Prizes & Rewards: Scholarship between INR 10,000 - INR 50,000 *Last Date to Apply:* 23-07-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AKSP1

IDFC FIRST Bank MBA Scholarship

Description: IDFC FIRST Bank MBA Scholarship is a need-based scholarship program run by IDFC FIRST Bank to financially support students with a family income of less than INR 6 lakh per annum. The purpose of this scholarship is to make post-graduate studies in business management accessible to meritorious students who are unable to pursue higher studies due to financial constraints.
Eligibility: Indian students enrolled in the first year of a 2-year full-time MBA program for the class of 2024 at selected educational institutions may apply for this scholarship. Applicants' gross annual family income should be less than or equal to INR 6 lakh. Applicants must have a valid mobile number linked to their Aadhaar number.
Prizes & Rewards: INR 2 lakh for 2 years of MBA studies (INR 1 lakh/year) *Last Date to Apply:* 31-07-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/IFBMS5

Muskaan Scholarship Program

Description: A CSR initiative by Valvoline Cummins to offer financial assistance and mentorship support to children of commercial drivers(LMV/HMV), mechanics and individuals from the Economically Weaker Section (EWS) category, ensuring continuity in their education.
Eligibility: Students studying in Classes 9 to 12 from the southern, eastern, and north-eastern states (Assam, Manipur, Nagaland, Mizoram, Tripura, Arunachal Pradesh, Sikkim, Odisha, Bihar, Puducherry, Chhattisgarh, Kerala, Telangana, Andhra Pradesh, Jharkhand, Karnataka, Meghalaya, Tamil Nadu, and West Bengal) are eligible to apply. The scholarship is available to children of commercial drivers (LMV/HMV), mechanics and children from the Economically Weaker Section (EWS) category. Applicants must have scored 60% or above in their previous class to be eligible. The total family income from all sources should not exceed INR 8 lakh per annum.
Prizes & Rewards: Scholarship of up to INR 12,000 and mentorship support
Last Date to Apply: 03-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/MKSP1

buddy4study.com



చిలుక దివ్యదృష్టి


అక్బర్ చక్రవర్తికి ఒక ప్రియమైన ఉంగరం ఉండేది. రోజూ రాత్రి ఆ ఉంగరాన్ని వేలి నుండి తీసి పక్కన పెట్టి ఉదయం మళ్లీ చేతికి పెట్టుకోవటం చక్రవర్తికి అలవాటు. ఒక ఉదయం అక్బర్ చక్రవర్తి నిద్ర లేచేసరికి ఎదురుగా కనిపించాల్సిన ఉంగరం మాయమైంది. తన గదిలో ఎంత వెదికినా ఉంగరం కనపడలేదు. ఎవరు తీశారో కనుక్కోవాలని వెంటనే రాజభక్తులను పిలిపించారు అక్బర్. కోపంతో.. 'ఈ తలుపులు మూసేసి.. పని



వారందరినీ లోపలే ఉండమని చెప్పండి' అని హుకుం జారీ చేశాడు రాజుగారు. ఆ వెంటనే బీర్బల్‌కు కబురు పంపారు.

బీర్బల్ వస్తూ వస్తూ ఓ చిలుకను తీసుకొచ్చారు. ఆ చిలుకను చూడగానే.. 'చిలుక జోతిష్యం చెప్పడానికి మిమ్మలను రమ్మన్నాన' అంటూ కోపంతో మాట్లాడారు అక్బర్. బీర్బల్ మెల్లగా.. 'జహాపనా.. ఈ చిలుక దివ్యదృష్టి కలది. మీ ఉంగరం ఎవరు తీశారో ఇది కనిపెట్టి గాల్లోకి లేచి దొంగ దొంగ.. అని అరుస్తుంది' అని చెప్పాడు. బీర్బల్ తన చేత్తో చిలుక తలమీద నిమిరాడు. అది రెక్కలు టపటపలాడిస్తూ దొంగ దొంగ.. అని అరిచింది గాల్లోకి వెళ్లి. ఆ అరుపులు విని అక్కడి పనివాడు ఒకడు మెల్లగా జారుకోవటానికి ప్రయత్నించాడు. 'ఇదిగో మీరు వెతుకుతున్న దొంగ' అని ఆ దొంగను అప్పగించాడు బీర్బల్. అక్బర్ ఆశ్చర్యపోయారు. 'ఈ చిలుకకు దివ్యదృష్టి ఎలా వచ్చింది' అంటూ ఆసక్తితో అడిగారు. 'మరేం లేదు మహారాజా.. ఈ చిలుకకు దొంగ.. అనే మాట మాత్రమే నేర్పించాను. నిజంగా దొంగతనం చేసినవాడు తనను చూసి అరుస్తుందేమోనని అనుకుంటాడు. భయంతో తప్పించుకోవాలని ప్రయత్నిస్తాడు. అందుకే సులువుగా పట్టుకోగలిగాం'అని జవాబు చెప్పాడు బీర్బల్. ఆ చమత్కారానికి అక్బర్ మనసారా నవ్వుకున్నారు. బీర్బల్‌కు మంచి బహుమానాలు ఇచ్చారు.


6 తేడాలు గుర్తించండి!



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 354

7			1					2
1								
	2			3		7		6
5	3				9	6		
	6		7		1		9	
		4	2				5	8
6		5		7			3	
								4
2					4			5

సుడోకు - 353 సమాధానం

6	3	8	1	2	5	4	9	7
1	4	2	6	7	9	3	5	8
7	9	5	4	3	8	6	2	1
4	5	7	9	6	1	8	3	2
9	8	3	7	4	2	1	6	5
2	6	1	8	5	3	7	4	9
3	1	9	5	8	4	2	7	6
8	7	4	2	9	6	5	1	3
5	2	6	3	1	7	9	8	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.